సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 348

సోమవారం 9-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



‘ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి’



**ఫైనల్లో ఓటమి**

మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి –స్పోర్ట్స్‌లో



**పెద్దలకు పరిపూర్ణ రక్షణ**

హెల్త్ ఇన్సూరెన్స్ తప్పకుండా తీసుకోవాలి తగినంత కవరేజీ అవసరం – బిజినెస్‌లో

# పల్లెకు.. పట్టణానికి ధూంధాం

## బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు

## అన్నదాతకు అన్నింటా అండ..

## సంక్షేమానికి పూదండ



ఇది పూర్తి సమతుల్యత బడ్జెట్. సంక్షేమ తెలంగాణ కోసం రచించిన ప్రగతిశీల బడ్జెట్. రాష్ట్ర ఆదాయ వనరులు, ప్రజల అవసరాలకు మధ్య సమతుల్యత సాధించిన వాస్తవిక బడ్జెట్. - సీఎం కేసీఆర్






మొత్తం బడ్జెట్.. 1,82,914.42

ప్రగతి పద్దు 1,04,612.62

నిర్వహణ పద్దు 78,301.80

| బడ్జెట్ అంచనాలివే.. (రూ.కోట్లలో) | |
|---|---|
| రెవెన్యూ రాబడి | 1,43,151.94 |
| రెవెన్యూ వ్యయం | 1,38,669.82 |
| పన్ను రాబడి | 85,300.00 |
| పన్నేతర రాబడి | 30,600.00 |
| కేంద్రం వాటా | 16,726.58 |
| గ్రాంట్లు | 10,525.36 |
| రుణాలు | 35,500 |
| మూలధన వ్యయం | 22,061.18 |
| రెవెన్యూ మిగులు | 4,482 |
| ద్రవ్యలోటు | 33,191.25 |

రూ. 65,480 తలసరి అప్పు..

రాష్ట్ర ప్రజలపై పెరిగిన అప్పుల భారం

మరిన్ని వివరాలు 2,5,6,7,8,9 పేజీల్లో

## అంచనాలకు అందని విధంగా 2020-21 రాష్ట్ర బడ్జెట్..

రూ.1.82 లక్షల కోట్లతో భారీగా ప్రతిపాదనలు

- రైతు రుణమాఫీకి శ్రీకారం.. రైతుబంధుకు నిధుల పెంపు
- మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు రూ.25వేల కోట్లు
- జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు కేటాయింపులు
- ఆసరా పింఛన్ల అర్హత వయసు 57కి తగ్గింపు
- విద్య, వైద్య రంగాలకూ విశేష ప్రాధాన్యం
- పన్ను రాబడులు, పన్నేతర ఆదాయం అంచనాలు పెంపు
- భూములు, నిరర్థక ఆస్తుల అమ్మకంపైనే ఆశలు
- మళ్లీ పెరిగిన అప్పుల పద్దు.. గత బడ్జెట్ కంటే 3వేల కోట్లు ఎక్కువ
- శాసనసభలో తొలిసారిగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి హరీశ్

గ్రామ స్థాయి నుంచి పార్లమెంటు వరకు అన్ని ఎన్నికలు పూర్తి అయ్యాయి. ప్రతి ఎన్నికలోనూ ప్రజలు మాపై సంపూర్ణ విశ్వాసం ప్రదర్శించారు. మేం ఎంచుకున్న బాట సరైందని, మా వ్యూహాలు సఫలమవుతున్నాయని తేల్చిచెప్పారు. మా పంథా ఇకపైనా కొనసాగించే నిర్ణయంతో వచ్చే నాలుగేళ్ల రాష్ట్ర భవిష్యత్తు పురోగతికి ప్రణాళిక రచన చేశాం. ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలపై అవగాహనతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రజల ముందుంచుతున్నాం. - మంత్రి హరీశ్

| | |
|---|---|
| మాంద్యంలోనూ ప్రగతి బాట.. | విద్యకు రూ.12,127కోట్లు |
| పల్లెకు ప్రగతి | సాగుకు రుణాల జోరు |
| ఆరోగ్యమస్తు | ల్యాండ్ ఫర్ సేల్! |

## మారుతిరావు ఆత్మహత్య

- ప్రణయ్ హత్యకేసులో ప్రధాన నిందితుడు
- వైశ్యభవన్‌లో విషం తాగి బలవన్మరణం
- న్యాయవాదిని కలిసేందుకు నగరానికి రాక
- బస చేసిన గదిలో సూసైడ్ నోట్ లభ్యం
- మిర్యాలగూడకు మృతదేహం తరలింపు



మిర్యాలగూడ ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు, అమృత తండ్రి మారుతిరావు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. న్యాయవాదిని కలవడానికి శనివారం నగరానికి వచ్చిన ఆయన ఖైరతాబాద్‌లోని వైశ్యభవన్‌లో బస చేశారు. ఆదివారం ఉదయం తాను ఉంటున్న గదిలో విగతజీవిగా కనిపించారు. ప్రాథమిక ఆధారాలను బట్టి ఆయన విషంతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మారుతిరావు బసచేసిన గదిలో సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో ‘గిరిజా క్షమించు.. అమృతా అమ్మ దగ్గరకు రా అమ్మా’ అని మాత్రమే ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

-16లో

## బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య


రంజిత్ (ఫైల్)

హైదరాబాద్: బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా ఇంజనీర్ పనిచేస్తున్న హైదరాబాద్‌వాసి ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం 35 ఏళ్ల క్రితం ఉప్పల్ గణేష్‌నగర్‌కు వచ్చి స్థిరపడింది. శ్రీనివాస్‌రెడ్డికి కుమా రుడు రంజిత్ కుమార్‌రెడ్డి (25), కుమార్తె ఉన్నారు. రంజిత్ హబ్సిగూడ జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో 10వ తరగతి వరకు చదివాడు. తార్నాక నారాయణ కళాశాలలో ఇంటర్, రూర్కీ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. మూడేళ్ల క్రితం నుంచి బెంగుళూరులోని వీసా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కూతురి వివాహానంతరం శ్రీనివాస్‌రెడ్డి కూడా భార్య విజయలక్ష్మితో కలసి బెంగళూరులో కుమారుడి వద్దనే ఉంటున్నాడు. కాగా, 3రోజుల క్రితం శ్రీనివాస్ రెడ్డి దంపతులు బంధువుల శుభకార్యానికి బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సమయంలో ఒంటరిగా ఉన్న రంజిత్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బెంగళూరుకు తరలివెళ్లారు. కాగా, రంజిత్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.



ప్రధాని సోషల్ ఖాతాలు

## ఆ ఏడుగురికి..

- తన సోషల్ మీడియా ఖాతాలను వారికి అప్పగిస్తూ ప్రధాని ట్వీట్
- సామాజిక మాధ్యమాల వేదికగా స్ఫూర్తిని నింపిన మహిళా శక్తి
- ఏడుగురిలో హైదరాబాద్‌కు చెందిన కల్పనా రమేష్ కూడా...

- వివరాలు 15లో

## భారత్ @ 39

- కేరళలో మరో 5 కోవిడ్ కేసులు
- 95 దేశాలకు పాకిన వైరస్... 3,595 మంది మృతి
- అమెరికా అధ్యక్షుడి భేటీకి హాజరైన వ్యక్తికి సోకిన వైరస్
- చైనాలో కోవిడ్ ఆస్పత్రి భవనం కూలి 10 మంది మృత్యువాత

- వివరాలు 15లో





































## బడ్జెట్ కామెంట్స్

### ఇది ప్రగతిశీల బడ్జెట్

**మంత్రి హరీశ్‌కు అభినందనలు తెలిపిన సీఎం**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ 2020–21 పూర్తి సమతుల్యతతో ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఇది సంక్షేమ తెలంగాణ కోసం రచించిన ప్రగతిశీల బడ్జెట్‌గా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయ వనరులు, ప్రజల అవసరాలకు మధ్య సమతుల్యత సాధించిన వాస్తవిక బడ్జెట్ అని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అన్ని రంగాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసుకున్న ప్రణాళికలకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులున్నాయని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ఆర్థిక మాంద్యం నెలకొని రాబడులు తగ్గి, కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో కోతలు పడినప్పటికీ రాష్ట్రాభివృద్ధి కుంటుపడకుండా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల వికాసానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు, సంక్షేమ పథకాల్లో మరింత మంది పేదలకు అవకాశం రావాలనే సంకల్పానికి, ఎన్నికల హామీల అమలుకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారని తెలిపారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మంత్రి హరీశ్‌రావును సీఎం అభినందించారు. మండలిలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఆర్థిక శాఖ అధికారులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

### కేంద్ర సహకారం లేకున్నా..



'కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోయినా ఇంత భారీ బడ్జెట్ ప్రవేశ పెట్టడం కేవలం కేసీఆర్ నాయకత్వానికే చెల్లింది. పట్టణ, గ్రామ ప్రజలకు ఇద్దరికి న్యాయం చేశారు. రైతుల కు మా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ బడ్జెట్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో మరింత ముందుకు రాష్ట్రం వెళ్తుంది.'

*–కర్నె ప్రభాకర్, మండలిలో ప్రభుత్వ విప్*

### సంక్షేమానికి ప్రముఖస్థానం



'ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూ ఈ బడ్జెట్ ప్రతిపాదించా రు. సంక్షేమ, వ్యవసాయ రంగాలకు ఈ బడ్జెట్‌లో ప్రముఖ స్థానం కల్పించారు'

*–బాల్క సుమన్, అసెంబ్లీలో ప్రభుత్వ విప్*

### మోసపూరిత బడ్జెట్



'ఇదో మోసపూరిత బడ్జెట్. కేంద్రం వాటా మూడు వేల కోట్లు తగ్గాయని రాష్ట్ర ఆదాయం తగ్గిందన్నారు. మరి బడ్జెట్ తగ్గాలి కానీ ఎలా పెరిగింది..? 24% ఖర్చు అప్పులు కట్టడానికి పోతే 76% మాత్రమే మిగులుతుంది. దీంతో సంక్షేమం ఎలా సాధ్యం అవుతుంది. ఈ బడ్జెట్లో యువకులకు భరోసా ఇచ్చేవిధంగా ఐదు పైసలు కూడా నిధులు కేటాయించలేదు' *– షబ్బీర్ అలీ, మాజీ మంత్రి*

### నిరుద్యోగులకు నిరాశ



'ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థులకు బడ్జెట్‌లో అన్యాయం జరిగింది. నిరుద్యోగ యువత నిరాశ చెందారు. విద్యా బడ్జెట్‌ను కుదించటం బాధాకరం. ప్రస్తుత కేటాయింపులు ఫీజు బకాయిలకు కూడా సరిపోదు. ఉపాధి అవకాశాల సంగతి దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగ భృతి సంగతి ఏంటో ప్రభుత్వం చెప్పాలి. పీఆర్సీ ఆలస్యమైతే.. మధ్యంతర భృతి ఇవ్వాలి'

*– కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి*

### బీసీలకు అన్యాయం: ఆర్.కృష్ణయ్య



బడ్జెట్ బీసీలకు తీవ్ర నిరాశ కలిగించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని చట్టం చెబుతోందని, కానీ జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు కేవలం 2.5 శాతం నిధులు మాత్రమే కేటాయించడం అన్యాయమని పేర్కొన్నారు.

**ఆదివారం శాసనసభలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థికమంత్రి హరీశ్‌రావు. చిత్రంలో సీఎం కేసీఆర్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్, ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ తదితరులు**



# ..ధూంధాం

**అంచనాలకు అందని విధంగా 2020–21 రాష్ట్ర బడ్జెట్**
**రూ.1.82 లక్షల కోట్లతో భారీగా ప్రతిపాదనలు**

**సాక్షి, హైదరాబాద్:** ఎవరి ఊహలు, అంచనాలకు అందని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో భారీ ప్రతిపాదనలు చేసింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, పన్ను వృద్ధి రేటు తగ్గుదల, ఆర్థిక మాంద్యం, కోవిడ్ ప్రభావం, కేంద్ర సాయం వంటి అంశాలను అస్సలు ఖాతరు చేయలేదు. రైతు, పల్లె, పట్టణం అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే పరమావధిగా 2020–21 సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించింది. రాష్ట్రంలోని ప్రతి రైతునూ రాజును చేసేవరకు నిద్రపోమంటూ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానమిచ్చిన సీఎం కేసీఆర్ వ్యాఖ్యలకు అనుగుణంగానే ఈసారి బడ్జెట్‌లో అన్నదాతకు అగ్రతాంబూలమిచ్చింది. విద్యకు చదివింపులు ఘనంగా జరిపింది. ఆరోగ్య'మస్తు'అనిపించింది. సంక్షేమానికీ సై అంది. పింఛన్లకు పెద్ద మనసుతో నిధులిచ్చింది. పల్లె ప్రగతికి, పట్నం వృద్ధికి ప్రాధాన్యత కనబర్చింది. వెరసి.. పరిస్థితులు సహకరించకున్నా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో ఏమాత్రం రాజీపడలేదు. రైతు, పల్లె, పట్నం కేంద్రంగా అన్ని వర్గాలు, అన్ని శాఖలకు ప్రాధాన్యతనిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆదివారం ఆర్థికమంత్రి హరీశ్‌రావు తొలిసారిగా శాసనసభలో ప్రవేశపెట్టారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శాసనమండలిలో బడ్జెట్ సమర్పించారు. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలూ లేనప్పటికీ, ఎన్నికల బడ్జెట్ తరహాలోనే అన్ని వర్గాలనూ సంతృప్తిపరిచే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. 2019–20 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే తాజా బడ్జెట్ ఏకంగా 25 శాతం మేర పెరిగింది.

**ఓటాన్ అకౌంట్‌తో సమానంగా..**

అన్ని రకాల అంచనాలు, ఖర్చులు, కేటాయింపులను పెంచుతూ 2020–21 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. 2019–20 ఓటాన్ అకౌంట్ అంచనాలకు సమానంగా రూ.1.82 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గతేడాది 1.82 లక్షల కోట్ల మేర ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టగా.. గతేడాది సెప్టెంబర్ 9న ప్రవేశపెట్టిన 2019–20 సాధారణ బడ్జెట్ అంచనాలు 1.46 లక్షల కోట్లకు తగ్గిపోయాయి. సవరించిన అంచనాల ప్రకారం అది రూ.1.42 లక్షల కోట్లకు తగ్గింది. ఈ నేపథ్యంలో ఆ మొత్తానికి రూ.40వేల కోట్లను కలిపి రూ.1.82 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పరపతి మెరుగ్గానే ఉన్నట్టు చూపించింది.

**పెరిగిన పన్ను అంచనాలు**

2020–21 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలను చూస్తే అన్ని రకాల పన్ను అంచనాలు పెరిగాయి. ఆర్థిక మాంద్యం ప్రభావం కారణంగా రాష్ట్ర పన్నుల రాబడితోపాటు కేంద్రం నుంచి వచ్చే వాటా తగ్గుతుందనే అంచనాలను తలకిందులు చేస్తూ పన్ను అంచనాలను భారీగా పెంచుతూ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. ముఖ్యంగా పన్నేతర ఆదాయాన్ని 150శాతం వరకు పెంచింది. 2019–20 సవరించిన అంచనాల్లో రూ.12వేల కోట్లకు పైగా పన్నేతర ఆదాయం రాగా, ఈసారి దాన్ని ఏకంగా రూ.30,600 కోట్లకు పెంచింది. కేంద్ర పన్నుల్లో వాటా, జీఎస్టీతో కలిపి రాష్ట్ర పన్నులు, గ్రాంట్ ఇన్‌ఎయిడ్, అమ్మకపు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ ఆదాయం, ఇతర పన్నులు.. ఇలా అన్ని కేటగిరీల్లోనూ పెద్ద ఎత్తున రాబడులను ఆశిస్తూ ప్రతిపాదనలు చేసింది. పన్నుల ద్వారా మొత్తం రూ.85,300 కోట్ల రాబడి వస్తుందని అంచనా వేసింది. ఈసారి రెవెన్యూ రాబడి రూ.1.43 లక్షల కోట్లకు పైగా ఉంటుందని, ఇందులో 1.38 లక్షల కోట్ల వ్యయం పోగా రూ.4,482 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని లెక్కగట్టింది. అయితే, ద్రవ్యలోటు మాత్రం భారీ పెరిగింది. 2019–20లో ద్రవ్యలోటు రూ.24వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేయగా, సవరించిన అంచనాల్లో అది రూ.21,913 కోట్లకు తగ్గింది. అయితే, 2020–21 ఆర్థిక సంవత్సరానికి అది రూ.33,191.25 కోట్లకు పెరిగింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల కంటే ఇది దాదాపు రూ.11వేల కోట్లు ఎక్కువ.

**ఆదాయమార్గాల కోసం అన్వేషణ...**

పరిస్థితులు సానుకూలంగా లేకున్నా భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా అప్పులు, భూములు, నిరర్థక ఆస్తులపైనే ఆశలు పెట్టుకుందని అర్థమవుతోంది. హరీశ్‌రావు బడ్జెట్ ప్రసంగంలోనూ, ఆ తర్వాత విలేకరులతో మాట్లాడినప్పుడు ఈ విషయాన్ని నర్మగర్భంగానే వెల్లడించారు. ఆదాయ పెంపు మార్గాలను అన్వేషిస్తున్నామని, 'దిల్'సంస్థను తెరపైకి తెస్తున్నామని, భూముల అమ్మకాలకు సిద్ధంగా ఉన్నామని, రాజీవ్ గృహకల్ప వంటి నిరర్థక ఆస్తులను విక్రయిస్తామని, సొంత రాబడులను పెంచుకునే మార్గాలపై దృష్టి పెడతామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే 2019–20లో రూ.12వేల కోట్లకు పైగా ఉన్న పన్నేతర ఆదాయాన్ని రూ.30,600 కోట్లకు పెంచినట్టు అర్థమవుతోంది. ఈ రెండేళ్ల ప్రతిపాదనల మధ్య ఉన్న దాదాపు రూ.18వేల కోట్ల వ్యత్యాసాన్ని భూములు, నిరర్థక ఆస్తుల అమ్మకం ద్వారానే సమకూర్చుకోవాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

**రైతన్నే రారాజు...**

ఎన్నికల్లో కీలక హామీ అయిన రైతు రుణమాఫీ అమలుకు ఈ బడ్జెట్‌లో సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.6,200 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. రైతుబంధు సాయాన్ని రూ.12వేల కోట్ల నుంచి రూ.14వేల కోట్లకు పెంచింది. రైతుబీమాను పెంచడంతో పాటు మార్కెట్ స్థిరీకరణ నిధిని కూడా పక్కాగా కేటాయించడం ద్వారా రైతన్నకు జైకొట్టింది. ఇక పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు రూ.25వేల కోట్ల మేర కేటాయింపులు జరిపింది. ఇప్పటివరకు అమలవుతున్న అన్ని పథకాలను కొనసాగిస్తూనే కొత్తగా 57 ఏళ్ల నిండిన వారికి ఆసరా పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. పింఛన్లకు దాదాపు రూ.12వేల కోట్ల ప్రతిపాదనలు చేసింది. హైదరాబాద్‌కు ప్రత్యేకంగా రూ.10వేల కోట్లు కేటాయించడం ద్వారా విశ్వనగర అభివృద్ధికి బాటలు వేసింది. జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రూ.26వేల కోట్లకు పైగా నిధులు కేటాయించిన ప్రభుత్వం.. డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ అవసరాలకు అనుగుణంగా గృహనిర్మాణశాఖకు రూ.11వేల కోట్లకు పైగా నిధులు ప్రతిపాదించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇప్పటివరకు ఉన్న బకాయిలను కూడా కలిపి రూ.2,600 కోట్ల మేర నిధులు కేటాయించింది.

# మాంద్యంలోనూ ప్రగతిబాట

**రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నాం**
**వాస్తవిక, ప్రగతిశీల బడ్జెట్‌ను రూపొందించాం**
**సంక్షేమ నిధులకు ఎక్కడా కోత పెట్టలేదు**
**2020-21 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు**
**ప్రసంగానికి ముందు, తర్వాత సీఎంకు పాదాభివందనం**

సాక్షి, హైదరాబాద్

''గ్రామ స్థాయి నుంచి పార్లమెంటు వరకు అన్ని ఎన్నికలు పూర్తయ్యాయి. ప్రతి ఎన్నికలోనూ ప్రజలు మాపై సంపూర్ణ విశ్వాసం ప్రదర్శించారు. మేం ఎంచుకున్న బాట సరైందని, మేం అవలంబిస్తున్న వ్యూహాలు సఫలమవుతున్నాయని తేల్చిచెప్పారు. మా పంథా ఇకపైనా కొనసాగించే నిర్ణయంతో వచ్చే నాలుగేళ్ల రాష్ట్ర భవిష్యత్తు పురోగతికి ప్రణాళిక రచన చేశాం. ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలపై స్పష్టమైన అవగాహనతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రజల ముందుంచుతున్నాం. ఇది కేవలం వార్షిక బడ్జెట్ దృక్పథంతో కాకుండా ప్రజలే కేంద్రంగా ప్రగతిశీల బడ్జెట్ రూపొందించాం'' అని 2020–21 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. గత ఆరేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు స్వాగతిస్తున్నారని, అదే ఉత్సాహంతో వచ్చే నాలుగేళ్ల కాలానికి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసే ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అందులో వచ్చే సంవత్సరానికి వాస్తవిక, ప్రగతిశీల బడ్జెట్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. అసెంబ్లీలో 62 నిమిషాలపాటు ఆయన బడ్జెట్ ప్రసంగం సాగింది. తన ప్రసంగం ప్రారంభానికి ముందు సీఎం చాంబర్‌లో, ప్రసంగం ముగించాక సభలో హరీశ్‌రావు సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేశారు. హరీశ్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

**సంక్షేమంలో కోత లేదు...**

''సంక్షేమ కార్యక్రమాల నిధుల్లో ఎక్కడా కోత విధించలేదు. పైగా లబ్ధిదారుల సంఖ్యను పెంచుతూ కావాల్సిన నిధులను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతటి నిబద్ధతతో పనిచేస్తోందో ఈ బడ్జెట్ అంకెలే చాటిచెబుతున్నాయి. ఆర్థిక మాంద్యానికి విరుగుడు ప్రజల కొనుగోలు శక్తిని పెంచటమే.ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, పెట్టుబడి వ్యయానికి నిధులు వినియోగించడం అనే ద్విముఖ వ్యూహంతో ప్రభుత్వం ఆర్థికాభివృద్ధిని సాధిస్తోంది.

**ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా..**

దేశంలో ఆర్థిక మాంద్యం నెలకొన్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన ఆర్థిక పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది. గత ఐదేళ్లలో రాష్ట్ర సొంత రాబడి సగటు వృద్ధి రేటు 21.5 శాతం ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరి మాసాంతానికి 6.3 శాతం తగ్గి 15.2 శాతం వద్ద నిలిచింది. ఇక 2014 మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ. లక్షలోపు ఉన్న వ్యవసాయ రుణాలను మాఫీ చేశాం. గత ఎన్నికల్లో కూడా ఆ హామీ ఇచ్చాం. ఆర్థిక మాంద్యం ముందరి కాళ్లకు బంధం వేస్తున్నప్పటికీ దాని అమలుకు శ్రీకారం చుడుతున్నాం.

**57 ఏళ్లు నిండితే వృద్ధాప్య పింఛన్...**

కొత్త ఆర్థిక సంవత్సరం నుంచే 57 ఏళ్లు నిండిన వారికి వృద్ధాప్య పింఛన్లు అందించబోతున్నాం. దీనివల్ల 39,41,976 ఆసరా పెన్షన్ల సంఖ్య భారీ గా పెరగనుంది. గత బడ్జెట్‌లో ఆసరా పెన్షన్లకు రూ. 9,402 కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో ఆ కేటాయింపులను రూ. 11,758 కోట్లకు పెంచాం.

**రాష్ట్రమే టాప్..**

తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే చాలా ఎక్కువగా ఉంది. 2019–20 నాటికి తెలంగాణ తలసరి ఆదాయం రూ. 2,28,216గా ఉంటే దేశ తలసరి ఆదాయం రూ. 1,35,050గా ఉంది. ఇది మన ప్రగతికి స్పష్టమైన సంకేతం.

**అంబేడ్కర్ మాటలు మననం చేసుకుంటూ...**

సమాజ వికాసానికి నిజమైన కొలమానం మహిళాభివృద్ధి స్థాయేనని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అన్నారు. ఆయన మాటలను మననం చేసుకుంటూ మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నాం. ఆరోగ్య లక్ష్మి, అమ్మ ఒడి , కేసీఆర్ కిట్ పథకాలతో మహిళల సంక్షేమానికి ఈ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. మహిళలపై అకృత్యాలను అరికట్టేందుకు ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, షీ టీమ్స్ పనిచేస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో మహిళా స్వయం సహకార సంఘాలకు వడ్డీ లేని రుణాల కోసం రూ. 1,200 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.



**బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్న మంత్రి హరీశ్. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

### కాళేశ్వరం వెనుక కేసీఆర్ ఉక్కు సంకల్పం...

కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా రూపొంది రికార్డు సృష్టించేందుకు సీఎం కేసీఆర్ ఉక్కు సంకల్పమే కారణం. ఫలితంగా గోదావరి 150 కి.మీ. మేర జీవధారగా మారింది. ఇది తెలంగాణ అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా ఉపయోగపడుతుంది. ఇదే స్ఫూర్తితో పాలమూరు–రంగారెడ్డి, సీతారామ తదితర ప్రాజెక్టుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. కొద్ది కాలంలోనే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ల నిర్మాణం పూర్తవుతుంది.

### వృద్ధిరేటుకు పన్నుల వాటా ఎసరు...

2019–20లో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా, బడ్జెట్‌లో వేసుకున్న అంచనాల కంటే రూ. 3,731 కోట్ల మేర తగ్గింది. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన ఐజీఎస్టీ, జీఎస్టీ పరిహారంలో నిధులు సకాలంలో అందడం లేదు. దీంతో రాష్ట్ర రెవెన్యూ వృద్ధిరేటు 2018–19లో 16.10 శాతం ఉంటే 2019–20 ఫిబ్రవరి చివరి నాటికి 6.3 శాతానికి తగ్గింది. 15వ ఆర్థిక సంఘం మధ్యంతర నివేదిక ప్రకారం తెలంగాణకు వచ్చే పన్నుల వాటా 2.43 శాతం నుంచి 2.13 శాతానికి తగ్గింది.

### హైదరాబాద్ అభివృద్ధికి రూ.50 వేల కోట్లు

**వచ్చే నాలుగేళ్లలో ఖర్చు చేస్తాం: మంత్రి కేటీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** రాజధాని నగరంతో పాటు దాని పరిసర ప్రాంతాల అభివృద్ధికి వచ్చే నాలుగేళ్లలో రూ.50 వేల కోట్లు ఖర్చు చేయనున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శాసనసభకు ప్రతిపాదించిన 2020–21 వార్షిక బడ్జెట్‌లో హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించినందుకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాల అభివృద్ధితో పాటు మూసీ నది ప్రక్షాళన, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌ను విశ్వ నగరంగా మార్చాలన్న తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతకు బలం చేకూర్చే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌డీపీ కార్యక్రమంతో నగరంలో ఇప్పటికే అనేక ప్రాజెక్టులను చేపట్టి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని, పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ తగ్గించేందుకు ఫ్లై ఓవర్లు, అండర్‌పాసులను వినియోగంలోకి తెచ్చామన్నారు. రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ప్రణాళికలు కొనసాగుతున్నాయని వివరించారు.



### భ్రమల్లో ముంచుతోంది..



''టీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌తో ప్రజలను భ్రమల్లో ముంచుతోంది. ఒక పక్కన ఆర్థిక మాంద్యం ఉందంటూనే...ఈసారి 25% గ్రోత్ చూపించారు. గతేడాది బడ్జెట్ కంటే 25% పెంచి ప్రజలను మాయ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాము అని చెప్పుకోవడానికి మాత్రమే. దళితు లు, ఇతర వర్గాలకు మూడెకరాల పంపిణీ ఎక్కడ కనిపించలేదు. ఉద్యోగాలభర్తీ ఊసే లేదు. 2014 నుంచి 2020–21 బడ్జెట్ లెక్కలు చూస్తే వృద్ధి ఏపాటిదో అర్థం అవుతుంది. వచ్చే ఆదాయాలు బాగానే ఉన్నా బడ్జెట్‌లో గ్రోత్ మాత్రం 15% మాత్రమే. బడ్జెట్‌లో కేటాయింపులు, ఖర్చు చేస్తున్న వ్యయాలకు సంబంధించి అసెంబ్లీలో అంకెలతో సహా ప్రజలకు తెలియజేస్తాం.''

*– మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత*

### అంకెల గారడీగా..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీ అని, అది మసిపూసి మారేడుకాయ చేసినట్లుగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. వాస్తవాలకు దూరంగా బడ్జెట్ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చుకోవడానికే బడ్జెట్‌ను పెంచుకుందని ఆరోపించారు. గత ఆరేళ్లలో కేటాయింపులకు, నిధుల ఖర్చుకు వ్యత్యాసం ఉందన్నారు. ఈ ఆరేళ్లలో కేటాయింపుల్లో 60% కూడా ప్రభుత్వం ఖర్చు చేయలేదని పేర్కొన్నారు.

### మరోసారి నేలవిడిచి సాము



'బడ్జెట్‌తో మరోసారి నేల విడిచిసాము చేసినట్లుగా ఉంది. మిగులు బడ్జెట్ అని గొప్పలు చెబుతున్నా రూ.33వేల కోట్ల ద్రవ్యలోటును చూపడం డొల్లతనానికి నిదర్శనం. ప్రభుత్వ ఆస్తులు, భూములను అమ్మినా కూడా ప్రభుత్వం వివిధ పద్దుల కింద భారీగా పెంచామని చెబుతున్నా నిధులు పూర్తిగా విడుదలయ్యే అవకాశం లేదు. నిరుద్యోగులు, ప్రభుత్వోద్యోగులకు మొండిచెయ్యి చూపారు.డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేవలం లక్ష మాత్రమే మంజూరు చేయడం ఎంగిలి మెతుకులు విదిలించినట్టు ఉంది. వ్యవసాయరుణాలు 4 విడతల్లో మాఫీ చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. *– చాడ వెంకటరెడ్డి, సీపీఐ కార్యదర్శి*

### రుణగ్రస్తం కాదు రాష్ట్రాభివృద్ధి బడ్జెట్ కావాలి



'బడ్జెట్ అంటే కాగితాలపై వేసుకునే అంకెల వరస కాదని సామాజిక విలువల స్వరూపమని ఆర్థిక మంత్రి హరీశ్ ప్రకటించినా దీనికి ఒక లక్ష్యం, దిశా నిర్దేశనం కనిపించడంలేదు. రాష్ట్రాన్ని రుణగ్రస్తం చేసే బడ్జెట్ కాకుండా రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలనేది మా డిమాండ్. ప్రజల కొనుగోలు శక్తి పెరిగే విధంగా బడ్జెట్‌ను తిరిగి రూపకల్పన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. చేనేత కార్మికుల ఆత్మహత్యల నివారణకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు.' *– తమ్మినేని వీరభద్రం, సీపీఎం కార్యదర్శి*

‘మే’లో బాల రచయితల

# సమ్మేళనం

## రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బి.వినోద్‌కుమార్



**హైదరాబాద్:** రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న వందలాది మంది బాల కథా రచయితలతో రాష్ట్ర స్థాయి బాల రచయితల సమ్మేళనాన్ని మే నెలలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో 10 ఉమ్మడి జిల్లాల నుంచి బాల కథా రచయితలు రాసిన 10 కథా సంకలనాలను వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే మరో 50 ఏళ్లు తెలుగు సాహిత్యం బతకాలంటే ఈనాటి బాలలే తెలుగు భాషా పరివ్యాప్తికులు కావాలని ఆకాంక్షించారు. తెలుగు సాహిత్యాన్ని బతికించాలంటే పాఠశాల దశ నుంచే పిల్లలు సాహిత్య అధ్యయనం, రచనలు చేయటాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర సంస్కృతి, కళలు బతికించాలంటే అందుకు నేటి తరాన్ని సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. బడిపిల్లల స్థాయి నుంచే కథలు, కవిత్వం, వ్యాసాలు, కల్పికలు, నవలలు చదవటం, రాయటంపై ఆసక్తి కలిగించాలన్నారు. మొత్తం పాఠశాల విద్యలో సాహిత్య అధ్యయనాన్ని పెంచేలా చేస్తే అది మానవీయ తెలంగాణ నిర్మాణానికి దోహదం చేస్తుందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. మే నెలలో 600 మంది బాల కథా రచయితలతో హైదరాబాద్‌లో బాల రచయితల సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తామని చిల్డ్రన్స్ అకాడమీ చైర్మన్, ‘బాలచెలిమి’సంపాదకుడు మణికొండ వేదకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కవి, రచయిత, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ పాల్గొన్నారు.

## మహిళలకు సీఎం శుభాకాంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అతివలు అన్ని రంగాల్లో రాణించిన సమాజమే అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించి, పురోగమించాలని ఆకాంక్షించారు. వారికి యావత్ సమాజం అండగా నిలవాలని సీఎం కోరారు.

### గాంధీభవన్‌లో మహిళా దినోత్సవం

**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నేతలు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం అనే అంశంపై ఆ పార్టీ ఎమ్మెల్యే సీతక్క ప్రసంగించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

19 జిల్లాలకు బీజేపీ

# అధ్యక్షుల నియామకం

## ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి 5 జిల్లాల పదవులు

**సాక్షి, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఈ నియామకాలను ప్రకటించారని బీజేపీ ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి వెల్లడించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించగా, అందులో 5 జిల్లాలకు ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన వారికి జిల్లా అధ్యక్ష పదవులను అప్పగించారు. అందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా టీడీపీ నుంచి బీజేపీలో చేరిన కోనేరు సత్యనారాయణ (చిన్ని), వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా కాంగ్రెస్ నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా టీఆర్‌ఎస్ నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణతోపాటు నిజామాబాద్‌కి (బి.లక్ష్మీ రసయ్య), జనగాం జిల్లాకు (ఎ.దశ్మంత్‌రెడ్డి)లను నియమించారు. అలాగే పార్టీలో కొత్తగా చేరిన ఎ.సుధాకర్‌రావును నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. వారితోపాటు ఆదిలాబాద్ (పాయల్ శంకర్), మంచిర్యాల (వి.రఘునాథ్‌రావు), నిర్మల్ (డాక్టర్ పి.రమాదేవి), ఆసిఫాబాద్ (జేబీ పాడెల్), కరీంనగర్ (బాస సత్యనారాయణ రావు), సంగారెడ్డి (ఎం.నరేందర్‌రెడ్డి), రంగారెడ్డి (బొక్క నర్సింహారెడ్డి), నల్లగొండ (కంకణాల శ్రీధర్‌రెడ్డి), యాదాద్రి భువనగిరి (పీవీ శ్యాంసుందర్‌రావు), నాగర్‌కర్నూల్ (ఎ.సుధాకర్‌రావు), జోగులాంబ గద్వాల (ఎస్.రామచంద్రారెడ్డి), నారాయణపేట్ (పి.శ్రీనివాసులు), వరంగల్ అర్బన్ (రావు పద్మ), భూపాలపల్లి (కె.యుగదీశ్వర్) జిల్లాలకు అధ్యక్షులను నియమించారు.




## సలూరాలో 4 సెంటీమీటర్ల వర్షం

**సాక్షి, హైదరాబాద్:** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సలూరాలో ఆదివారం 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే కరీంనగర్ జిల్లా చింతకుంట, మెదక్ జిల్లా రామాయంపేట, కొమురంభీం జిల్లా వెంకట్రావ్‌పేటలో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఇదిలావుండగా ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు కోస్తా కర్ణాటక నుంచి ఉత్తర తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీంతో సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# ‘అందరి కృషితోనే గాంధీ కల సాకారం’

**సాక్షి, హైదరాబాద్:** సమాజం, ప్రభుత్వం, చట్టాలు... ఇవన్నీ సంయుక్తంగా కృషి చేస్తేనే అర్ధరాత్రి మహిళ ఒంటరిగా తిరగగలగాలి అన్న గాంధీజీ కల సాకారం అవుతుందని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ పేర్కొన్నారు. మహిళలకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడం కోసం దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన పింక్ లీగల్ వెబ్‌సైట్‌ను హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టూరిజం కమిషనర్ సునీతా భగవత్, నిర్మాత డి.సురేష్‌బాబు, పింక్ లీగల్ వెబ్‌సైట్ రూపకర్త, న్యాయవాది మానసి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఆ తీర్మానానికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

- ఎన్‌పీఆర్, ఎన్నార్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా తీర్మానమే కాదు జీవోలు కూడా చేయాలి
- కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ బహిరంగ లేఖ

**సాక్షి, హైదరాబాద్:** ఎన్‌పీఆర్, ఎన్నార్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం చేసే తీర్మానానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా మద్దతునిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. కేవలం అసెంబ్లీలో తీర్మానం చేసి సరిపెట్టుకోకుండా కేరళ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో తాము ఎన్‌పీఆర్, ఎన్నార్సీలను తెలంగాణలో అమలు చేయబోమని జీవోలు కూడా విడుదల చేయడం ద్వారా మోదీ–షా మతరాజకీయాలకు తెలంగాణ వ్యతిరేకమని తెలియజేయాలని ఆ లేఖలో కోరారు. జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) అమలు చేయడంతో సమస్య లేదని, దాన్ని అడ్డం పెట్టుకుని బీజేపీ దేశంలోని పౌరుల మధ్య చిచ్చు పెట్టాలనుకునే కుట్రతోనే దేశ సమగ్రతకు ముప్పు ఉందని తెలిపారు. ఇలాంటి మత రాజకీయాలను తెలంగాణ గడ్డ అనుమతించబోదని, ఇక్కడి ప్రజలు మత సామరస్యానికి ప్రతీక అనే విషయాన్ని తేటతెల్లం చేయాలని కేసీఆర్‌కు రాసిన లేఖలో ఉత్తమ్ కోరారు.









సాక్షి
సాహిత్యం



నల్లగొండ | సోమవారం
మార్చి | 9 | 2020
sakshisahityam@gmail.com

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, శిశిర ఋతువు. ఫాల్గుణ మాసం. తిథి పౌర్ణమి రా.12.00 వరకు, తదుపరి బ.పాడ్యమి. నక్షత్రం పుబ్బ రా.2.08 వరకు, తదుపరి ఉత్తర. వర్జ్యం ప.11.10 నుంచి 12.38 వరకు. దుర్ముహూర్తం ప.12.31 నుంచి 1.21 వరకు, తదుపరి ప.2.55 నుంచి 3.41 వరకు. అమృత ఘడియలు రా.8.07 నుంచి 9.44 వరకు

**సూర్యోదయం:** 6.18 **సూర్యాస్తమయం:** 6.04 ;
**రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు



### నమాజ్ వేళలు

ఫజర్: 5.17 జొహర్: 12.27
అసర్: 4.45 మగ్రీబ్: 6.25 ఇషా: 7.37

### ఈవారం పుస్తకాలు

**దగ్ధస్వప్నం (కవిత్వం)**



రచన: ఇక్బాల్ ; పేజీలు: 110 ; వెల: 120 ; ప్రచురణ: పాలమూరు అధ్యయన వేదిక ; ప్రతులకు: కవి, 6-29, జి.వి.ఎన్‌క్లేవ్, గవర్నమెంట్‌స్కూల్ పక్కన, గద్వాల్-509125. ఫోన్: 9440775732

**హరిత స్వప్నం (కవిత్వం)**



రచన: కోట్ల వెంకటేశ్వర రెడ్డి ; పేజీలు: 148 ; వెల: 120 ; ప్రచురణ: పాలపిట్ట బుక్స్ ; ప్రతులకు: కవి, 4-31/1/2, భగీరథ కాలనీ, మహబూబ్ నగర్ - 509001. ఫోన్: 9440233261

**దూరమెంతైన (కవిత్వం)**



రచన: గోపగాని రవీందర్ ; పేజీలు: 120 ; వెల: 100 ; ప్రతులకు: గోపగాని రమణశ్రీ, 40-18-38/1, ఝాన్సీ నగర్, ముమునూర్, వరంగల్-506005. ఫోన్: 9440979882

**మట్టిరంగు బొమ్మలు (కవిత్వం)**



రచన: సిరికి స్వామినాయుడు ; పేజీలు: 168 ; వెల: 100 ; ప్రతులకు: కవి, ఈస్ట్ రోడ్, మూడో లైను, బంగారమ్మ కాలనీ, బెలగాం, పార్వతీపురం - 535501. ఫోన్: 9494010330

**సమిధుడు (కవిత్వం)**



రచన: పర్కపెల్లి యాదగిరి ; పేజీలు: 88 ; వెల: 120 ; ప్రతులకు: కవి, 11-1-420, సుశీల్ పద్మ ఎన్‌క్లేవ్, మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి, సికింద్రాబాద్-61. ఫోన్: 9299909516

### కథాప్రపంచం

అనగనగా ఒక రాణి గారి
ఏడుగురు కూతుళ్లు వేటకు వెళ్లి
ఏడు చేపలు తెచ్చారు,
ఆ ఏడు చేపలని...



# ఏ ఇంటి కోడలు కలికి కామాక్షి?

● ప్రత్యేక వ్యాసం



*కలవారి కోడలు కలికి కామాక్షి*
*కడుగుచున్నది పప్పు కడవలో బోసి*
*అప్పుడే వచ్చేడు ఆమె పెద్దన్న*
*కాళ్లకు నీళ్లిచ్చి కన్నీరు నింపె–*

ఇలా సాగే ఈ జానపద గేయం తెలుగునాట ఆబాలగోపాలానికీ ప్రీతిపాత్రమయింది. బిరుదురాజు రామరాజు సిద్ధాంత వ్యాసం 'తెలుగు జానపద గేయ సాహిత్యము'లో చోటు చేసుకున్న తర్వాత పామర ప్రజానీకం నోట్లోంచి పాఠ్య పుస్తకాల్లోకి ఎక్కి పండితాదరణ కూడా పొందగలిగింది. ఈ గేయానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో చాలా భావ స్వామ్యం వున్న గేయాలు దొరుకుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో భిన్నమైన రీతిలో వినబడే ఈ పాట ముఖ్యాంశం – అత్తగారింట్లో ఆరళ్ల పాలైన కోడలి జీవితం. పదిమంది నోళ్లలో నానుతున్న ఈ పాటలో ఆమె పుట్టింటికి చెల్లెలు పెళ్లికని వెళ్లి, మరదుల పెళ్లికి తిరిగి వస్తానంటుంది. కానీ అసలైన జానపద గేయాల్లో అత్తింటి ముఖం చూడనని భీష్మ ప్రతిజ్ఞ చేయడం గమనించదగ్గ విషయం.

చొక్కాపు నారాయణస్వామి సేకరించిన 'పుట్టింటికి' అన్న కర్నూలు జిల్లాలోని గేయంలో కోడలు పిల్ల అత్తగారింట పెద్దలందరినీ పుట్టింటికి పోవడానికి అనుమతి అడిగి చిట్టచివర మొగుడిని కోరగా అతను–

*వండుకో వరికూడు దానిమ్మలో*
*కట్టుకో సద్దికూడు దానిమ్మలో*
*ఎత్తుకో బాలున్ని దానిమ్మలో*
*ఎగురు గుర్రాన్ని దానిమ్మలో–*

అంటూ సంతోషంగా వెళ్లి రమ్మంటాడు. అప్పుడామె ఏం చేసిందంటారు?

*ఎగిరే గుర్రాన్ని దానిమ్మలో*
*దుమ్ముల్లు రేగా దానిమ్మలో*
*పారే గుర్రాము దానిమ్మలో*
*చెంగల్వపట్నానికి దానిమ్మలో–*

ఆమె గుర్రమెక్కి, అన్నతోనో, తమ్మునితోనో పుట్టింటికి బయలుదేరింది. పుట్టిల్లు చెంగల్వపట్నంలో ఉందట. ఆమె వూరు తామరకొలను అయితే ఆమె జీవితం ఎంత ఆనందంగా సాగిపోతుందో! ఈ గేయంలో చిత్రింపబడ్డ స్త్రీ ఎలాంటి మానసిక, శారీరక హింసలకూ గురి కాలేదన్నమాట. ఈ గేయం 'తేనెసొనలు'(1974) లోనిది.

గోపు లింగారెడ్డి సేకరించిన గేయం(తెలంగాణ గ్రామిక గేయాలు, 1982)లో దీపావళి పండుగకు పుట్టింటికి పిల్చుకు పోవడానికి వచ్చిన అన్నలకు చెల్లెలు ''కాళ్లకు నీళ్లిచ్చి కన్నీళ్లు దీసె''. అప్పుడామె అన్నలు ''ఎందుకూ కష్టాలు ఏమి కష్టాలు'' అని ఆదుర్దా పడుతూ అత్తగారి అనుమతి తీసుకొని, వెంటనే బయలుదేరమంటారు. అప్పుడామె అత్త, మామ, బావ, తోడికోడలు వగైరాలను అడిగి ఆఖరికి పెనిమిటి అనుమతి అడిగితే, అతను ఇప్పుడే బయలుదేరమంటాడు. మళ్లీ ఎప్పుడొస్తావు అంటే ఆ ముద్దరాలు అంటుంది గదా!

*''ఏటి మీద యెర్రజొన్న పండిన్ననాడు సీతారామచంద్ర*
*ఏడు పుట్ల మన గరిసె నిండిన్ననాడూ సీతారామచంద్ర*
*పాటిమీద పచ్చజొన్న పండిన్ననాడూ సీతారామచంద్ర*
*పది పుట్ల మన గరిసె నిండిన్ననాడూ సీతారామచంద్ర*
*నక్కలూ నాగండ్లు దున్నిన్ననాడు సీతారామచంద్ర*
*కుందేల్లు సద్దూలు మోసిన్ననాడూ సీతారామచంద్ర*
*వరిపొట్టు సేతాడు పేనిన్ననాడూ సీతారామచంద్ర*
*మా యత్త మా మామ సచ్చిన్ననాడూ సీతారామచంద్ర*
*తడిబట్ట స్నానాల కంటూ వచ్చేనూ సీతారామచంద్ర–*

పాపం, ఈ కోడలు అత్తారింట్లో ఎన్ని కష్టాల పాలయిందో!

**ఈ గేయానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో చాలా భావస్వామ్యం వున్న గేయాలు దొరుకుతున్నాయి. అయితే, దీన్ని అచ్చమైన పల్లెపాటగా పరిగణించడం కష్టం. జానపద గేయాల ఫణితిని శ్రద్ధగా గమనించిన శిష్టజనులెవ్వరో ఈ గేయాన్ని కళాత్మకంగా మలిచారని తోస్తుంది.**

వరంగల్ జిల్లాలో సేకరింపబడ్డ ఓ గేయం 'మన పల్లెటూళ్ల పాటలు'(2004) ఈ కలవారి కోడలు కష్టాల్ని మరిన్ని వివరాలతో తెలియజేస్తుంది. చెల్లెల్ని పిల్చుకుని రమ్మంటే ముగ్గురన్నలు తాము వెళ్లమని అంటే కొనాకు తండ్రే బయలుదేరడం ఈ గేయంలోని విశేషం. కాగా ఈ కోడలి పేరు భాగ్యమ్మగా పేర్కొనడం మరో ప్రత్యేకత. ఆ కోడలు ఇంటిల్లిపాదీ పెద్దాచిన్నలకు పుట్టింటికి పోవడానికి అనుమతి అడిగి, చిట్టచివరికి పెనిమిటి పోయిరమ్మని చెప్పి, మళ్లీ ఎప్పుడొస్తావంటే ఆమె అంటుంది కదా:

*అత్త సచ్చీనంక ఉయ్యాలో ఆరు నెల్లా కొస్త ఉయ్యాలో*
*మామ సచ్చీనంక ఉయ్యాలో మంచం కాడి కొస్త ఉయ్యాలో.*

ద్రవిడ విశ్వవిద్యాలయం ప్రచురించిన 'జాలారి సిరిమల్లెలు' (2007)లో జి.శ్రీనివాసయ్య కర్ణాటకలోని కోలారు జిల్లాలో సేకరించిన అర్థపూర్ణమైన తెలుగు జానపద పాటలున్నాయి. దీన్లోని 'మాయన్నగారూ' గేయం కలవారి కోడలు కన్నీటి కథే. ఆమె అందరిని అనుమతి అడిగి, చివరగా మరిది సమ్మతించగా పుట్టింటికి బయలుదేరుతుంది. అప్పుడు ''వదినా మళ్లీ ఎప్పుడు వస్తావు'' అంటే–

*ఉడికిండే ఉలువాలూ మలిసిన్నాటికో*
*కలకోడి పుంజేమో కూతేసిన్నాటికో*
*బండమింద రాజనాలు పండిన్నాటికో–*

తిరిగి వస్తానంటుంది. ఆమె మళ్లీ అత్తగారింటి వైపు తల పెట్టి నిద్రపోదన్న మాట.

మేక ఉమారెడ్డి సిద్ధాంత గ్రంథం 'నల్లగొండ జిల్లా జానపద గేయాలు: సమగ్ర పరిశీలన'(2015)లో ఉటంకించిన గేయంలో కోడలు అత్తగారింటిని గుండెల మీద కుంపటిగా భావించిన లక్షణాలేవీ కనపడవు. ముద్దుల పెళ్లాంకు భర్త ఇలా వీడ్కోలు చెప్తాడు:

*పెట్టెలో సొమ్ముల్లు కోల్ – పెట్టుకోవే నాగ కోల్*
*దండాన బట్టలు కోల్ – సద్దుకోవే నాగ కోల్*
*మీ యన్నల వెంట కోల్ – వెళ్లిరావే నాగ కోల్.*

ఈ పాటలోని కోడలు అత్తగారింటి నుంచి క్షేమంగా వెళ్లి పుట్టింటి నుంచి లాభంగా తిరిగొస్తుందని భావించవచ్చు.

'ఉడకేసిన ఉలవలు మొలకెత్తినబుడు' అన్న శీర్షికతో ప్రచురించబడ్డ జానపద గేయం 'దణి– హోసూరు పల్లెపాటల కతలు' (2017) కలవారి కోడలు దుఃఖాన్ని వెలువరించేదే. తమిళనాడు కృష్ణగిరి జిల్లా ప్రాంతంలో లభించిన ఈ పాటలో–

*రాతి మీద రతనాలు పండినబుడు*
*రాతి బసవన్న రంకేసినబుడు*
*ఉడకేసిన ఉలవలు మొలకెత్తినబుడు–*

తిరిగి వస్తానంటుంది ఈ చాన.

కలవారి కోడలు కలికి కామాక్షి గేయంలో కళకళలాడే ముఖంతో, సుఖమయ జీవితం గడిపే కోడలు కనిపిస్తుంది. కాని వివిధ ప్రాంతాల్లో ప్రచారంలో వున్న జానపద గేయాల్లో కన్నీరు పెట్టిన కామాక్షే కళ్లముందు నిలబడుతుంది. వీటి వల్ల 'అత్తలేని కోడలు ఉత్తమురాలు– కోడలు లేని అత్త గుణవంతురాలు' అన్న అలనాటి మాటలే మన చెవుల్లో గింగురుమంటాయి.

కలవారి కోడలు కలికి కామాక్షి గేయాన్ని అచ్చమైన పల్లెపాటగా పరిగణించడం కష్టం. జానపద గేయాల ఫణితిని శ్రద్ధగా గమనించిన శిష్టజనులెవ్వరో ఈ గేయాన్ని కళాత్మకంగా మలిచారని తోస్తుంది. ఇకపోతే ఈ వస్తువునే గుండె లోతుల్లోంచి ఉబికిన భావాలతో సహజ సుందరంగా, శ్రోతల హృదయాల్లో చెరగని ముద్ర వేసే విధంగా తీర్చిదిద్దిన పల్లెప్రజలకు, నేలతల్లి బిడ్డలకు భావుకులందరూ జోహార్లు అర్పించాలి.

◆ **ఘట్టమరాజు**

● కొత్త బంగారం

# ఎవరి కథని వారే చెప్పాలా?



నవల: అమెరికన్ డర్ట్
రచయిత్రి: జెనీన్ కామిన్స్

అనధికార సాంస్కృతిక స్వీకరణ (కల్చరల్ అప్రొప్రియేషన్) –సాహిత్యాన్ని అంటిపెట్టుకుని ఉండే ప్రశ్న! కథలు ఎవరు చెప్పాలి? ఎవరి కథలు వారే చెప్పుకోవాలా? తనది కాని జీవితావరణంలోని అనుభవాల, అనుభూతుల ఆవిష్కరణకి రచయిత పూనుకోవచ్చా, కూడదా? ఈ విషయమై మూడేళ్ల క్రితం రచయిత్రి లైనల్ షైవర్ ప్రసంగానంతరం రేగిన వివాదాలు మర్చిపోకముందే, మళ్లీ ఊహించని రీతిలో సంచలనాత్మక చర్చలకు తెరతీసింది ఈ సంవత్సరం జనవరి నెలలో వచ్చిన– జెనీన్ కామిన్స్ నవల అమెరికన్ డర్ట్.

ఎన్నో ప్రచురణ సంస్థలు పోటీపడిన తరువాత – అత్యధిక పారితోషికమిచ్చిన ఫ్లాట్ ఐరన్ సంస్థ నవల ప్రచురణ హక్కుల్ని సంపాదించుకుంది. హాలీవుడ్ అప్పుడే నవలని సినిమాగా మార్చే ప్రయత్నంలో ఉంది. వెల్లువెత్తుతున్న ప్రశంసలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే కార్చిచ్చులా రగులుతున్న విమర్శలు చర్చలు రేపుతున్నాయి. ప్రధానంగా తనదికాని అనుభవాన్నీ, వలసదారుల కథనీ రచయిత్రి చెప్పటం సరికాదనే తీవ్రవిమర్శని ఎదుర్కొంటోంది నవల. మా కథ మేము చెప్తే పట్టించుకోని ప్రచురణ సంస్థలు మా గురించి ఇంకొకరు రాస్తే ప్రచురించటం ఏమిటనీ, సాహిత్యపు గమనాన్ని నిర్దేశించగలిగిన ఈ సంస్థలు అన్ని వర్గాల వారి సామర్థ్యాన్ని గుర్తించాలనీ అనేవారి సంఖ్య భారీగానే ఉంది. కథ ఎవరు చెప్పినా ఫరవాలేదు, వస్తువుకి న్యాయం చెయ్యాలనే వారు కొందరు. ఇందులో మెక్సికో ప్రజలకీ, వలసదారులకీ న్యాయం జరగలేదని లోపాలను ఎత్తిచూపేవారు మరికొందరు. విమర్శలూ ప్రతివిమర్శలతో కలకలం సృష్టిస్తోందీ నవల.

ఇన్ని సంచలనాలు సృష్టించిన ఈ నవల థ్రిల్లర్‌లా మొదలవుతుంది.

మెక్సికోలో ఉన్న మధ్యతరగతి కుటుంబమైన లిడియావాళ్ల ఇంట్లో పుట్టినరోజు వేడుక జరుగుతూంటుంది. ఉన్నట్టుండి పెరట్లో కాల్పులు. కుటుంబంలో పదహారుమంది చనిపోయిన ఆ మారణహోమాన్నుంచి లిడియా తన కొడుకు లూకాతో సహా తప్పించుకుంటుంది. ఒక మాఫియా అధినేత గురించి తన భర్త, పత్రికలో రాసిన వ్యాసమే ఈ ప్రతీకార చర్యకి కారణమని లిడియాకి అర్థమవుతుంది. మాఫియా అరాచకాలకు ఎవరూ అతీతులు కారనీ, పిల్లలు కూడా వీధుల్లో హత్యల్నీ, శవాలు పడివుండటాన్ని చూసి నవ్వారేననీ అంటారు రచయిత్రి. వీధుల్లో తెగపడిన తలలూ, యువతీయువకులూ, పిల్లలూ కనిపించకుండా పోవడాలూ, కత్తిపోట్లూ, తుపాకీల మోతలూ – అన్నీ సాధారణమే. ఇదేమిటని మాఫియాని ఎవరూ ప్రశ్నించలేరు. ప్రభుత్వ యంత్రాంగమూ, పోలీసులూ వారి గుప్పిట్లో ఉన్నవారే! బతుకు భరోసా కరువైన అలాంటి పరిస్థితుల్లో మాఫియాకి దూరంగా – అక్రమంగానైనా సరే – అమెరికాకి వెళ్లిపోవాలని లిడియా చేసే ప్రయత్నమే ఈ నవల.

ప్రాణభయం, కొడుకుని కాపాడుకోవాలన్న తాపత్రయం, తెలివితేటలూ, తెగింపూ ఉన్న వ్యక్తి లిడియా. కొడుకు కోసం కదిలే రైలు పైకి దూకగలిగిన మొండి ధైర్యం ఆమెది. పసితనంలోనే విషాద జీవితానుభవాలు పొందిన ఎనిమిదేళ్ల లూకా తల్లికి ధైర్యాన్ని ఇవ్వవలసిన బాధ్యతని తనమీద వేసుకొని, వయసుకి మించిన మానసిక స్థైర్యాన్ని ప్రదర్శిస్తుంటాడు. వీరి ప్రయాణంలో మెక్సికో నుంచి పారిపోయే వారేకాదు, అమెరికానుంచి వెనక్కి పంపబడి మళ్లీ వెళ్లటానికి ప్రయత్నించే వారూ కలుస్తారు. గూడ్స్ రైళ్ల నిచ్చెనలూ, పైకప్పుల మీద వీరందరి అనధికార ప్రయాణం. సహాయం చేసేవారితో పాటు, దౌర్జన్యంగా డబ్బుని లాక్కునేవాళ్లూ, అమ్మాయిలను రాక్షసంగా అనుభవించి అమ్మేసే వాళ్లూ, పిల్లలను మాఫియాకి సరఫరాచేసే వాళ్లూ – అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితులు. ''ప్రతిక్షణం పరిస్థితులకి అనుగుణంగా మారటం వలసదారులకి అవసరం. వారు మొండిగా ఉండవలసిన విషయం ఒక్కటే– అది ప్రాణాలతో ఉండటం''అంటుంది లిడియా.

వలసదారుల అస్తిత్వపోరాటం, అస్థిరత్వం, భయం, సంఘర్షణ, స్త్రీ అంతఃశక్తి– వీటిలో ఈ నవల స్పృశించనిదేదీ లేదు, మనల్ని తాకనిదీ ఏదీ లేదు.

◆ **పద్మప్రియ**

● రీవిజిట్

# ఒక తాత్త్వికచమత్కారం



**ప్రసేన్ సర్వస్వం**
పేజీలు: 326;
వెల: 300;
ప్రచురణ: అడుగు జాడలు పబ్లికేషన్స్;
కవి ఫోన్: 9963155524

సామాజిక ప్రయోజనం నెరవేర్చని కవి తనంతట తానే మరణిస్తాడంటాడు ప్రసేన్. అలాగని, హృదయంలోని సుతిమెత్తని తంత్రులను మీటడం సామాజిక ప్రయోజనం కాకుండా పోదని కూడా అంటాడు. ఇలా మాట్లాడటం వల్లే ఒక్కోసారి ఎవరికైనా తాను అర్థం కాకుండా పోయానేమో అన్న అనుమానం ఆయనకు ఉన్నప్పటికీ, చెప్పాలనుకున్న దాన్ని చెప్పాల్సిన విధంగానే చెప్పానన్న స్పష్టత కూడా ఆయనకు ఉంది. 1985లో రక్తస్పర్శ కవుల్లో ఒకడిగా మొదలైన ప్రసేన్ సొంతంగా 'ఇంకా వుంది', 'ఏదీ కాదు' కవితా సంపుటాలు వెలువరించాడు. 'కవిత్వం', 'క్రితం తర్వాత' సంకలనాల్లో భాగమయ్యాడు. ఈ మళ్లీ వచ్చిన 'ప్రసేన్ సర్వస్వం'లో ఆయన రాసిన సాహిత్య వ్యాసాలు, ముందుమాటలు విమర్శలు, ప్రశంసలతో పాటుగా, ఆయన కవితల్లోంచి ఎంపిక చేసిన కవితలు కూడా ఉన్నాయి. అందులోంచి ఒకటి:

నెత్తురోడుతున్నావు గదా
నువు గాయానివా
అడిగింది ఆయుధం
కాదు నేను ఓడిపోయిన
అభిప్రాయాన్ని
చెప్పింది విజయం
ఉప్పురుచి తెలియదు
ఐనా నేను సముద్రాన్నేనా
అడిగింది కన్నీటి చుక్క

పరిమళం మరణించినా
పూవుసారం మారదు
చెప్పింది విషాదం
విజయానికి విషాదానికి
ఏ దూరపు చుట్టరికం
అడిగింది రేపటి కల
నేను కీ నేను కీ మధ్య
తేడా ఉండదు కదా!
చెప్పింది తుళ్లిపడ్డ నిద్ర!

◆ **ప్రసేన్**

● సాహిత్య మరమరాలు

# కలిగిన పీడ పోయినది



ప్రతాపరుద్రీయం అన్న అలంకార శాస్త్ర రచయిత విద్యానాథకవి కాకతీయ ప్రభువైన ప్రతాపరుద్ర మహారాజు దర్శనానికి ఎంతో ప్రయత్నిస్తాడు. అసూయాగ్రస్తులైన రాజాశ్రితులు అతనికి అడ్డుపడి రాజదర్శనం కలగనీయకుండా చేస్తూ ఉంటారు.

ఒకరోజు రాజు నగరంలో తన గుర్రం మీద సంచరిస్తుండగా జనం మధ్యలో నిలిచి విద్యానాథుడు ఈ అసంపూర్ణ శ్లోకం గట్టిగా చదివి వినిపిస్తాడట. 'నవలక్ష ధనుర్ధరాధినాథే, పృథివీం శాసతి వీరరుద్రదేవే, అభవత్ పరమగ్రహార పీడాం'. అంటే తొమ్మిది లక్షల ధనుర్ధారుల సైన్యానికి అధిపతి అయిన వీర రుద్రదేవుడు పరిపాలిస్తుండగా అగ్రహారములకు గొప్ప పీడ కలిగినది అని భావము. బ్రాహ్మణ భక్తి కలిగిన ప్రతాపరుద్రుడు, 'నా పాలనలో అగ్రహారములకు పీడన కలుగుటయా' అని ఉలిక్కిపడి ఆ వ్యక్తిని తనముందు హాజరు పెట్టవలసినదని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు విద్యానాథకవి ముందుకు వచ్చి శ్లోకాన్ని ఇలా పూరిస్తాడు. 'కుచ కుంభేషు కురంగ లోచనాం' అని. అంటే తొమ్మిది లక్షల ధనుర్ధారుల సైన్యానికి అధిపతి అయిన వీర రుద్రదేవుడు పరిపాలిస్తుండగా లేడికన్నుల వంటి కన్నులు కలిగిన వనితల కుచాగ్రములకు హారముల పీడ కలిగినది అని. పీడ అంటే ఒత్తిడి, ఒరిపిడి అని అర్థం వచ్చేలా శ్లోకభావాన్ని మార్చి వినిపిస్తాడు విద్యానాథుడు. ఈ పాదము చేర్చడంతో శ్లోకానికి 'కుచాగ్రముల వరకూ హారములను ధరించేటంతటి సంపద కలిగి ఉన్నారు ప్రజలు' అన్న అర్థం వచ్చింది. ఈ పూరణకు ముగ్ధుడైన ప్రతాపరుద్రుడు అతనిని తన ఆస్థానానికి ఆహ్వానించి, సత్కరించి, తన ఆస్థానంలో నియమించుకొన్నాడట.

ఈ కథలో చారిత్రక సత్యమెంతో తెలియదు గానీ ఒక రమణీయమైన కథ ఈ శ్లోకం ద్వారా ఆవిష్కృతమౌతున్నది. ఈ ఉదంతం మనకు వేదం వేంకటరాయశాస్త్రి నాటకం 'ప్రతాపరుద్రీయం'లో కనిపిస్తుంది.

◆ **ఆర్.ఎ.ఎస్.శాస్త్రి**

### రారండోయ్

- గంటి భానుమతి రెండు నవలలు తమసోమా జ్యోతిర్గమయ, పడి లేచిన కెరటం ఆవిష్కరణ సభ మార్చి 11న సాయంత్రం 6 గంటలకు సుందరయ్య కళానిలయంలో జరగనుంది. నిర్వహణ: పాలపిట్ట బుక్స్.
- డాక్టర్ కె.అన్న 'గడచిన రెండు దశాబ్దాల హిందీ కథ– శ్రామిక వర్గ సమస్యలు'(హిందీ) ఆవిష్కరణ మార్చి 12న ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి మినీ హాల్‌లో జరగనుంది. నిర్వహణ: తెలంగాణ రచయితల సంఘం.
- తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా నవలా స్రవంతిలో భాగంగా మార్చి 13న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో నవీన్ నవల అంపశయ్య గురించి కె.పి.అశోక్ కుమార్ ప్రసంగిస్తారు.
- జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట శాఖ 33వ వార్షికోత్సవం మార్చి 15న మధ్యాహ్నం 3 కు సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జరగనుంది. పలు పురస్కారాల ప్రదానాలు, పుస్తకావిష్కరణలు జరగనున్నాయి.
- ప్రభాకర్ మందార తెలుగులోకి అనువదించిన జె.వి.పవార్ ఆంగ్ల రచన 'దళిత్ పాంథర్స్ చరిత్ర' ఆవిష్కరణ మార్చి 15న సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో జరగనుంది. బెజవాడ విల్సన్‌తో చర్చ ఉంటుంది. నిర్వహణ: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
- ఉషశ్రీ సంస్కృతి సత్కారాన్ని గరికపాటి నరసింహారావుకు మార్చి 15న సాయంత్రం 6:03 గంటలకు హైదరాబాద్, బర్కత్‌పురాలోని యాదాద్రి కల్యాణ మండపంలో చేయనున్నారు. కె.వి.రమణాచారి, కె.వరప్రసాద్‌రెడ్డి, ఎన్.అనంతలక్ష్మి, కడిమెళ్ల వరప్రసాద్ పాల్గొంటారు. నిర్వహణ: ఉషశ్రీ మిషన్.
- మునిపల్లె రాజు సాహిత్య పురస్కారాన్ని విహారికి మార్చి 16న సాయంత్రం 5:30కు త్యాగరాయ గానసభలో ప్రదానం చేయనున్నారు. నిర్వహణ: మునిపల్లె రాజు కుటుంబ సభ్యులు, శ్రీ త్యాగరాయ గానసభ.
- సాహిత్య అకాడమీ, సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా మార్చి 17న సాయంత్రం 5 గంటలకు హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో 'విమర్శకునితో ఒక సాయంత్రం' పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో కోవెల సుప్రసన్నాచార్య తన విమర్శ ప్రస్థానం గురించి ముచ్చటిస్తారు.
- బాలచెలిమి పత్రిక ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాల బడి పిల్లల కథలను 13 సంకలనాలుగా ప్రచురించనుంది. ప్రధానోపాధ్యాయుడి ధ్రువపత్రంతో ఒకవైపునే రాసిన రెండు ఏ4 కాగితాలకు మించని కథలను మార్చి 20లోగా పంపాలి. చిరునామా: చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి, 3-6-716, స్ట్రీట్ నం. 12, హిమాయత్ నగర్, హైదరాబాద్-29. ఫోన్: 8686664949

● పరిచయం

# చెరువు నిండిన దృశ్యం

ఇంతకుముందు చెంచుల జీవితాన్ని స్పృశిస్తూ 'మరణం అంచున' రాసిన వెంకటేశ్వర్లు తాజా రచన ఈ 'పిట్ట వాలిన చెట్టు'. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్లు–నిధులు–నియామకాలు అనే మూడు ప్రధాన లక్ష్యాల్లో భాగంగా, తెలంగాణ ప్రభుత్వం చెరువుల పునర్జీవనానికి రూపొందించిన 'మిషన్ కాకతీయ' ఫలాలను చూస్తూ ఒక పాత్రికేయుడు ఇచ్చిన గ్రౌండ్ రిపోర్ట్ ఇది. 'నిండు గంగాళంగా మారిన జలనిధి'ని చూస్తూ పొందిన పరవశం ఇది.



**పిట్ట వాలిన చెట్టు**
రచన: వర్ధెల్లి వెంకటేశ్వర్లు;
పేజీలు: 396;
వెల: 350; ప్రతులకు: అడుగుజాడలు పబ్లికేషన్స్, హైదరాబాద్;
రచయిత ఫోన్: 9912199508

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబరుకు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

epaper.sakshi.com




పర్యావరణ/అటవీ/సైన్స్&టెక్నాలజీ







ఆహార/పౌరసరఫరా




ఫైనాన్స్




సాధారణ పరిపాలన






## ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధికి 26,306 కోట్లు

సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధికి కేటాయింపులు భారీగా పెరిగాయి.2019–20 వార్షిక సంవత్సరం బడ్జెట్‌తో పోల్చితే 2020–21 సంవత్సరం కేటాయింపుల్లో ఏకంగా 6,721.17 కోట్లు అధికంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆదివారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.26,306.25 కోట్లు కేటాయించారు. ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన ఈ నిధులు కేటాయించారు. ఇందులో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.16,534.97 కోట్లు, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.9,771.28 కోట్లు వంతున బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతేడాది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్, ఆర్థిక పరిస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం... గతేడాది సెప్టెంబర్ 9న 2019–20 వార్షిక సంవత్సరం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర బడ్జెట్ భారీగా తగ్గడంతో ప్రత్యేక అభివృద్ధి నిధి యాక్టు కింద ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ కేటాయింపులు భారీగా తగ్గాయి. తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2020–21 వార్షిక సంవత్సరం బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎస్డీఎఫ్ కేటాయింపులు భారీగా పెరిగాయి. నిధుల కేటాయింపుల్లో జోరు పెరగడంతో సంక్షేమ పథకాల అమలులో వేగం పుంజుకోనుంది.

**ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి**
**రూ. 16,534.97 కోట్లు**
**(బడ్జెట్ కేటాయింపుల్లో 15.81%)**

**ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి**
**రూ. 9,771.28 కోట్లు**
**(బడ్జెట్ కేటాయింపుల్లో 9.34%)**

### పెండింగ్ పనులకు లైన్ క్లియర్...

ప్రత్యేక అభివృద్ధి నిధి కేటాయింపులు భారీగా పెరగడంతో ఆయా శాఖల ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకోనున్నాయి. 2019–20 వార్షిక సంవత్సరంలో కేటాయింపులు భారీగా తగ్గడంతో ముందస్తుగా అనుకున్న పలు కార్యక్రమాలను ఆయా శాఖలు వాయిదా వేసుకున్నాయి. ముఖ్యంగా నిర్మాణ పనులు చాలావరకు నిలిపేశారు.ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా మండల, డివిజన్ స్థాయిలో నిర్మించాలనుకున్న అంబేడ్కర్ భవనాలు, ఎస్సీ, ఎస్టీ వాడల అభివృద్ధి కాస్త నెమ్మదించింది. తాజాగా భారీగా నిధులు ప్రవేశపెట్టడంతో వాయిదా పడ్డ పనులన్నీ వేగంగా పూర్తికానున్నాయి. ఎస్డీఎఫ్ కింద కేటాయించిన బడ్జెట్‌ను దాదాపు 42శాఖలు సమన్వయంతో ఖర్చు చేస్తాయి.ఈ నేపథ్యంలో ఎస్డీఎఫ్ కింద కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వ శాఖలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని భావిస్తున్నాయి.



> భూములు, నిరర్థక ఆస్తుల విక్రయంతో అదనపు ఆదాయ సమీకరణ చేస్తాం. నిబంధనల మేరకే అప్పులు తీసుకున్నాం. ఇక పాలనపైనే పూర్తి దృష్టి పెడతాం.
> బడ్జెట్ సమర్పించాక మీడియాతో హరీశ్‌రావు

# అన్నదాతకు అందలం



**వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయింపులు**
**25,811 కోట్లు**

- రైతు రుణమాఫీకి రూ. 6,225 కోట్లు
- రైతు బీమాకు రూ. 1,141 కోట్లు
- మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌కు రూ. 1,000 కోట్లు
- పశుసంవర్ధకశాఖకు రూ. 1,586 కోట్లు
- సహకార, మార్కెటింగ్‌కు రూ. 108 కోట్లు

**రైతుబంధుకు రూ. 14 వేల కోట్లు.. గతంకంటే రూ. 2 వేల కోట్లు అదనం**

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అగ్రస్థానం కల్పించింది. బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయం, అనుబంధ శాఖలకు పెద్దపీట వేసింది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా 25,811.78 కోట్లు కేటాయించింది. గతం కంటే ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అత్యంత ప్రాధాన్యం కల్పించడం విశేషం. అందులో ప్రగతి పద్దు రూ. 23,405.57 కోట్లు కాగా మిగిలిన రూ. 2,406.21 కోట్లు నిర్వహణ పద్దు. మొత్తం వ్యవసాయ అనుబంధ శాఖల బడ్జెట్‌లో ప్రగతి పద్దు కింద కేవలం వ్యవసాయ రంగానికి రూ. 23,221.15 కోట్లు కేటాయించగా సహకార, మార్కెటింగ్‌శాఖలకు రూ. 7.42 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ. 177 కోట్లు కేటాయించింది. వ్యవసాయ రంగానికి కేటాయించిన ప్రగతి పద్దు బడ్జెట్‌లో రైతు బంధు, రైతు బీమా, రైతు రుణమాఫీలకే అగ్రస్థానం కల్పించారు. రైతు బంధు పథకం అమలు కోసం రూ. 14 వేల కోట్లు కేటాయించారు. 2018–19 బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయించగా దానికి అదనంగా రూ. 2 వేల కోట్లు కేటాయించడం గమనార్హం. కొత్త పాస్‌పుస్తకాలు మంజూరు కావడం వల్ల రైతు బంధు లబ్ధిదారుల సంఖ్య వచ్చే ఏడాది పెరగనుండటంతో పెరిగే లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు అదనంగా పెంచినట్లు సర్కారు తెలిపింది. అంతేగాకుండా సాగునీటి ప్రాజెక్టులు పూర్తికావడం, పంటల సాగు విస్తీర్ణం పెరగడం వల్ల కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రైతుబంధుకు గత బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ముకు 1.20 కోట్ల ఎకరాలను పరిగణనలోకి తీసుకోగా ఈసారి కొత్త పాస్‌పుస్తకాల సంఖ్య పెరగడం, ప్రాజెక్టులు, జలాశయాల ద్వారా మొత్తంగా 20 లక్షల ఎకరాల ఆయకట్టు అదనంగా పెరిగిందన్న అంచనాతో 1.40 కోట్ల ఎకరాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కేటాయింపులు చేసింది. రైతుబంధు ద్వారా 2018–19 ఖరీఫ్‌లో రూ. 5,235 కోట్లు, రబీలో రూ. 5,244 కోట్లు పంపిణీ చేయగా 2019–20లో ఎకరానికి రూ. 10 వేల చొప్పున రూ. 12 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు.

### రైతు రుణమాఫీకి రూ. 6,225 కోట్లు...

గత ఎన్నికల సందర్భంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రకటించడం తెలిసిందే. అయితే గతంలో చేసిన రుణమాఫీకి, ఇప్పుడు రుణమాఫీకి కాస్త తేడా ఉంది. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో రూ. లక్షలోపు ఉన్న రైతుల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని టీఆర్‌ఎస్ ప్రకటించి అందుకు అనుగుణంగా రూ. 16,124 కోట్లను నాలుగు విడతల్లో మాఫీ చేసింది. ఈసారి బడ్జెట్‌లో రూ. 6,225 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో రూ. 25 వేలలోపు రుణాలున్న రైతులు 5,83,916 మంది ఉండగా వారందరి రుణాలను నూరు శాతం ఒకే దఫాలో మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం కొత్త నిర్ణయం. గతానికి ఇప్పటికీ ఇదే ప్రధాన తేడా. ఒకేసారి వారందరికీ రూ. 1,198 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ రుణమాఫీ మొత్తాలను ప్రతి రైతుకు వ్యక్తిగతంగా చెక్కుల రూపంలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తారు. అది కూడా ఈ నెలలోనే ఇస్తారు. ఇక రూ. 25 వేల నుంచి రూ. లక్షలోపు ఉన్న రుణాలు రూ. 24,738 కోట్లుగా ఉండగా ఆయా రైతుల సంఖ్య ఎంతనేది వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. ఈ సొమ్మును మాత్రం నాలుగు విడతలుగా అందజేస్తారు. అంటే నాలుగేళ్లలో క్లియర్ చేసే అవకాశముంది. వాటిని కూడా చెక్కుల రూపంలో ఎమ్మెల్యేల చేతుల మీదుగానే అందిస్తారు.

ఈ బడ్జెట్లో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కోసం ఏకంగా రూ. వెయ్యి కోట్లు కేటాయించడం విశేషం. కేంద్ర ప్రభుత్వం ప్రతిసారీ మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన పంటల విషయంలో పరిమితి విధిస్తుండటంతో రైతులు దళారులను ఆశ్రయించే పరిస్థితి తలెత్తుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. వరి, పత్తి, మొక్కజొన్న, కందులు తదితర పంటల కొనుగోలుకు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు సరైన ధర వచ్చేలా చేయాలనేది సర్కారు ఉద్దేశం. ఈ ఏడాది పండిన కందులలో కొద్ది శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. కంది రైతులను ఆదుకునే లక్ష్యంతో ఎంత ఖర్చయినా సరే మొత్తం కందులను కొనుగోలు చేయాలని బడ్జెట్‌లో స్పష్టం చేసింది. అలాగే ఈ ఏడాది రూ.600 కోట్లతో మైక్రో ఇరిగేషన్ కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించింది.

**మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌కు రూ. 1,000 కోట్లు**

### రైతు బీమాకు రూ. 1,141 కోట్లు..



రైతు బీమాకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 1,141 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ఏ రైతు, ఏ కారణంతో మరణించినా ఆ కుటుంబానికి వెంటనే రూ. 5 లక్షలు అందించడమే దీని ఉద్దేశం. 18 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న ప్రతి రైతుకూ బీమా సదుపాయం కల్పిస్తారు. ప్రతి రైతు పేరిట రూ. 2,271.50 ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే ఎల్‌ఐసీ సంస్థకు క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. రైతు చనిపోయిన 10 రోజుల్లోపే వారి కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షలు బీమా పరిహారం చెల్లిస్తుంది.

### ఒక్కో రైతు వేదికకు రూ. 12 లక్షలు

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 5 వేల ఎకరాల క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతు వేదికలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో రైతు వేదికను రూ. 12 లక్షలతో నిర్మించాలని బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. అందుకోసం మొత్తం రైతు వేదికల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో రూ. 350 కోట్లు కేటాయించింది. పాడి రైతులకు అందించే ప్రోత్సాహకం కోసం ఈసారి బడ్జెట్‌లో రూ. 100 కోట్లు, పశుపోషణ, మత్స్యశాఖకు రూ. 1,586.38 కోట్లు కేటాయించారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయశాఖ భావించినా బడ్జెట్‌లో మాత్రం నిరాశే ఎదురైంది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ. 304.34 కోట్లు కేటాయించగా ఈసారి మాత్రం కేటాయింపులు లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రైతులకు విత్తన సరఫరా కోసం రూ. 55.51 కోట్లు కేటాయించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి గత బడ్జెట్‌లో రూ. 20 కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ. 25 కోట్లు కేటాయించారు. విత్తనాల సబ్సిడీకి రూ. 142 కోట్ల మేర కేటాయింపులు చేశారు.

### రైతు బడ్జెట్



> ఇది రైతు బడ్జెట్ అని మళ్లీ నిరూపితమైంది. బడ్జెట్‌లో అగ్రభాగం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయించడం సంతోషకరం. రైతుబంధు పథకానికి అదనంగా రూ. 2 వేల కోట్లు కేటాయించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. లక్షలోపు రైతు రుణాల మాఫీ కోసం రూ. 6,225 కోట్లు కేటాయించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పంటల కొనుగోళ్ల కోసం రూ. 1,000 కోట్లు కేటాయించడం సాహసోపేతమైన చర్య.
> – నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

### రాబడి/ వ్యయం (రూ.కోట్లలో)

**రాక..**
- 1,43,151.94 రెవెన్యూ రాబడులు..
- 35,500.00 అప్పులు..
- 50.00 రుణ వసూళ్లు
- 4,000.00 ప్రజాపద్దు..



**పోక..**
- 1,38,669.82 రెవెన్యూ వ్యయం..
- 22,061.18 మూలధన వ్యయం..
- 6,521.22 రుణాల చెల్లింపు..
- 15,662.20 రుణాలు, అడ్వాన్సుల చెల్లింపులు

నికర లోటు.. 212.48

# ద్రవ్య లోటును అధిగమిస్తాం

**సాక్షి, హైదరాబాద్:** రాజధాని హైదరాబాద్‌తో సహా అన్ని జిల్లా కేంద్రాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పుంజుకున్నందున డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ద్వారా ఇతర రూపాల్లో ప్రభుత్వ భూములు, నిరర్థక ఆస్తులు, రాజీవ్ స్వగృహ ఇళ్ల విక్రయించి ఆదాయ సామర్థ్యాన్ని పెంచుకుంటామని మంత్రి టి.హరీశ్‌రావు వెల్లడించారు. ఆదివారం బడ్జెట్ సమర్పణ అనంతరం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర అధికారులతో కలసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల అమ్మకంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకు అనుగుణంగానే సుప్రీంకోర్టు ద్వారా రాష్ట్రానికి చెందిన విలువైన భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యల వల్లే ఇది సాధ్యమైందన్నారు. రెండు నెలల క్రితం మద్యం ధరలు పెరిగినందున, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆ మేరకు ఎక్సైజ్ ఆదాయం కూడా పెరిగే అవకాశాలున్నాయని వెల్లడించారు. దీంతో పాటు ద్రవ్య లోటును సొంత ఆదాయం పెంచుకోవడం, వ్యవస్థలోని లోపాలను పూడ్చుకోవడం, ఇతరత్రా రూపాల్లో భర్తీ చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుందని, హైదరాబాద్‌లో రియల్ వ్యాపారానికి భారీగా డిమాండ్ ఉన్నందున, ఆదాయం కోసం భూములను అమ్మేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.

**అనుకున్న ఫలితాలు సాధిస్తాం..**

భవిష్యత్‌లో ఎలాంటి ఎన్నికలు లేనందున, ఇకపై పూర్తిగా కేబినెట్, అధికార యంత్రాంగం పరిపాలనపై పూర్తి దృష్టి పెట్టి అనుకున్న ఫలితాలను సాధిస్తామని ఆర్థిక మంత్రి హరీశ్ చెప్పారు. కేంద్రం నుంచి టాక్స్ డివల్యూషన్ కింద 2019–20లో రాష్ట్రానికి రావాల్సింది భారీగా తగ్గిందని, 15వ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు 2020–21లో రావాల్సిన మేర గ్రాంట్లు, వనరులు రాలేదన్నారు. జీఎస్టీ చెల్లింపుల్లో భాగంగా కేంద్రం నుంచి రూ. 2,600 కోట్లే వచ్చాయని, ఇంకా రూ. 933 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్రం నుంచి జీఎస్టీ కంపన్సేషన్ రావాల్సిన నిధుల కోత ఉన్నా, గతేడాదితోపాటు వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూడా సంక్షేమానికి కోతలు పెట్టలేదన్నారు. సంక్షేమానికి నిధుల కేటాయింపుతోపాటు ఈ బడ్జెట్‌లో హైదరాబాద్ అభివృద్ధికి రూ. 10 వేల కోట్లు పెట్టాలనేది పెద్ద నిర్ణయమన్నారు. కాళేశ్వరం వల్ల 150 కి.మీ. పొడవునా గోదావరి పారుతున్నందున రూ. 300 కోట్లతో గోదావరి రివర్ ఫ్రంట్ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

**కేంద్రమంత్రే ఆ విషయాన్ని చెప్పారు..**

ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే తెలంగాణ అప్పులు తీసుకుందని ఇటీవల లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనడాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇప్పటికే భారీగా అప్పులు చేశారని, ఇంకా చేస్తున్నారని రాజకీయంగా వస్తున్న విమర్శలకు ఇదే తగిన సమాధానమన్నారు. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ సరిగా జరగలేదని కాగ్ తెలిపిందని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. అన్ని రాష్ట్రాలకు పంపిణీ తప్పుగా జరిగిందని, తెలంగాణకు రూ.2,300 కోట్ల మేర అన్యాయం జరిగినట్లు వెల్లడించిందన్నారు. ఈ విషయమై కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ ఇప్పటికే లేఖలు రాసినందున, ఈ మేరకు రాష్ట్రానికి డబ్బు వచ్చే అవకాశాలున్నాయని వెల్లడించారు.

## లిక్కర్ 'లిక్విడ్'పై అంచనా..
# 16 వేల కోట్లు

- ఈసారి భారీగా పెరిగిన ఎక్సైజ్ ఆదాయ అంచనాలు
- ఇటు పెరిగిన అన్ని రకాల పన్ను అంచనాలు
- పన్నేతర ఆదాయం కూడా భారీగా పెంపు

**30% 2019-20తో పోలిస్తే అధికం**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మద్యం ఆదాయంపై భారీ అంచనాలే పెట్టుకుందని బడ్జెట్ ప్రతిపాదనలు చెబుతున్నాయి. 2019–20 సంవత్సరంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.10,637 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.12,600 కోట్లు ఆదాయం వస్తుందని సవరించిన అంచనాల్లో పేర్కొన్నారు. దీంతో 2020–21కి దీనికి దాదాపు 30 శాతం అదనంగా రూ.16 వేల కోట్ల అంచనాలను ప్రతిపాదించారు. అలాగే అన్ని రకాల పన్ను అంచనాలు కూడా ఈసారి పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పన్నుల్లో కేంద్ర వాటాతో సహా రాష్ట్ర పన్నులు (జీఎస్టీతో కలిపి), అమ్మకపు పన్ను, వాణిజ్య పన్ను, ఇతర పన్నులను కూడా పెంచుతూ 2020–21 బడ్జెట్ అంచనాలు ప్రతిపాదించారు. పన్ను ఆదాయంతో పాటు పన్నేతర ఆదాయంపై కూడా ప్రభుత్వం భారీగానే ఆశలు పెట్టుకుంది. 2019–20 సంవత్సరంలో పన్నేతర ఆదాయం కింద రూ.10,007 కోట్ల ఆదాయం అంచనా వేయగా, సవరించిన అంచనాల్లో రూ.12,275 కోట్లుగా పేర్కొంది. అయితే అంచనాలకు అందని విధంగా ఈసారి 2020–21 బడ్జెట్‌లో పన్నేతర ఆదాయ అంచనాను రూ.30,600 కోట్లుగా చూపెట్టింది. ఆదాయ పెంపు మార్గాలపై ప్రభుత్వం స్పష్టతకు వచ్చిందని, అందుకే పన్నేతర ఆదాయాన్ని 150 శాతం వరకు పెంచిందని ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి.

**కేంద్ర పన్నులపై ఆశ..**

ఇటు కేంద్ర పన్నులపై కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆశ తగ్గలేదు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నుల్లో వాటా కింద రాష్ట్రానికి రూ.18,560 కోట్లు కేంద్రం నుంచి వస్తాయని అంచనా వేయగా, సవరించిన అంచనాల్లో అది రూ.15,987 కోట్లు మాత్రమే వచ్చింది. దీనికి కొంత అదనంగా 2020–21 బడ్జెట్‌లో కేంద్ర పన్నుల వాటా కింద రూ.16,726 కోట్లు ప్రతిపాదించింది. ఇక కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో 2019–20 సవరించిన అంచనాల కంటే తక్కువగానే 2020–21 సంవత్సరానికి అంచనా వేసింది.



### విభాగం: వైద్య–ఆరోగ్య/కుటుంబ సంక్షేమం

అంకెలు: రూ.కోట్లలో




### ఉన్నత విద్య/ సెక్రటేరియెట్ డిపార్టుమెంట్







### హోంశాఖ




### గృహ నిర్మాణం




### పరిశ్రమలు/ వాణిజ్యం






సాక్షి, హైదరాబాద్: అప్పులు చేయడమే కాదు రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు పూచీకత్తులు కూడా బాగానే ఇస్తోంది. అసెంబ్లీలో ఆది వారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి1 నాటికి రూ.89,600 కోట్ల పూచీకత్తులను వివిధ ప్రభుత్వ శాఖలకు పలు కార్పొరేషన్ల ద్వారా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అప్పుల మొత్తానికి అదనంగా మరో 40% పూచీ కత్తుల కింద బాకీ పడిందన్నమాట. ఇందులో రూ.44,771 కోట్ల రూపాయలు ఒక్క సాగు నీటి శాఖకే పూచీకత్తు ఇవ్వడం గమనార్హం. ఈ మొత్తంలో కాళేశ్వరం ప్రాజెక్టు కార్పొ రేషన్‌కు రూ.35,086 కోట్ల పూచీకత్తు ఉం డగా, ఆయకట్టు అభివృద్ధి కార్పొరేషన్‌కు 9,675 కోట్లు గ్యారంటీ ఇచ్చింది. మిషన్ భగీ రథ కింద హడ్కో, నాబార్డులకు తెలం గాణ తాగునీటి సరఫరా

## అప్పుల్లో 40% 'పూచీకత్తులు' కూడా..



సంస్థ ద్వారా రూ.24వేల కోట్ల వరకు పూచీకత్తు ఇచ్చింది. రాజీవ్ స్వగృహ, తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ లిమిటెడ్‌లకు బ్యాంకుల ద్వారా 5,845 కోట్లకు పూచీకత్తు ఇచ్చింది. హైదరాబాద్ జలమండలికి రూ.3,481 కోట్లు, గొర్రెలు, మేకల సహకార అభివృద్ధి సంస్థకు రూ.2,826 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రూ.3,151 కోట్ల వరకు గ్యారంటీలు ఇచ్చింది. మొత్తం ప్రభు త్వం ఇస్తున్న పూచీకత్తుల్లో ఎక్కువగా బ్యాం కులు ఉండగా, ఆ తర్వాత హడ్కో, నాబార్డు, జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ)లున్నాయి. కాగా, రాష్ట్ర ప్రభు త్వం నేరుగా చేస్తున్న అప్పులకు తోడు పూచీ కత్తులు మొత్తం కలిపితే రూ.3.18 కోట్లకు పైగా కుబేర రుణ ఖాతాలో చేరింది.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సంపద సృష్టికి ఖర్చు చేసిన మొత్తం రూ. 1.27 లక్షల కోట్లు. ఇందులో అత్యధికంగా 2017–18లో దాదాపు రూ.30 వేల కోట్లకుపైగానే ఖర్చు చేశారు. అదే స్థాయిలో 2016–17లోనూ వ్యయమైంది. 2019–20లో మూలధన వ్యయం తగ్గినా, మళ్లీ తాజాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.22 వేల కోట్లను ప్రతిపాదించారు. తద్వారా సంపద సృష్టిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.

## మూలధన వ్యయం... 1.27 లక్షల కోట్లు

గత ఆరేళ్లలో చేసిన మూలధన వ్యయంతో పాటు 2020–21 సంవత్సరంలో ప్రతిపాదన వివరాలివే:

| ఆర్థిక సంవత్సరం | మూలధనం (రూ.కోట్లలో) |
|---|---|
| 2014-15 | 15,101.19 |
| 2015-16 | 15,982.51 |
| 2016-17 | 29,313.11 |
| 2017-18 | 30,929.94 |
| 2018-19 | 22,640.53 |
| 2019-20 | 13,165.72 |
| 2020-21 | 22,061.18 |

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో అటవీ, పర్యావ రణ, శాస్త్ర సాంకేతిక శాఖకు రూ.791.47 కో ట్లు ప్రతిపాదించారు. ఇందులో నిర్వహణ పద్దు కింద రూ. 781.15, ప్రగతి పద్దు కింద రూ.10.32 కోట్లుగా చూపారు. గతేడాది సవ రించిన బడ్జెట్‌తో పోల్చితే ప్రగతి పద్దు రూ.63.50 కోట్ల మేరతగ్గగా, నిర్వహణపద్దు

## అటవీ శాఖకు రూ.791 కోట్లు..



స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టు టైగర్ పద్దు కింద గతేడాది రూ.73.82 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.7.38 కోట్లు మాత్రమే కేటా యించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 24 శాతమున్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో చేపట్టిన 'తెలంగాణకు హరితహా రం' కార్యక్రమంలో భాగంగా మొక్కల సంరక్ష ణపై అటవీశాఖ దృష్టిపెట్టింది. నూతన పంచా యతీరాజ్, మున్సిపల్ చట్టాల ప్రకారం సంబంధిత బడ్జెట్లలో 10% నిధులను విధిగా హరిత ప్రణాళిక అమలుకు ఖర్చుచేయాలని చట్టంలో నిబంధనను విధించింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వాస్తవిక దృక్పథం, నిర్మాణాత్మకమైన ఆలోచనల కలయికగా బడ్జెట్ ఉందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో తమ శాఖలకు చేసిన సంతృప్తికర కేటాయిం పులపై అసెంబ్లీలోని చాంబర్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# పల్లెకు ప్రగతి

## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు భారీగా నిధులు

**23,005.35** కోట్లు.. బడ్జెట్‌లో కేటాయించింది..

**57** ఏళ్లు ఆసరా పింఛన్ల అర్హత వయసు..

**574** కోట్లు.. ఆర్థిక సంఘం నిధులు పెంపు అధికం..

సాక్షి, హైదరాబాద్: పల్లె ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు దండిగా నిధులు కేటాయించింది. గ్రామీణ వికాసానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్న సర్కారు.. అదే ఒరవడిని కొనసాగించేలా బడ్జెట్‌ను ప్రతిపాదించింది. 2020–21 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.23,005.35 కోట్లను కేటాయించింది. గతేడాదితో పోలిస్తే ఇది ఏకంగా రూ.7,880.46 కోట్లు అధికం. కాగా, ఈ ఏడాది బడ్జెట్లో రూ.4,701.04 కోట్లు నిర్వహణ పద్దు కాగా, రూ.18,304.31 కోట్లు ప్రగతి పద్దు. వ్యవసాయం తర్వాత అత్యధిక నిధులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు దక్కడం విశేషం.



### వడ్డీలేని రుణాల్లో కోత

డ్వాక్రా మహిళలకు ఇచ్చే వడ్డీ రుణాలకు స్వల్పంగా కోత పెట్టింది. గతేడాది రూ.680.49 కోట్లు కేటాయించగా.. ఈ సారి 679.23 కోట్లు ప్రతిపా దించింది. అలాగే, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో జరిగే పను లకు రూ.54 కోట్లు కేటాయించింది. 2019–20తో పోలిస్తే రూ.13 కోట్లు అదనం. శ్యాంప్ర సాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద రూ.15.09 కోట్లు కేటాయించింది. ఇది గతేడాది కంటే రూ.11 కోట్లు అధికం.

### ఆసరా పింఛన్లకు రూ.11,758 కోట్లు

అసహాయులైన పేదలకు ఆసరా పింఛన్లతో అండగా నిలుస్తున్న ప్రభుత్వం.. ఈ ఆర్థిక సంవ త్సరానికిగాను ఆసరా పథకం కింద రూ.11,758 కోట్లను ప్రతిపాదించింది. గతేడాది రూ.9,402 కోట్లు కేటాయించగా.. ఈసారి అదనంగా మరో రూ.2,356 కోట్లను బడ్జెట్‌లో పొందుపరిచింది. వృద్ధాప్య పింఛన్ల అర్హత వయసును 65 నుంచి 57 ఏళ్లకు తగ్గించనుండటంతో లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం వివిధ కేటగిరీల కింద 39.41 లక్షల మందికి ఆసరా పింఛన్ అందుతుండగా.. అర్హత వయసు తగ్గింపుతో మరో ఏడెనిమిది లక్షల మంది అదనంగా పింఛన్‌కు అర్హత సాధించే అవకాశముంది.

ప్రస్తుతం రాష్ట్రంలో అందజేస్తున్న ఆసరా పింఛన్ల వివరాలు..

| | |
|---|---|
| వృద్ధులు | 12,92,363 |
| వికలాంగులు | 4,98,565 |
| వితంతువులు | 14,58,545 |
| చేనేత కార్మికులు | 37,569 |
| గీత కార్మికులు | 63,162 |
| హెచ్ఐవీ బాధితులు | 33,229 |
| బోదకాలు బాధితులు | 14,403 |
| బీడీ కార్మికులు | 4,08,755 |
| ఒంటరి మహిళలు | 1,35,162 |
| మొత్తం | 39,41,753 |

### దండిగా ఆర్థిక సంఘం నిధులు..

గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టింది. ఈ ఏడాది నుంచి అమల్లోకి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీలకు నిధుల కొరత తీర నుంది. ఇప్పటికే ప్రతినెలా రూ.339 కోట్లు కేటాయిస్తున్న సర్కారుకు ఈ నిధుల రాకతో వెసులుబాటు కలుగ నుంది. ఈ నేపథ్యంలో 2020–21లో గ్రామ పంచాయతీలకు రూ.1,393.93 కోట్ల ఆర్థిక సంఘం నిధులను అందించ నుంది. గతేడాది కేవలం రూ.819.44 కోట్లు కేటాయించగా.. ఈ సారి అద నంగా రూ.574.49 కోట్లు పెంచింది.

పంచాయతీరాజ్ శాఖలో ముఖ్య కేటాయింపులు ఇలా (రూ.)

| | 2019-20 | 2020-21 |
|---|---|---|
| జెడ్పీటీసీల గౌరవ వేతనం | 1,391.70 | 1,069.20 |
| ఎంపీటీసీల గౌరవవేతనం | 500 | 4,161 |
| సర్పంచ్‌ల గౌరవవేతనం | 5,500 | 7,661.40 |
| 14వ ఆర్థిక సంఘం నిధులు | 1,229.16 కోట్లు | 1,393.93 కోట్లు |
| రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు | 819.44 కోట్లు | 1,393.93కోట్లు |
| పీఎం ఆదర్శ్ గ్రామ్‌యోజన | - | 5 కోట్లు |
| గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్ | - | 1.12 కోట్లు |

# తలసరి అప్పు 65,480

## రాష్ట్ర ప్రజలపై పెరిగిన అప్పుల భారం..

**గత బడ్జెట్‌లో తలసరి అప్పు రూ.58,202**

**ఈసారి రూ.2.29 లక్షల కోట్లకు చేరిన అప్పులు**

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రజలపై తలసరి అప్పు ఏటేటా పెరిగిపోతోంది. ప్రాధాన్య కార్యక్రమాలతో పాటు మూలధన వ్యయం కింద వెచ్చించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడి తీసుకొస్తున్న అప్పులు పెరిగి పోతుండటంతో తలసరి అప్పు పెరుగు తోందని బడ్జెట్ లెక్కలు చెపుతున్నాయి. 2020–21 బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్ర అప్పు రూ.2.29 లక్షల కోట్లకు చేరింది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభా 3,50,03,674తో భాగిస్తే ఇది రూ.65,480గా తేలింది. అంటే రాష్ట్రం లోని ప్రతి వ్యక్తిపై ఉన్న తలసరి అప్పు రూ.65,480 అన్నమాట. గతేడాది బడ్జెట్ లెక్కల ప్రకారం ఇది రూ.58,202 కాగా, ఈ ఏడాది మరో రూ.7,278 పెరిగింది. కాగా, రాష్ట్ర అప్పు జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి)తో పోలిస్తే

గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో చేసిన అప్పుల వివరాలివి.. (కోట్లలో)

| సంవత్సరం | రుణాలు | జీఎస్‌డీపీ(%) |
|---|---|---|
| 2016-17 | 1,29,531.89 | 20.04 |
| 2017-18 | 1,52,190.12 | 20.21 |
| 2018-19 | 1,75,281.07 | 20.25 |
| 2019-20 | 1,99,215.30 | 20.55 |
| 2020-21 | 2,29,205.16 | 20.74 |

20.74 శాతానికి చేరడం గమనార్హం.

### రూ.1.87 లక్షల కోట్లు బహిరంగ మార్కెట్‌లోనే..



రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న రుణాలను పరిశీలిస్తే బహిరంగ మార్కెట్‌లోనే ఎక్కువగా రుణాలు తీసుకుం టోంది. ఇప్పటివరకు బహిరంగ మార్కెట్‌లో రూ.1.87 లక్షల కోట్లకు పైగా రుణాలు సమీకరించగా, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.8,682 కోట్లు, స్వయం ప్రతిపత్తి గల ఇతర సంస్థల నుంచి 13,961 కోట్లు, బాండ్ల రూపంలో రూ.18,954 కోట్లు సమీకరించినట్టు బడ్జెట్ ప్రతి పాదనల్లో ప్రభుత్వం వెల్లడిం చింది. గత ఐదేళ్ల లెక్కలు పరిశీలిస్తే 2016–17 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభు త్వానికి రూ.1.29 లక్షల కోట్ల అప్పుంటే 2020–21 నాటికి అది 2.29 లక్షల కోట్లకు పెరిగింది. అంటే గత ఐదేళ్లలో పెరిగిన రాష్ట్ర అప్పు అక్షరాల లక్ష కోట్ల రూపాయలన్నమాట.

### పీఆర్సీ, ఐఆర్ ఈసారి కష్టమే!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్న పీఆర్సీ కోసం ఇంకొన్నా ళ్లు ఆగాల్సిన పరిస్థితి నెలకొంది. బడ్జెట్‌లో పీఆర్సీ అమలు కోసం నిధులను కేటాయిం చకపోవడంతో ఉద్యోగులు ఆందోళనలో పడ్డా రు. ప్రస్తుత బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేకపోవ డంతో కొంత ఆందోళనకు గురయ్యారు. మధ్యం తర భృతి (ఐఆర్) ప్రస్తావన కూడా లేక పోవడంతో తీవ్ర నిరాశ చెందా

- ఎలాంటి కేటాయింపులు లేకుండానే బడ్జెట్...
- రిటైర్‌మెంట్ వయసు పెంపుపైనే ఆశ

రు. రాష్ట్రంలోని 2.62 లక్షల మంది ఉద్యోగులు, 2.68 లక్షల మంది పెన్షనర్లకు పీఆర్సీ అమలు చేయాల న్నా, ఐఆర్ ఇవ్వాలన్నా రూ.వేల కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ మొత్తం వెచ్చించే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం ఈ అంశానికి బడ్జెట్‌లో చోటు క ల్పించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థి క సంవత్సరం బడ్జెట్‌లోనే పీఆర్సీ అమలు అంశా న్ని చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఉద్యో గుల రిటైర్‌మెంట్ వయసును 61 ఏళ్ల కు పెంచే అంశాన్ని కూడా ప్రభుత్వం సీరియస్‌గానే ఆలోచిస్తోంది. త్వరలోనే దీనిపై ఓ నిర్ణయం తీసుకోవడం ద్వా రా ఉద్యోగులను కొంత శాంతపరిచే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

# ఆరోగ్యమస్తు



సాక్షి, హైదరాబాద్

వైద్య ఆరోగ్యరంగానికి ఈసారి బడ్జెట్లో ప్రభుత్వం రూ. 6,185.97 కోట్లు కేటాయించింది. 2019–20 ఆర్థిక సంవ త్సరంలో రూ. 5,694 కోట్లు కేటాయించగా, ఈసారి అదనంగా రూ. 491 కోట్లు కేటాయించడం విశేషం. మొత్తం వైద్య ఆరోగ్య బడ్జెట్లో రూ. 2,361.81 కోట్లు ప్రగతి బడ్జెట్ కాగా, 3,824.16 కోట్లు నిర్వహణ బడ్జెట్ కావడం గమనార్హం. ఈ ప్రగతి బడ్జెట్లో అత్యధికంగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలో అమలయ్యే పథకాలకు అధికంగా రూ.1185 కోట్లు కేటా యించారు. గత బడ్జెట్లో రూ.886.49 కోట్లు కేటా యించగా, ఈసారి మరింతగా పెంచడం గమనార్హం. ఆయుష్ విభాగానికి గత బడ్జెట్లో రూ. 6.86 కోట్లు ఇవ్వగా, ఈసారి 33.25 కోట్లు కేటాయించారు. అంటే గతం కంటే ఏకంగా రూ. 26.39 కోట్లు అదనం కావడం విశేషం. ఇక ఎంతో ప్రాధాన్యం కలిగిన కేసీఆర్ కిట్‌కు గత బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించగా, ఈసారి 443 కోట్లకు తగ్గింది. ఈజేహెచ్ఎస్ స్కీంకు గతంలో రూ. 417 కోట్లు కేటా యించగా, ఈసారి 410.35 కోట్లు దక్కాయి. ఆరోగ్యశ్రీకి గతంలో రూ. 720. 12 కోట్లు కేటాయిం చగా, ఈసారీ అదే స్థాయిలో ఉంది. ఇక ఔషధాల కోసం గత బడ్జెట్లో రూ.236.14 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.262.41 కోట్లు ఇచ్చారు.ఇక ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసు పత్రికి గతంలో రూ.20 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడూ అంతే ఇచ్చారు.

- ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు రూ.6.185 కోట్లు
- నిధుల పెంపు... గతం కంటే రూ. 491 కోట్లు అదనం
- ఆరోగ్య కుటుంబ సంక్షేమానికి అత్యధికంగా రూ.1,185 కోట్లు
- ఆయుష్ వైద్యానికి మరింత ప్రాధాన్యం... గతం కంటే అదనంగా రూ. 26 కోట్లు
- చెవి, ముక్కు, గొంతు, దంత వ్యాధుల నిర్ధారణకు కార్యాచరణ
- తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని నిర్ణయం

### ఆ వ్యాధుల నిర్ధారణకు కార్యాచరణ...

కంటి వెలుగు తరహాలోనే చెవి, ముక్కు, గొంతు, దంత సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం త్వరలో ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు బడ్జెట్లో ప్రకటించారు. తెలంగాణ లోని ప్రతీ పౌరుడికి వైద్య పరీక్షలు నిర్వహించి తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ రూపొందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 118 బస్తీ దవాఖానాలు పేదలకు వైద్య సేవలు అందిస్తున్నాయి . వాటికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. వాటి సంఖ్యను 350కి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది . ఇప్పుడు నడుస్తున్న వాటితో పాటు, మరో 232 ప్రభుత్వం త్వరలోనే ప్రారంభించాలని బడ్జెట్లో ప్రకటించారు.ప్రతీ డివిజన్‌లో కనీసం రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటుతో పాటు ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో అదనంగా ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలోని ప్రజల కంటి సంబంధ సమస్యలను పరిష్కరించడానికి కంటి వెలుగు పేరుతో ప్రపంచంలోనే అతి భారీ ఐ స్క్రీనింగ్ డ్రైవ్ ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సంగతి తెలిసిందే. 1.54 కోట్ల మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగానే మందులు, అద్దాలు పంపిణీ చేశారు.

### కరోనాపై ప్రస్తావన...

రాష్ట్రంలో కరోనా వైరస్ ప్రబలకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి ప్రస్తావించారు. వేసవిలో ఉండే ఎండ వేడికి వైరస్ మనుగడలో ఉండే అవకాశమే లేదని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎండాకాలం ప్రారంభమైనందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సర్కారు స్పష్టం చేసింది. అయినప్పటికీ ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. ప్రజలు కరోనా వైరస్‌పై చెలరేగే వదంతులను నమ్మవద్దని బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు విన్నవించింది. ఇదిలావుండగా కరోనాను కట్టడి చేసేందుకు ప్రభుత్వం రూ. 100 కోట్లు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే.

# వడ్డీ చెల్లింపులకు 14,615 కోట్లు

సాక్షి, హైదరాబాద్

వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలకు సంబంధించిన రెవెన్యూ ఖాతా వ్యయ పట్టికలో రూ. 14,615 కోట్లను వడ్డీ చెల్లింపుల కింద ప్రభుత్వం చూపింది. వర్తమాన ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌లో వడ్డీ చెల్లింపుల కింద రూ. 14,574 కోట్లు ఉండగా, సవరించిన అంచనాల ప్రకారం రూ. 14,385 కోట్లు చెల్లించారు. ఇప్పుడు

- గత ఏడాదికి అటూ ఇటుగానే వడ్డీ చెల్లింపులు
- అసలు చెల్లింపుల కింద రూ.15 వేల కోట్లు పైమాటే
- ఈ ఏడాది మళ్లీ రూ. 35,500 కోట్ల రుణాలు తెచ్చే ప్రతిపాదన
- మూల ధన వ్యయం రూ. 22,061 కోట్లు... మూడేళ్లలో పెరిగిన రూ.3,780 కోట్ల వడ్డీలు

కూడా కాస్త అటూ ఇటుగానే వడ్డీ చెల్లింపులు చూపెట్టారు. అయితే, వడ్డీలకు తోడు రుణాలు, అడ్వాన్సుల అసలు చెల్లింపుల కింద రూ. 15,662 కోట్లు ప్రతిపాదించారు. దీంతో అప్పుల అసలు, వడ్డీల చెల్లింపులు రూ. 30 వేల కోట్లు దాటాయి. సరిగ్గా రెండేళ్ల క్రితం 2017–18 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ చెల్లింపులు రూ. 10,835 కోట్లు ఉండగా మూడేళ్లలో అది రూ. 3,780 కోట్ల మేర పెరిగిపోయినట్టు లెక్కలు చెబుతున్నాయి.



### తప్పని అప్పుల తిప్పలు..

ఇక, ఈ ఏడాదీ పెద్దఎత్తున రుణాలు అవసరమవుతాయని బడ్జెట్ అంచనా లెక్కలు చెబుతున్నాయి. ఏ రూపంలో అయినా రూ. 35,500 కోట్ల మేర అప్పుల ద్వారా సమీకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. గత ఏడాదితో పోలిస్తే 2,600 కోట్ల రుణం ఎక్కువగా ప్రతిపాదించింది. ఇందులో ఓపెన్‌మార్కెట్ రుణాల కింద రూ.34 వేల కోట్లు సేకరించాలని, కేంద్రం నుంచి రూ.400 కోట్లు, ఇతర రుణాలు రూ.1000 కోట్లు సమీకరించాలని ప్రతిపాదించారు. అదే 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.32,900 కోట్ల రుణాలు అంచనా వేయగా, రూ. 31,800 కోట్లు సమీకరించారు. కేంద్రం నుంచి రూ.800 కోట్లు వస్తాయని అంచనా వేస్తే కేవలం రూ.200 కోట్లే వచ్చాయి. ఇక, ఇతర రుణాల కింద రూ.1000 కోట్లు సమీకరించాలనే ప్రతిపాదన ఉన్నా రూ.500 కోట్లు మాత్రమే కార్యరూపంలోకి వచ్చాయి.

### మూలధన వ్యయం పెరిగింది..

కాగా, ఈ ఏడాదితో పోలిస్తే మూల ధన వ్యయాన్ని పెంచుతూ బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేశారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 17,274 కోట్లు మూల ధన వ్యయాన్ని ప్రతిపాదించగా, సవరించిన అంచనాల ప్రకారం రూ. 13,165 కోట్లు ఖర్చయింది. ఇక, 2020–21 ఆర్థిక సంవత్సరానికి వర్తమాన ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.8 వేల కోట్లు అధికంగా రూ. 22,061 కోట్లు మూల ధన వ్యయంగా ప్రతిపాదించారు. అదే 2018–19 ఆర్థిక సంవత్సరంలో మూల ధన వ్యయం 33,369 కోట్లు ప్రతిపాదించగా, సవరించిన అంచనాల ప్రకారం అది రూ. 22,640 కోట్లకు తగ్గింది. ఇక, ఈసారి అంచనాల్లో ప్రతిపాదించిన మొత్తంలో ఎంత వ్యయం సంపద సృష్టికి జరుగుతుందనేది ఆర్థిక సంవత్సరం ముగిశాక తేలనుంది.



















## ఖాకీ బడ్జెట్ ఓకే



- పోలీసు శాఖకు రూ. 5,852 కోట్లు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్యం కారణంగా గతేడాది బడ్జెట్ కేటాయింపుల్లో పోలీసు శాఖకు కోతపడినా.. ఈసారి కేటాయింపులు ఫర్వాలేదనిపించాయి. గతేడాది బడ్జెట్‌లో ప్రగతిపద్దు రూ.167 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ. 4,788 కోట్లు కేటాయించింది. కోతల బడ్జెట్ కారణంగా స్టేషన్ల నిర్వహణ కూడా సరిగా జరగలేదు. గడిచిన 6 నెలల్లో పోలీసు స్టేషన్లలో పెన్నూ, పేపర్లకూ దిక్కులేకుండా పోయింది. ఈసారి బడ్జెట్‌లో నిర్వహణ పద్దుకు రూ. 5,179.22, ప్రగతి కింద రూ. 672.74 కోట్లుగా మొత్తం రూ. 5,852 కోట్లు కేటాయించింది. ఈసారి ప్రగతి పద్దు, నిర్వహణ పద్దులు కలిపి గతేడాది ప్రతిపాదించిన బడ్జెట్ కంటే దాదాపుగా రూ.890 కోట్ల (ప్రగతి పద్దులో రూ.500 కోట్లు, నిర్వహణ పద్దులో రూ. 390 కోట్లు)కుపైగా పెరగడంతో నిర్వహణ ఖర్చులకు ఇబ్బందులు తలెత్తవని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది దసరా అనంతరం దాదాపు 11 మంది ఐపీఎస్‌లు, 15 వేల మంది కొత్త కానిస్టేబుళ్లు, 12 వందల మంది ఎస్సైలు డిపార్ట్‌మెంటులోకి చేరుతున్నారు. ధరలు పెరుగుతున్న నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహణ వ్యయాన్ని పెంచారు. మరోవైపు కొత్త జిల్లాల్లో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (డీపీవో) కార్యాలయాలు పూర్తి కావొచ్చాయని బడ్జెట్లో పేర్కొంది. ఈ ఏడాది పలు డీపీవోలు ప్రారంభించే అవకాశాలున్నాయని పోలీసు ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రేటర్‌లో మహిళలు, పిల్లల భద్రత, కమిషనరేట్ భవనాల నిర్మాణం, సేఫ్‌సిటీ ప్రాజెక్టు, కమాండ్ కంట్రోల్ రూం నిర్మాణాల కోసం మొత్తం రూ.125 కోట్లు కేటాయించింది. నగరంలో సీసీటీవీల ఏర్పాటు కోసం రూ.50 లక్షలు ఇవ్వనుంది.

## చిన్న పరిశ్రమల ప్రోత్సాహకాలు భారీగా పెంపు

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ, చిన్న పరిశ్రమలకు మంచి రోజులు రానున్నాయి. తాజా బడ్జెట్‌లో వీటికి రూ.1132.39 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. గతేడాది కేవలం రూ.21.90 కోట్లు మాత్రమే కేటాయించగా, ఈసారి భారీగా పెంచింది. ప్రధానంగా రాష్ట్రంలో నీటిపారుదల సదుపాయం పెరిగి కోటి ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా భారీగా పెరగనున్న పంటల దిగుబడులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్వహణ పద్దు కింద తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు పెట్టుబడి రుణం కింద కేటాయింపులను రూ.87.90 కోట్ల నుంచి రూ.257 కోట్లకు పెంచింది. ఈ నేపథ్యంలో గ్రామీణ, చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు భారీగా కేటాయింపులు జరిపింది. పరిశ్రమలకు రాయితీలను 38.98 కోట్ల నుంచి 16.71 కోట్లకు తగ్గించింది.



## గోదావరి తీరం సుందరీకరణకు రూ.250 కోట్లు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా వివిధ ప్రాంతాల్లో రూపుదిద్దుకున్న పంప్‌హౌస్‌లను ఆసరా చేసుకుని గోదావరి నదీ తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నత స్థాయిలో సమీక్ష నిర్వహించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుందర ఉద్యానవనాలు అభివృద్ధి చేయాలని, కశ్మీర్ తరహాలో ఎత్తయిన చెట్లను పెంచాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. దానికోసం తాజా బడ్జెట్‌లో పర్యాటక శాఖకు ప్రభుత్వం నిధులను కేటాయించింది. కన్నేపల్లి వద్ద ఉన్న లక్ష్మీ పంప్‌హౌస్ ప్రాంతానికి రూ.80 కోట్లు, మేడిగడ్డ వద్ద అభివృద్ధి పనులకు రూ.105 కోట్లు, కన్నేపల్లి నుంచి అన్నారం బ్యారేజీ మధ్య పనులకు రూ.40 కోట్లు, అన్నారం బ్యారేజీ వద్ద పనులకు రూ.25 కోట్లు కేటాయించారు. ఇక కళాకారుల వృద్ధాప్య పింఛన్ల కోసం రూ.6.75 కోట్లు, సాంస్కృతిక సారధికి రూ.16 కోట్లు కేటాయించారు.





# రూ.12,127.55 కోట్లు

సాక్షి, హైదరాబాద్

### గతేడాది కంటే విద్యకు రూ. 2,238.43 కోట్లు అదనం
### బడ్జెట్‌లో పాఠశాల విద్యకే రూ.10,405.29 కోట్లు
### ఈచ్ వన్ టీచ్ వన్‌కు రూ.100 కోట్లు..

రాష్ట్రంలో విద్యాశాఖకు 12,127.55 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆదివారం అసెంబ్లీలో ప్రకటించిన బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.12,144 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా, విభాగాల వారీగా చూస్తే రూ. 12,127.55 కోట్లుగా ఉంది. గతేడాది విద్యాశాఖకు రూ.9,899.12 కోట్లు మాత్రమే కేటాయించగా ఈసారి దానికి అదనంగా 2,238.43 కోట్లు ఇచ్చింది. విద్యాశాఖకు కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.10,405.29 కోట్లు, ఉన్నత విద్యకు రూ.1,452.03 కోట్లు, సాంకేతిక విద్యకు రూ.270.23 కోట్లను కేటాయించింది. ఇక ఈసారి అదనంగా ఇచ్చిన రూ.2,238.43 కోట్లలో పాఠశాల విద్యలోనే నిర్వహణ పద్దు కింద రూ.1,642.32 కోట్లను కేటాయించగా, ప్రగతి పద్దులో 598.82 కోట్లను కేటాయించింది. ప్రగతిపద్దులో ఈ మొత్తాన్ని సమగ్ర శిక్షా అభియాన్ కోసం కేటాయింపులు జరిపింది. వాస్తవానికి పాఠశాల విద్యకే రూ.14 వేల కోట్లకు పైగా బడ్జెట్ అవసరమని ప్రతిపాదనలను పంపించినా రూ.10,405.29 కోట్లకు ప్రభుత్వం కేటాయింపులు పరిమితం చేసింది. మరోవైపు ఈచ్ వన్ టీచ్ వన్‌కు రూ.100 కోట్లు కేటాయించింది.

**విభాగాల వారీగా కేటాయింపులివీ..**

నిర్వహణ పద్దులో పాఠశాల విద్యకు కేటాయించిన రూ.9,113.10 కోట్లలో సాధారణ విద్యకు రూ.8,864.25 కోట్లు, ప్రభుత్వ పరీక్షల విభాగానికి రూ.9.59 కోట్లు, వయోజన విద్యకు రూ.7.40 కోట్లు, ప్రభుత్వ గ్రంథాలయాలకు రూ.54.11 కోట్లు, జవహర్ బాలభవన్‌కు రూ.2.99 కోట్లు, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ముద్రణాలయానికి రూ.34.49 కోట్లు, తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు రూ.135.99 కోట్లు కేటాయించింది. సమగ్ర శిక్షా అభియాన్‌కు రూ.135.4 కోట్లు, ఇతరాల కింద మిగతా నిధులను కేటాయించింది. అయితే ఈ నిధులన్నీ నిర్వహణకు, వేతనాలకే సరిపోనున్నాయి. ఇక ప్రగతి పద్దులో రూ.1,292.19 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అయితే అవి పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఏమాత్రం సరిపోవని విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులు ఈ నిధులతో సాధ్యం కావని అంటున్నాయి.

**రెండేళ్ల కిందటితో పోల్చితే తక్కువే..**

కేంద్ర ప్రాయోజిత పథకాలకు రెండేళ్ల కిందటితో పోల్చితే ఈసారి చేసిన కేటాయింపులు తక్కువే. ఈ పథకాలకు రాష్ట్ర వాటాగా చెల్లించాల్సిన మొత్తం కింద గతేడాది రూ.491.56 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈసారి రూ.1,239.46 కోట్లను కేటాయించింది. గతేడాదితో పోల్చుకుంటే ఇది రెండు రెట్లు పెరిగింది. అయితే అంతకుముందు సంవత్సరాల్లో చేసిన కేటాయింపుల కంటే ఈసారి తగ్గిపోయింది. సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ), ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, సివిల్ వర్క్స్ వంటి పథకాలకు 40 శాతం రాష్ట్ర వాటా తప్పనిసరి. వాటి కోసం 2017–18 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ. 1,876.42 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ.1,546.39 కోట్లకు సవరించింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాల కోసం రూ. 491.56 కోట్లు మాత్రమే కేటాయించగా, 2020–21 కోసం రూ.1,239.46 కోట్లను కేటాయించింది. ఇక ఉన్నత విద్యలో కేంద్ర పథకాల కోసం రూ. 15.04 కోట్లను మాత్రమే కేటాయించింది.

**ప్రస్తుత బడ్జెట్‌లో 6.62 శాతమే..**

రాష్ట్రంలో విద్యారంగానికి ప్రాధాన్యం తగ్గుతోంది. గతేడాది కంటే ఈసారి బడ్జెట్‌ను పెంచినా మొత్తం బడ్జెట్‌లో విద్యాశాఖ కేటాయింపుల వాటా తక్కువే. రాష్ట్రంలోని పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, సాంకేతిక విద్యా సంస్థలకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు క్రమంగా పడిపోతున్నాయి. 2014–15 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఆదివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను పోల్చితే విద్యారంగానికి కేటాయింపులు 4.28 శాతం తగ్గిపోయాయి. 2014–15 ఆర్థిక సంవత్సరంలో విద్యాశాఖకు కేటాయించిన మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 10.88 శాతం కాగా, ఇప్పుడు అది 6.62 శాతానికి పడిపోయింది.

**ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు..** (రూ. కోట్లలో)

| కేటగిరీ | నిర్వహణ పద్దు | ప్రగతి పద్దు | మొత్తం |
|---|---|---|---|
| పాఠశాల విద్య | 9,113.10 | 1,292.19 | 10,405.29 |
| ఉన్నత విద్య | 1,372.95 | 79.08 | 1,452.03 |
| సాంకేతిక విద్య | 265.08 | 5.15 | 270.23 |
| మొత్తం | 10,751.13 | 1,376.42 | 12,127.55 |

**గతేడాది బడ్జెట్ కేటాయింపులు..** (రూ. కోట్లలో)

| కేటగిరీ | నిర్వహణ పద్దు | ప్రగతి పద్దు | మొత్తం |
|---|---|---|---|
| పాఠశాల విద్య | 7,515.65 | 693.38 | 8,209.03 |
| ఉన్నత విద్యాశాఖ | 1,312.56 | 55.32 | 1,367.88 |
| సాంకేతిక విద్యాశాఖ | 320.29 | 2.62 | 322.91 |
| మొత్తం | 9,148.5 | 751.32 | 9,899.82 |

## ఫీజులకు ఫుల్ బడ్జెట్

సాక్షి, హైదరాబాద్

పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రాష్ట్ర బడ్జెట్ ఫుల్ జోష్ ఇచ్చింది. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంతృప్తికర స్థాయిలో నిధులు కేటాయిస్తూ.. ఇకపై పాత బకాయిల ప్రస్తావన లేకుండా చేసింది. 2020–21 వార్షిక సంవత్సరంలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల కింద రూ.2,650 కోట్లు కేటాయించింది. వాస్తవానికి ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు ప్రతి సంవత్సరం సగటున రూ.2 వేల కోట్ల డిమాండ్ ఉంటుంది. పాత బకాయిలు, కొత్త వాటి చెల్లింపులకు సరిపడా నిధులు విడుదల కాకపోవడంతో గత కొన్నేళ్లుగా బకాయిలు పెండింగ్‌లో ఉండేవి. ఈ క్రమంలో పాత బకాయిలు లేకుండా చూడాలని ఆర్థిక శాఖ స్పష్టం చేయడంతో అన్ని సంక్షేమ శాఖలు యుద్ధప్రాతిపదిక చర్యలు చేపట్టాయి. 2019–20 వార్షిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఏకంగా రూ.3 వేల కోట్ల చెల్లింపులకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. వీటిని పూర్తి స్థాయిలో చెల్లిస్తే 2019–20 వార్షిక సంవత్సరానికి సంబంధించి 75 శాతం చెల్లింపులు చేయవచ్చు.

**ఫీజులకు మిగులు నిధులు..**

2020–21 వార్షిక సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద మిగులు నిధులు ఉంటాయని సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. వచ్చే వార్షిక సంవత్సరానికి సంబంధించి రూ.2,650 కోట్లు కేటాయింపులు జరపడంతో.. అప్పటి డిమాండ్ రూ.2,050 కోట్లు ఉంటుందని, 2019–20లో రూ.450 కోట్ల మేర ఉండే బకాయిలన్నీ చెల్లించినప్పటికీ కొంత మేర నిధులు సంక్షేమ శాఖల వద్ద ఉండే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

## గ్రేటర్ ఎన్నికలకు వేళాయే!

సాక్షి, హైదరాబాద్

జీహెచ్ఎంసీ ఎన్నికలకు ముందు హైదరాబాద్‌కు నిధుల పంట పండింది. 'హైదరాబాద్ అర్బన్ అగ్లోమరేషన్'అనే కొత్త పద్దు కింద ఏకంగా రూ.7,547 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. హైదరాబాద్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల కోసం ఈ నిధులు వినియోగించనున్నారు. హైదరాబాద్‌కు ఇంత పెద్దమొత్తంలో నిధులు కేటాయించడం ఇదే తొలిసారి.

**భారీగా పెరిగిన పుర బడ్జెట్**

రాష్ట్ర బడ్జెట్ 2020–21లో పురపాలక శాఖకు ప్రగతిపద్దు కింద రూ.11,020.37 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.1,261.98 కోట్లు కలిపి మొత్తం రూ.12,282.35 కోట్లు కేటాయించింది. 2018–19లో పురపాలక శాఖకు ప్రగతి పద్దు కింద రూ.4,680.09 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.1,262.21 కోట్లు కలిపి మొత్తం రూ.5,942.9 కోట్లు కేటాయించగా, తాజా కేటాయింపులు రెట్టింపు చేసింది. నిర్వహణ పద్దు కింద జల మండలికి నీటిసరఫరా, పారిశుధ్యం నిర్వహణ కోసం రుణాలను రూ.825 కోట్ల నుంచి రూ.900 కోట్లకు పెంచింది.



- హైదరాబాద్ అభివృద్ధికి రూ.7,547 కోట్ల కేటాయింపు
- చిన్న కార్పొరేషన్లకు వరుసగా రెండో ఏడాది కోత
- యాదాద్రి, వేములవాడ ఆలయాలకు పెరిగిన నిధులు
- పురపాలక శాఖకు రూ.12,282.35 కోట్ల కేటాయింపులు

**కార్పొరేషన్లకు మళ్లీ కోత..**

రాష్ట్ర ఆర్థిక సంఘానికి నిధుల కేటాయింపులను రూ.1,036.98 కోట్ల నుంచి రూ.889 కోట్లకు తగ్గించింది. రాష్ట్ర పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ కింద కేటాయింపులను రూ.521.73 కోట్ల నుంచి రూ.889 కోట్లకు పెంచింది. వడ్డీ లేని రుణాల పథకం కింద మున్సిపల్ కార్పొరేషన్లకు కేటాయింపులను రూ.75.47 కోట్ల నుంచి రూ.226.41కోట్లకు పెంచింది. వరంగల్‌కు రూ.226.41 కోట్లు, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, రామగుండం నగరాలకు కలిపి మొత్తం రూ.301.88 కోట్లను 2017–18లో కేటాయించిన ప్రభుత్వం, వరుసగా రెండో ఏడాది వీటికి రిక్తహస్తం చూపించింది. అయితే తొలిసారిగా మిషన్ భగీరథ (అర్బన్) పథకానికి రూ.800 కోట్లను కేటాయించింది.

**ఆలయాలకు రూ.400 కోట్లు**

యాదగిరిగుట్ట ఆలయాభివృద్ధి సంస్థకు గతేడాది రూ.50 కోట్లు కేటాయించగా, తాజాగా రూ.350 కోట్లకు పెంచింది. వేములవాడ ఆలయాభివృద్ధి సంస్థకు కేటాయింపులను రూ.5 కోట్ల నుంచి రూ.50 కోట్లకు పెంచింది.

## పేదల చేతికే డబుల్ బెడ్రూమ్ నిధులు



సాక్షి, హైదరాబాద్: ఇకనుంచి రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకునే దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా వార్షిక బడ్జెట్ 2020–21లో రూ.11,917 కోట్లను కేటాయించింది. పేదల చేతికే డబుల్ బెడ్రూమ్ నిధుల్ని అందిస్తామని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రకటించడంతో ఈ ఆర్థిక ఏడాదిలో ఈ ప్రాజెక్టు పరుగుపెట్టే అవకాశం కనిపిస్తోంది. ఇదివరకు ప్రత్యేక కాలనీలుగా నిర్ధారిత ప్రాంతంలో ఇళ్లను నిర్మించేవారు. యూనిట్ కాస్ట్ సరిపోవటం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో ఈ ప్రాజెక్టు పనులు పడకేశాయి. ప్రస్తుతం తాముంటున్న ఇల్లు ఒక చోట ఉండటం, కొత్తగా మంజూరై నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇల్లు మరోచోట ఉండటాన్ని లబ్ధిదారులు ఇష్టపడలేదు. ఈ అంశాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులనే సొంతంగా తమ స్థలంలో ఇళ్లను నిర్మించుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతోపాటుగా డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయింపులు చేసింది. 2020–21 ఆర్థిక ఏడాదికి గాను బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.11,917 కోట్లను ప్రతిపాదించింది. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేవారు వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్షమంది ఉంటారని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపుల్లో ప్రగతి పద్దుకు సంబంధించి పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు రూ.3,850 కోట్లు కేటాయించారు. మిగతా మొత్తం గ్రామ ప్రాంతాల్లో లబ్ధిదారులకు కేటాయించారు. ఇక ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.750 కోట్లు ఖర్చు చేయనున్నారు.




## పరిశోధన, అభివృద్ధికి శూన్యం!

**నిర్వహణ, ప్రగతి పద్దులో తగ్గిన కేటాయింపులు**

- యూనివర్సిటీలకు పెరిగిన బడ్జెట్
- సంప్రదాయ వర్సిటీలకు గతేడాది రూ.582.88 కోట్లు
- ఈసారి రూ.606.73 కోట్లు కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: ఎప్పటిలాగే యూనివర్సిటీల్లో పరిశోధన, అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో పెద్దగా నిధులను కేటాయించలేదు. ఇంటర్మీడియట్ విద్యను మినహాయిస్తే ఉన్నత, సాంకేతిక విద్యలో నిర్వహణ, ప్రగతి పద్దు కింద గతేడాది కంటే ఈసారి నిధులను ప్రభుత్వం తగ్గించింది. యూనివర్సిటీలకు నిర్వహణ పద్దులో గతేడాది కంటే ఈసారి నిధులను పెంచింది. అయితే పెరిగిన నిధులు యూనివర్సిటీల్లో యూజీసీ సవరించిన వేతనాల చెల్లింపునకే సరిపోనున్నాయి. సెంట్రల్ పీఆర్‌సీ సిఫారసు మేరకు యూజీసీ ప్రకటించిన వేతనాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ మేరకు ఆ వేతనాల చెల్లింపులకు అయ్యే అదనపు నిధులను మాత్రమే నిర్వహణ పద్దులో కేటాయించింది. ఈసారి ఉన్నత, సాంకేతిక విద్యకు మొత్తంగా రూ.1,723.28 కోట్లు కేటాయించగా, అందులో నిర్వహణ పద్దు కింద రూ.1,638.04 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.85.24 కోట్లు కేటాయించింది. అదే గతేడాది మొత్తంగా రూ.1,690.79 కోట్లు కేటాయించగా, అందులో నిర్వహణ పద్దు కింద రూ.1,632.85 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.57.94 కోట్లు కేటాయించింది. యూనివర్సిటీల్లో ఇంక్యుబేటర్ల ఏర్పాటు, పరిశోధనలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు మొత్తంగా రూ.2,500 కోట్ల వరకు బడ్జెట్ కావాలని అడిగినా రూ.1,723.27 కోట్లకే పరిమితం చేసింది. ఇక ఇంటర్మీడియట్ విద్యాశాఖకు నిర్వహణ పద్దులో గతేడాది కంటే రూ.30 కోట్ల వరకు కోత పెట్టగా, ప్రగతి పద్దులో రూ.28.53 కోట్లు అదనంగా ఇచ్చింది.

**సాంకేతిక విద్యలో భారీ కోత..**

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో క్రీడా పరికరాల సామగ్రి కొనుగోలు కోసం గతేడాది రూ.5.78 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.34.27 కోట్లు కేటాయించింది. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి గతేడాదిలాగే ఈసారి కూడా రూ.3 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ సెంటినరీ బిల్డింగ్ నిర్మాణం కింద రూ.3 కోట్లు, వివిధ పథకాల కింద రూ.3.22 కోట్లు ప్రగతి పద్దు కింద కేటాయించింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా కింద గతేడాదిలాగే నిధులను కేటాయించింది. గతేడాది రూ.14.95 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.15.04 కోట్లు కేటాయించింది. మరోవైపు సాంకేతిక విద్యలో నిర్వహణ పద్దులో భారీగా కోత పెట్టింది. గతేడాది రూ.320.29 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.265.08 కోట్లకే పరిమితం చేసింది. జేఎన్‌టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీల్లో సుల్తాన్‌పూర్ కాలేజీకి రూ.5.10 కోట్లు, మంథని కాలేజీకి రూ.63 లక్షలు, కరీంనగర్‌లో కొత్త ఇంజనీరింగ్ కాలేజీలకు రూ.5.59 కోట్లు కేటాయించింది. అయితే జగిత్యాల ఇంజనీరింగ్ కాలేజీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. పాలిటెక్నిక్ కాలేజీలకు గతేడాదితో పోల్చితే భారీగా బడ్జెట్‌ను తగ్గించింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.142.83 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.98.99 కోట్లు మాత్రమే కేటాయించింది.



















# సాగు నీరు.. రుణాల జోరు!

## సాగునీటి రంగానికి కేటాయింపులు రూ. 11,053.55 కోట్లు

- గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే రూ. 2,577.38 కోట్లు పెరిగిన కేటాయింపులు
- కేటాయింపుల్లో తొలిసారిగా పెరిగిన ప్రాజెక్టుల నిర్వహణ పద్దు
- ప్రధాన ప్రాజెక్టుల పూర్తికి రూ.20 వేల కోట్లు అప్పులతో సమీకరణ
- పెండింగ్‌లో ఉన్న సాగునీటి బకాయిలే రూ. 11,965 కోట్లు
- ప్రాజెక్టుల పూర్తికి రుణాలపైనే ఆధారపడాలి
- మేజర్, మీడియం ఇరిగేషన్‌కు రూ. 10,406.59 కోట్లు, మైనర్ ఇరిగేషన్‌కు రూ. 602.45 కోట్లు



**2019-20, 2020-21లలో ప్రాజెక్టులకు కేటాయింపులు (రూ. కోట్లలో)**

| ప్రాజెక్టు | 2019-20 | 2020-21 |
|---|---|---|
| కాళేశ్వరం | 1080.18 | 805.47 |
| పాలమూరు ఎత్తిపోతల | 500 | 368.58 |
| సీతారామ | 1324 | 910.62 |
| దేవాదుల | 529.12 | 292.38 |
| ఇందిరమ్మ వరద కాల్వ | 191.51 | 131.37 |
| ఎస్సారెస్పీ-2 | 135.40 | 94.81 |
| తుపాకులగూడెం | 235.71 | 73.83 |
| దిగువ పెనుగంగ | 84.18 | 72.08 |
| డిండి | 90.87 | 56.05 |
| ఎల్లంపల్లి | 38.11 | 28.06 |
| ప్రాణహిత | 17.31 | 12 |
| కల్వకుర్తి | 4 | 2.29 |
| నెట్టెంపాడు | 25 | 16.70 |
| భీమా | 25 | 3.69 |
| కోయిల్‌సాగర్ | 25 | 17.40 |
| జూరాల | 5 | 3.69 |
| ఎస్సారెస్పీ-1 | 8.10 | 25.52 |
| ఆర్డీఎస్ | 27.50 | 19.35 |
| ఘణపూర్ | 34 | 15 |
| కొమరంభీమ్ | 14.45 | 10.12 |
| లెండి | 1 | 0.68 |
| సింగూరు | 7 | 6.17 |
| ఎస్ఎల్‌బీసీ | 3 | 3.16 |
| నల్లవాగు | 5 | 3.43 |
| చౌటపల్లి హన్మంతరెడ్డి | 4.60 | 2.82 |
| జగన్నాథ్‌పూర్ | 14.12 | 9.92 |

సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కేటాయింపు ఆశించిన మాదిరి లేకున్నా ఉపశమనం కలిగించేలా ఉంది. 2020–21 వార్షిక బడ్జెట్‌లో సాగునీటి రంగానికి మొత్తంగా రూ. 11,053.55 కోట్లు కేటాయించగా అందులో నిర్వహణ పద్దు కింద రూ. 7,446.97 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ. 3,606.58 కోట్ల మేర కేటాయింపులు చేసింది. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులకన్నా రూ. 2,577.38 కోట్లు మేర కేటాయింపులు పెంచింది. గతంకన్నా భిన్నం గా ప్రాజెక్టుల పంపుల నిర్వహణ భారీగా ఉండనుండటంతో దానికింద నిర్వహణ పద్దు నిధులను పెంచారు. కాళేశ్వరం, సీతారామ, పాలమూరు–రంగారెడ్డి, దేవాదుల ప్రాజెక్టులకు అధిక కేటాయింపులు చేశారు. అయినప్పటికీ ఈ నిధులతో ప్రాజెక్టులు పూర్తికాకుంటే ఇప్పటికే ఏర్పాటు చేసిన వివిధ కార్పొరేషన్‌ల ద్వారా తీసుకొనే రుణాల ద్వారానే వాటిని పూర్తి చేయనున్నారు.

**అడిగింది కొండంత.. ఇచ్చింది కొంతే..**

ఆర్థిక మాంద్యం, కేంద్రం నుంచి తగ్గిన కేటాయింపుల నేపథ్యంలో గతేడాది సాగునీటికి కేవలం రూ. 8,476.17 కోట్లే కేటాయించారు. ఈ ఏడాది కూడా మాంద్యం పరిస్థితులున్నా గతేడాదికన్నా రూ. 2,577.38 కోట్ల మేర పెంచి మొత్తంగా రూ.11,053.55 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో కనీసం రూ. 21 వేల కోట్లు కేటాయించాలని

**ఆదుకునేది అప్పులే**

ప్రధాన ప్రాజెక్టుల కింద ఈ ఏడాది ఖరీఫ్, రబీ నాటికి భారీ ఆయకట్టు లక్ష్యాలున్నాయి కాళేశ్వరం ప్రాజెక్టుల ద్వారా రోజుకు 3 టీఎంసీల నీటితో 360 టీఎంసీలను ఎత్తిపోయాలని ప్రణాళిక వేశారు. దీంతో పాటే సీతారామ ఎత్తిపోతలను పూర్తి చేయాలనే లక్ష్యం కూడా ఉంది. ఈ ఏడాది డిసెంబర్‌కల్లా దేవాదులలో 100% పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలంటే రాష్ట్ర నిధులతో సాధ్యమయ్యే పరిస్థితి కనిపించట్లేదు. ప్రభుత్వం కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా రూ. 61,500 కోట్ల రుణ సేకరణ చేపట్టగా అందులో రూ. 38 వేల కోట్ల రుణాల ద్వారానే ఖర్చు జరిగింది. ఇక సీతారామ, దేవాదుల, తుపాకులగూడెం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ద్వారా రూ. 17 వేల కోట్ల రుణ సమీకరణ చేయగా అందులో రూ. 11 వేల కోట్లు ఖర్చు చేశారు. 2019–20 వార్షిక బడ్జెట్ నిధుల ద్వారా రూ. 8 వేల కోట్లు ఖర్చు జరగ్గా రుణాల ద్వారా చేసిన ఖర్చు రూ. 14 వేల కోట్లుగా ఉంది. ఈ ఏడాది సైతం రూ. 20 వేల కోట్ల రుణాల ద్వారా ఖర్చు చేసే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ ఆర్థిక శాఖకు ప్రతిపాదించింది. అందులో కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారానే రూ. 13 వేల నుంచి రూ. 15 వేల కోట్లు ఖర్చు జరిగే అవకాశం ఉండగా మిగతా ప్రాజెక్టులకు మరో రూ. 5 వేల కోట్ల నుంచి రూ. 7 వేల కోట్లు ఖర్చు చేసే అవకాశం ఉంది.

ఆర్థికశాఖకు సాగునీటిశాఖ ప్రతిపాదనలు పంపింది. ఇందులో కాళేశ్వరానికి రాష్ట్ర బడ్జెట్‌కింద రూ. 7 వేల కోట్లు కోరింది. కానీ ఈ బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించింది రూ. 805.47 కోట్లు మాత్రమే కేటాయించింది. పాలమూరు కు రూ. 3,500 కోట్లు, దేవాదులకు రూ. 500 కోట్లు, తుపాకులగూడేనికి రూ. 500 కోట్లు కేటాయించాలన్న సాగునీటిశాఖ విజ్ఞప్తిని సర్కారు పెద్దగా పట్టించుకోలేదు. పాలమూరుకు రూ. 368.58 కోట్లు, దేవాదులకు రూ. 292.38 కోట్లు, తుపాకులగూడేనికి రూ.73.83 కోట్లు మాత్రమే కేటాయించింది. పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, భీమా,నెట్టెంపాడు,కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల పూర్తికి రూ. 1,200 కోట్లతో ప్రతిపాదనలు పంపినా కేటాయింపులు రూ. 50 కోట్లకే పరిమితమయ్యాయి.

**బకాయిలూ భారీగానే...**

సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఈ ఏడాది భారీగానే పెండింగ్ బకాయిలున్నాయి. రూ. 11,965.23 కోట్ల బకాయిలు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇందులో ప్రధాన పనులకు సంబంధిం చి బకాయిలు రూ. 5,550 కోట్లు ఉండగా రుణాల కోసం కార్పొరేషన్‌లకు మార్జిన్ మనీ కింద ఇవ్వాల్సినవి రూ. 1,695 కోట్లు, భూసేకరణ బకాయిలు రూ. 1,585 కోట్లు, విద్యుత్ బకాయిలు రూ. 3,072 కోట్ల మేర ఉన్నాయి. పాలమూరు పరిధిలో రూ. వెయ్యి కోట్లు, కాళేశ్వరం పరిధిలో రూ. 1,500 కోట్లు, ఎల్లంపల్లిలో రూ. 350 కోట్ల మేర ఉన్నాయి. ఇక ఈ ఏడాది మైనర్ ఇరిగేషన్‌కు కేటాయింపులు తగ్గాయి. గతేడాదితో పోలిస్తే రూ. 42 కోట్లు తగ్గించి రూ. 602.45 కోట్లకు పరిమితం చేశారు. ఇందులో చెరువుల పునరుద్ధరణకు ఉద్దేశించిన మిషన్ కాకతీయకు రూ. 402 కోట్లు కేటాయించారు. అయితే దీని బకాయిలే రూ. 550 కోట్ల మేర ఉన్నాయి.

**సాగునీటి రంగానికి గతేడాది, ఈ ఏడాది కేటాయింపులు ఇలా.. (రూ. కోట్లలో)**

| విభాగం | గత ఏడాది | ఈ ఏడాది |
|---|---|---|
| మేజర్ ఇరిగేషన్ | 7,794.30 | 10,406.59 |
| మైనర్ ఇరిగేషన్ | 642.36 | 602.45 |
| ఆయకట్టు ప్రాంత అభివృద్ధి | 29.06 | 23.87 |
| వరద నిర్వహణ | 10.45 | 10.45 |

**ప్రాజెక్టులకు ఇప్పటికే తీసుకున్న రుణాలు, ఖర్చు ఇలా.. (రూ. కోట్లలో)**

| ప్రాజెక్టు | తీసుకున్న రుణం | ఖర్చు | మిగిలింది |
|---|---|---|---|
| కాళేశ్వరం | 55,464 | 33,629.08 | 21,834.92 |
| పాలమూరు-రంగారెడ్డి | 6,160.46 | 582.84 | 5,577.62 |
| సీతారామ,దేవాదుల | 17,000 | 11,700 | 5,300 |
| మొత్తం | 78,624.46 | 45,911.92 | 32,712.54 |

## విద్యుత్ రాయితీ పెంపు

సాక్షి, హైదరాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు విద్యుత్ రాయితీ కేటాయింపులను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. బడ్జెట్ 2019–20లో రూ.5,984 కోట్ల వ్యవసాయ విద్యుత్ రాయితీలను కేటాయించగా,ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ 2020–21లో రూ.7,547 కోట్లకు పెంచింది. స్పిన్నింగ్ మిల్లులకు సహాయంగా అందించే రూ.95 కోట్ల విద్యుత్ సబ్సిడీలను యథాతథంగా కొనసాగించింది. ఈ రెండు సబ్సిడీలు కలిపి ప్రగతిపద్దు కింద ఇంధన శాఖకు రూ.7,642 కోట్లు కేటాయించింది. నిర్వహణ పద్దు కింద మరో రూ.320.88



కోట్లు కలిపి ఇంధన శాఖకు బడ్జెట్‌లో మొత్తం రూ.7,962.88 కోట్ల నిధులు కేటాయించింది. ఇంధన శాఖకు రూ.10,416 కోట్లు కేటాయించినట్టు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన కాళేశ్వరం, సీతారామ వంటి భారీ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులతో పాటు ఎస్సీ,ఎస్టీలకు అందించే విద్యుత్ బిల్లుల రాయితీలు కలుపుకుంటే ఇంధన శాఖకు కేటాయింపులు రూ.10, 416 కోట్లకు పెరుగుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**చార్జీల పెంపు తప్పదు**

ఈ బడ్జెట్‌లో రూ.10 వేలకోట్ల వ్యవసాయ విద్యుత్ రాయితీలు కేటాయించాలని డిస్కంలు కోరగా, ప్రభుత్వం రూ. 7,547 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో వచ్చే ఆర్థిక ఏడాదిలో చార్జీల పెంపు తప్పదని తెలుస్తోంది.

## మైనార్టీ సంక్షేమానికి తగ్గిన నిధులు

సాక్షి, హైదరాబాద్: మైనార్టీ సంక్షేమ శాఖకు తాజా బడ్జెట్‌లో కేటా యింపులు తగ్గాయి. 2020- 21 వార్షిక సంవత్సరంలో ఈ శాఖకు రూ. 1,138.45 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అయితే 2019–20 సంవత్సరంలో రూ. 1,346.95 కోట్లు కేటాయించగా... తాజా బడ్జెట్‌లో రూ. 208 కోట్ల మేర కేటాయింపులు తగ్గాయి. గత కేటాయింపులు భారీగా జరపడంతో పెండింగ్ పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. దీంతో 2020–21 వార్షిక సంవ



త్సరంలో ప్రాధాన్యతలకు తగినట్లు నిధులు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు.

**కార్మిక సంక్షేమానికి రూ.107.78 కోట్లు**

కార్మిక సంక్షేమం, ఉపాధి కల్పన శాఖలకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.107.78 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 60. 35 కోట్లు కేటాయించగా... తాజా బడ్జెట్‌లో అదనంగా రూ.47 కోట్లు కేటాయించడం గమనార్హం.

**మహిళా, శిశు సంక్షేమానికి కాస్త మెరుగ్గా**

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమానికి నిధుల కేటాయింపులు కాస్త మెరుగుపడ్డాయి. గత బడ్జెట్లో ప్రగతి పద్దు కింద మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు రూ.663.80 కోట్లు కేటాయించగా, 2020–21 వార్షిక బడ్జెట్లో రూ.676.11 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే దాదాపు 13 కోట్లు అధికంగా కేటాయించారు.

## సంక్షేమ గురుకులాలకు రూ.2,073.91 కోట్లు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న గురుకుల విద్యా సంస్థల సొసైటీలకు ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ.2,073.91 కోట్లు కేటాయించింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీకి (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) రూ.878.15 కోట్లు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా



సంస్థల సొసైటీకి (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) రూ.739.61 కోట్లు, తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీకి రూ.212.98 కోట్లు, మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీకి (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) రూ.243.17 కోట్లు కేటాయించింది.

## డబుల్ రోడ్లకు బ్యాంకు రుణాలే దిక్కు

మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నిర్మించే డబుల్ రోడ్లకు ఈసారి బ్యాంకు రుణాలే ఆధారం కానున్నాయి. ఈ రోడ్లకు ప్రణాళికలు రూపొందించిన కొత్తలో విరివిగా నిధులు అందగా, గత రెండు మూడేళ్లుగా చాలినన్ని విడుదల కావడం లేదు. ఈసారి కూడా బడ్జెట్ కేటాయింపులు దాదాపు అలాగే ఉన్నాయి. డబుల్ రోడ్లకు తాజా బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించగా.. అందులో ప్రగతి పద్దు కింద రూ.655 కోట్లు చూపారు. గత బడ్జెట్‌లో దీనికి కేవలం రూ.187 కోట్లు కేటాయించారు. అంతకు ముందు బడ్జెట్‌లో అది రూ.460 కోట్లుగా చూపారు. 2017–18లో రూ.2,500 కోట్లు



వచ్చాయి. ఆ సంవత్సరం పనులు ఊపుగా జరిగాయి. ఆ తర్వాత నుంచి నిధులు తక్కువగా రావడంతో కాంట్రాక్టర్లకు భారీ మొత్తంలో బిల్లులు పేరుకుపోయాయి. ఇటీవల బ్యాంకు లోన్ ద్వారా ఆ బకాయిలు తీర్చారు. ఇప్పుడు కూడా చాలినన్ని నిధులు వచ్చే అవకాశం లేనందున మళ్లీ బ్యాంకు రుణంపై ఆధారపడాల్సి ఉంది. రాష్ట్రంలో 65% పనులు పూర్తయ్యాయి. మరో 35% పనులు చేపట్టాల్సి ఉంది.

**తెలంగాణ కళాభారతికి రూ.50 కోట్లు..**

జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనాలు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, నగరంలో పోలీసు కమాండ్ కంట్రోల్ భవనం తదితరాల కోసం రూ.550 కోట్లు కేటాయించారు. తెలంగాణ కళాభారతికి రూ.50 కోట్లు కేటాయించారు. గజ్వేల్ ప్రాంత అభివృద్ధి అథారిటీకి ఈసారి నిధులు కేటాయించలేదు.

## బియ్యం సబ్సిడీకి రూ.2,362 కోట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా పంపి ణీ వ్యవస్థ కింద సరఫరా చేసే సబ్సిడీ బియ్యం కోసం బడ్జెట్‌లో రూ.2,362 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రూపాయికే కిలో బియ్యం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద మొత్తంగా 2.80 లక్షల మంది లబ్ధిదారులకు సబ్సిడీ బియ్యం సరఫరాకు వీలుగా ఈ నిధుల కేటాయింపు జరిగింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.7 కోట్లు అదనంగా కేటాయించారు.

# ల్యాండ్ ఫర్ సేల్!

- మళ్లీ తెరపైకి డక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్
- భూముల అమ్మకం ద్వారా ఆదాయం పెంచుకునే యోచన
- అందుకే రూ.18 వేల కోట్లకు పైగా పన్నేతర ఆదాయం పెంపు

సాక్షి, హైదరాబాద్: 'దిల్'మళ్లీ తెరపైకి వచ్చింది. భూముల అమ్మకమే లక్ష్యంగా ఏర్పడ్డ డక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనే ఈ సంస్థకు ఊపిరిలూదాలని ప్రభుత్వం నిర్ణయించింది. దిల్ పేరిట గతంలో భూ విక్రయాలు/లీజులు చేపట్టిన ఈ సంస్థను మనుగడలోకి తెచ్చే దిశగా అడుగులు వేస్తోంది. దిల్ అంశాన్ని బడ్జెట్ అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రస్తావించారు కూడా. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ప్రభుత్వ ఖజానా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ప్రధాన ఆదాయార్జన శాఖలు చతికిలపడటంతో భూముల అమ్మకాలతో పన్నేతర ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. రియల్టీ రంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటుండటం, కోవిడ్–19తో ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లకు గురవుతున్న తరుణంలో దీని ప్రభావం జీఎస్టీ వసూళ్లపై ఉంటుందని అనుమానిస్తోంది. పదేళ్ల క్రితం ప్రభుత్వ భూముల సేకరణ అమ్మకం/లీజుల్లో క్రియాశీలకంగా పనిచేసిన 'దిల్'సంస్థకు జవసత్వా లు తీసుకురావాలని నిర్ణయించింది. తద్వారా 2019–20 సవరించిన అంచనాల్లో రూ.12,275 కోట్లు మాత్రమే ఉన్న పన్నేతర ఆదాయాన్ని 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ. 30,600 కోట్లకు పెంచింది.

**2,084 ఎకరాలపైనే ఆశ..**

హైదరాబాద్ రాజధాని చుట్టూ 2,084 ఎకరాలను దిల్ సంస్థకు గతంలో ప్రభుత్వం



కట్టబెట్టింది. ఈ భూములను వినియోగించుకోవడంలో ఆ సంస్థ చేతులెత్తేసింది. దీంతో ఇందులో 400 ఎకరాలను రెవెన్యూ శాఖ వెనక్కి తీసుకోగా.. సుమారు 1,584 ఎకరాలు ఆ సంస్థ అధీనంలోనే ఉన్నాయి. ఈ క్రమంలో నిరుపయోగంగా ఉన్న విలువైన భూములను విక్రయించడం ద్వారా ఖజానాను పరిపుష్టం చేసుకోవాలని యోచిస్తోంది. బాచుపల్లిలో 100, గాజుల రామారం 40.33, కుర్మల్‌గూడ 23.29, కోహెడ 239, అబ్దుల్లాపూర్‌మెట్ 161, అజీజ్‌నగర్ 126.29, కొత్వాల్‌గూడ 265, కొంగరకుర్దు 100, ధర్మారం 65.05, జవహర్‌నగర్ 60.25, తొలుకట్ట 16.26 ఎకరాలే కాకుండా చాలాచోట్ల దిల్ సంస్థకు భూములు ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసి వేలం వేస్తే పన్నేతర ఆదాయంగా ప్రతిపాదించిన రూ.30,600 కోట్లను సమీకరించడం పెద్దగా కష్టంకాబోదని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందుకే ఈసారి పన్నేతర ఆదాయాన్ని రూ.18వేల కోట్లకు పైగా పెంచి అంచనాలను ప్రతిపాదించింది.

**బుద్వేల్ భూములు కూడా...**

ఇదిలావుండగా, నిధుల సమీకరణలో భాగంగా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్, శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో కొన్ని భూములున్నాయి. ఐటీ హబ్ కోసం ప్రతిపాదించిన బుద్వేల్‌లోని టూరిజం, హెచ్ఎండీఏ భూమిలో 50 ఎకరాలను విక్రయించడం ద్వారా ఖజానాకు కాసుల పంట పండుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, ఖానామెట్ సర్వే నం.41/14లోని 27.04 ఎకరాలను కూడా వేలం వేసేందుకు టీఎస్ఐఐసీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ ఎకరా రూ.40–45 కోట్ల వరకు పలుకుతోంది.

## ఆర్టీసీకి రూ.వెయ్యి కోట్లు

**అధికారులు అడిగింది రూ.3 వేల కోట్లు**

సాక్షి, హైదరాబాద్: టీఎస్ఆర్టీసీ చరిత్రలో అతిపెద్ద సమ్మె కాలాన్ని ఇటీవలే చవిచూసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆర్టీసీ పరిరక్షణ, బలోపేతం కోసం భారీ కార్యాచరణ ప్రకటించటంతో బడ్జెట్ కేటాయింపులపై భారీ ఆశలే నెలకొన్నాయి. బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తానని సీఎం చెప్పడంతో ఈసారి భారీ నిధులే వస్తాయని అధికారులు అంచనా వేశారు. అన్నీ కలుపుకొని రూ.వెయ్యి కోట్లు మాత్రమే ప్రకటించడంతో మరో ఏడాది నిరీక్షిం చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏటా ఇచ్చే బడ్జెట్ నిధులకు అదనంగా, సీఎం ప్రకటించిన రూ.వెయ్యి కోట్లు వస్తాయని అధికారులు అంచనా



వేశారు. తాజా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు ప్రస్తావించడంతో, సీఎం చెప్పింది ఈ నిధులేనని సరిపుచ్చుకుంటున్నట్లు ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. టీఎస్ఆర్టీసీకి రుణాల పద్దు కింద రూ.400 కోట్లు, వివిధ కేటగిరీ వ్యక్తులకు కేటాయించిన బస్సు పాస్‌లకు సంబంధించిన రాయితీల మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.600 కోట్లు చూపారు. వెరసి రూ. వెయ్యి కోట్లు బడ్జెట్‌లో కేటాయించినట్లు అయింది. రూ.3 వేల కోట్లు ఇవ్వాలని అధికారులు కోరారు. సమ్మె కాలానికి సంబంధించి ఉద్యోగులకు జీతం ఇవ్వనున్నట్లు సీఎంకేసీఆర్ ప్రకటించగా.. తాజా బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేకపోవడంతో ఇప్పుడు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

## ప్రాజెక్టుల నిర్వహణకు పెద్దపీట

- బడ్జెట్‌లో తొలిసారి నిర్వహణ పద్దు కింద రూ. 7,446.97 కోట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ప్రధా న ఎత్తిపోతల పథకాలన్నీ నిర్వహణలోకి వస్తున్నందున వాటి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు వీలుగా ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపులు చేసింది. తొలిసారిగా సాగునీటి శాఖకు నిర్వహణ పద్దు కింద రూ. 7,446.97 కోట్లు కేటాయించింది. ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చూడాలని, దీనికి ప్రత్యేక బడ్జెట్ ఉండాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే నిర్ణయించిన నేపథ్యంలో ఆ మేరకు ప్రగతి పద్దుకు మించి నిర్వహణకు నిధుల కేటాయింపు భారీగా జరిగినట్లు నీటిపారుదల వర్గాలు చెబుతున్నాయి. ఇక ఎత్తిపోతల పథకాలకు ఈ ఏడాది నుంచి విద్యుత్ వినియోగం పెరగనుంది. దానికనుగుణంగా విద్యుత్ చార్జీలు తడిసి మోపెడు కానున్నాయి. ఇప్పటివరకు 1,400 మెగావాట్ల మేర విద్యుత్ అవసరాలు ఉండగా ఈ ఏడాది జూన్ నుంచి 7 వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉందని లెక్కగట్టారు. వాటికి రూ. 7,000–8,000 కోట్ల వరకు బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుంది. మొత్తంగా కృష్ణా, గోదావరి బేసిన్‌ల పరిధిలో 700 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా ప్రణాళిక ఉంది. ఇందులో కాళేశ్వరం ద్వారానే 360 టీఎంసీలు ఎత్తిపోయనుండగా దానికి 6 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం కానుంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరానికి నిర్వహణ పద్దు కింద ఏకంగా రూ. 5,219 కోట్లు కేటాయించారు. పాలమూరు-రంగారెడ్డి నిర్వహణకు రూ.18.40 కోట్లు, సీతారామ ఎత్తిపోతలకు రూ. 21.04 కోట్లు, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా పథకాలకు మరో రూ. 62.93 కోట్లను నిర్వహణ పద్దు కింద కేటాయించారు.

నల్లగొండ | సోమవారం | మార్చి | 9 | 2020 | www.sakshi.com సాక్షి

విభాగం: రెవెన్యూ

అంకెలు: రూ.కోట్లలో




షెడ్యూల్ కులాల అభివృద్ధి







మాధ్యమిక విద్య, సెక్రటేరియట్ విభాగం




రవాణా, రోడ్లు, భవనాలు




గిరిజన సంక్షేమం




# 1

## రంగారెడ్డి జిల్లా టాప్

తలసరి ఆదాయం, జిల్లా స్థూల దేశీయోత్పత్తి(జీడీడీపీ)లో రంగారెడ్డి జిల్లా టాప్‌లో నిలిచింది. 2018-19లో రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.5,78,978, జీడీడీపీ రూ.173143 సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో హైదరాబాద్. 2018-19కి సంబంధించి జిల్లాల వారీగా తలసరి ఆదాయం, జీడీడీపీ గణాంకాలను ఈ కింది పట్టికలో చూడొచ్చు.

### రాష్ట్ర సరాసరి తలసరి ఆదాయం

## 2,04,488

| జిల్లా | తలసరి ఆదాయం (రూపాయల్లో) |
|---|---|
| రంగారెడ్డి | 5,78,978 |
| హైదరాబాద్ | 3,57,287 |
| మేడ్చల్-మల్కాజ్‌గిరి | 2,21,025 |
| మహబూబ్‌నగర్ | 1,94,229 |
| మెదక్ | 1,85,351 |
| యాదాద్రి భువనగిరి | 1,74,876 |
| సంగారెడ్డి | 1,72,020 |
| సిద్దిపేట | 1,70,992 |
| ములుగు | 1,69,211 |
| కరీంనగర్ | 1,65,898 |
| పెద్దపల్లి | 1,62,887 |
| భద్రాద్రి కొత్తగూడెం | 1,58,066 |
| ఆదిలాబాద్ | 1,56,940 |
| నిర్మల్ | 1,50,134 |
| నల్లగొండ | 1,46,774 |
| కుమ్రంభీం | 1,44,930 |
| జయశంకర్ | 1,44,266 |
| వికారాబాద్ | 1,43,994 |
| ఖమ్మం | 1,43,362 |
| సూర్యాపేట | 1,37,005 |
| మహబూబాబాద్ | 1,34,935 |
| జోగులాంబ గద్వాల | 1,33,755 |
| నిజామాబాద్ | 1,32,030 |
| వరంగల్ రూరల్ | 1,31,652 |
| జనగామ | 1,30,141 |
| మంచిర్యాల | 1,27,703 |
| వరంగల్ అర్బన్ | 1,24,601 |
| రాజన్న సిరిసిల్లా | 1,24,252 |
| కామారెడ్డి | 1,22,404 |
| వనపర్తి | 1,17,614 |
| నాగర్‌కర్నూల్ | 1,17,614 |
| జగిత్యాల | 1,11,717 |
| నారాయణపేట | 98,220 |



## మనమే బెస్ట్

ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలకు సూచికైన తలసరి ఆదాయంలో తెలంగాణ దూసుకుపోతోంది. 2018-19లో రూ. 204488 ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం 2019-20లో 11.6 వృద్ధి రేటుతో రూ.2,28,216కు పెరిగింది. ఈ వ్యవధిలోనే జాతీయ తలసరి ఆదాయం 6.3శాతం వృద్ధి రేటుతో రూ.134432గా నమోదైంది.

**గత 10 ఏళ్లకు సంబంధించి జాతీయ, రాష్ట్ర తలసారి ఆదాయం (రూపాయల్లో)**

| సంవత్సరం | జాతీయ | రాష్ట్రం |
|---|---|---|
| 2011-12 | 63,462 | 91,121 |
| 2012-13 | 70,983 | 1,01,007 |
| 2013-14 | 79,118 | 1,12,162 |
| 2014-15 | 86,647 | 1,24,104 |
| 2015-16 | 94,797 | 1,40,840 |
| 2016-17 | 1,04,880 | 1,59,395 |
| 2017-18 | 1,15,293 | 1,80,494 |
| 2018-19 | 1,26,521 | 2,04,488 |
| 2019-20 | 1,34,432 | 2,28,216 |

## మాంద్యాన్ని అధిగమించి..

# జాతీయ సగటు మించి...

**ప్రపంచ, జాతీయ స్థాయిలో వృద్ధి రేటుకు మాంద్యం చేటు**

**మన వృద్ధి రేటు ఇంకా సుస్థిరమే**

రాష్ట్ర వృద్ధి రేటు అంచనాలు 2019-20లో **8.2 %**

జాతీయ వృద్ధిరేటు **5** శాతమే..

ప్రపంచ వృద్ధిరేటు **2.4** శాతమే

సాక్షి, హైదరాబాద్

తీవ్ర ఆర్థిక మాంద్యంతో ప్రపంచ, జాతీయ వృద్ధి రేటు భారీగా పతనమైన ప్రస్తుత తరుణంలో రాష్ట్ర వృద్ధి రేటు చెక్కు చెదరకుండా దృఢంగా నిలబడింది. 2019లో ప్రపంచ వృద్ధిరేటు 2.4 శాతానికి పతనమైందని, ఆర్థిక సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇదే అత్యల్పమని ప్రపంచబ్యాంకు విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక అవకాశాల నివేదిక పేర్కొంటోంది. 2019-20లో జాతీయ వృద్ధిరేటు సైతం 5 శాతానికి పడిపోనుందని అంచనాలున్నాయి. ఇదే సమయంలో రాష్ట్ర వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదు కానుందని అంచనా. అయితే, గత కొన్నేళ్లుగా రాష్ట్రం సాధించిన వృద్ధి రేటు గణాంకాలతో పోలిస్తే ఈసారి కొంతమేర తగ్గుదల కనిపిస్తోంది. అయినా జాతీయ వృద్ధిరేటు సగటును మించిన వృద్ధి రేటును రాష్ట్రం సాధించనుంది. ఇలా అధిగమించడం 2015-16 నుంచి ఇది వరుసగా ఐదోసారి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ఈ విషయాలను స్పష్టం చేస్తోంది. 2018-19లో ప్రస్తుత ధరల వద్ద స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) విలువ రూ.8.61 లక్షల కోట్లతో 14.3 శాతం వృద్ధిరేటును నమోదు చేయగా, 2019-20 నాటికి రూ.9.7 లక్షల కోట్లకు పెరిగి 12.6 శాతం వృద్ధి రేటు నమోదు చేయబోతోంది. 2018-19లో స్థిర ధరల వద్ద 6.13 లక్షల కోట్లున్న జీఎస్డీపీ 2019-20లో 8.2 శాతం వృద్ధి రేటుతో రూ.6.63 లక్షల కోట్లకు పెరగనుందని అంచనా.

**చర్యలు సఫలీకృతం..**

వ్యవసాయం, పశుపోషణ, విద్యుత్, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు రాష్ట్రం శరవేగంగా ఆర్థికాభివృద్ధి సాధించడానికి దోహదపడ్డాయి. జాతీయ సగటుకు మించిన వృద్ధి రేటును రాష్ట్రం నిలబెట్టుకోవడానికి ఇవే ప్రధాన కారణాలని ప్రభుత్వం విశ్లేషిస్తోంది.

### ప్రథమ, తృతీయ రంగాల హవా..

రంగాల వారీగా పరిశీలిస్తే.. 15.8 శాతం వృద్ధి రేటుతో ప్రాథమిక, 14.1 శాతం వృద్ధి రేటుతో తృతీయ రంగాలు వృద్ధి పథంలో దూసుకుపోతూ రాష్ట్ర వృద్ధి రేటు పెంపుదలకు దోహదపడుతున్నాయి. ద్వితీయ రంగం 5.3 శాతం వృద్ధి రేటును సాధించింది. ప్రాథమిక రంగం పరిధిలోని వ్యవసాయం, పశు, అటవీ, మత్స్య పరిశ్రమలు, మైనింగ్, క్వారీయింగ్, ద్వితీయ రంగం పరిధిలో తయారీ, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర పౌరసేవలు, నిర్మాణ రంగ పరిశ్రమలు, తృతీయ రంగం పరిధిలో వాణిజ్య, రిపేర్ సేవలు, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, స్టోరేజీ, ప్రసార సేవలు, ఆర్థిక సేవలు, స్థిరాస్తి, నివాస గృహాల యాజమాన్య హక్కులు, వృత్తి సేవలు, ప్రజాపరిపాలన, ఇతర సేవలు వస్తాయి. మొత్తానికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి 65.2 శాతం చేయూత (గ్రాస్ వాల్యూ యాడెడ్/ జీవీఏ) తృతీయ రంగమే అందిస్తోంది. జాతీయ సగటు కన్నా అధిక తలసరి ఆదాయాన్ని రాష్ట్రం నిలబెట్టుకుంది. ప్రస్తుత ధరల వద్ద జాతీయ తలసరి ఆదాయం సగటు వృద్ధి రేటు 6.3 శాతం కాగా, రాష్ట్రం 11.6 శాతాన్ని సాధించింది. చివరగా, జాతీయ స్థాయిలో 8.08 ద్రవ్యోల్బణం నమోదు కాగా, రాష్ట్రంలో సైతం 7.46 నమోదైంది. పారిశ్రామిక కార్మికుల కోసం రూపొందించిన వినియోగదారుడి ధరల సూచిక (కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్) ప్రకారం ద్రవ్యోల్బణాన్ని గణిస్తారు.



**జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రం సాధించిన వృద్ధిరేటు గణాంకాలను ఈ కింది పట్టికలో చూడొచ్చు**

| సంవత్సరం | ప్రస్తుత ధరలు (రూ.కోట్లలో) | | | | | స్థిర ధరలు (రూ.కోట్లలో) | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | తెలంగాణ | | జాతీయ | | | తెలంగాణ | | జాతీయ | | |
| | జీఎస్డీపీ | వృద్ధి రేటు% | జీడీపీ | వృద్ధి రేటు% | రాష్ట్రం వాటా% | జీఎస్డీపీ | వృద్ధి రేటు% | జీడీపీ | వృద్ధి రేటు% | రాష్ట్రం వాటా% |
| 2011-12 | 3,59,434 | – | 87,36,329 | – | 4.11 | 3,59,434 | – | 87,36,329 | – | 4.11 |
| 2012-13 | 4,01,594 | 11.7 | 99,44,013 | 13.8 | 4.04 | 3,70,113 | 3.0 | 92,13,017 | 5.5 | 4.02 |
| 2013-14 | 4,51,580 | 12.4 | 1,12,33,522 | 13.0 | 4.02 | 3,89,957 | 5.4 | 98,01,370 | 6.4 | 3.98 |
| 2014-15 | 5,05,849 | 12.0 | 1,24,67,959 | 11.0 | 4.06 | 4,16,332 | 6.8 | 1,05,27,674 | 7.4 | 3.94 |
| 2015-16 | 5,77,902 | 14.2 | 1,37,71,874 | 10.5 | 4.20 | 4,64,542 | 11.6 | 1,13,69,493 | 8.0 | 4.09 |
| 2016-17 | 6,58,325 | 13.9 | 1,53,91,669 | 11.8 | 4.28 | 5,07,946 | 9.3 | 1,23,08,193 | 8.3 | 4.13 |
| 2017-18 | 7,53,127 | 14.2 | 1,70,98,304 | 11.1 | 4.40 | 5,59,492 | 10.1 | 1,31,75,160 | 7.0 | 4.25 |
| 2018-19 | 8,61,031 | 14.3 | 1,89,71,237 | 11.0 | 4.54 | 6,12,828 | 9.5 | 1,39,81,426 | 6.1 | 4.38 |
| 2019-20 | 9,69,604 | 12.6 | 2,03,84,759 | 7.50 | 4.76 | 6,63,258 | 8.2 | 1,46,83,835 | 5.0 | 4.25 |



## 32 అర్బన్ ఫారెస్ట్‌ల అభివృద్ధి

తెలంగాణకు హరితహారంలో భాగంగా 2019లో మొత్తం 38.18 కోట్ల మొక్కలు నాటగా, వాటిలో 31.79 కోట్ల మేర జియో ట్యాగింగ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్బన్ ఫారెస్ట్రీ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, చుట్టుపక్కల జిల్లాలు, ఇతర జిల్లాల్లో కలిపి 32 అర్బన్ ఫారెస్ట్ పార్కులు పూర్తి చేశారు. మరో 46 ప్రాంతాల్లో ఈ పార్కుల ఏర్పాటుకు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

తెలంగాణలోని వివిధ అడవుల పరిధిలోని జీవవైవిధ్యం కాపాడేందుకు 12 రక్షిత ప్రాంతాల పరిధిలోని 9 వన్యప్రాణి అభయారణ్యాలను, 3 జాతీయపార్కులను (జాతీయపార్కుల వరకు 5,692.48 చదరపు కి.మీ) నెట్‌వర్క్‌ను ప్రకటించింది. తెలంగాణలో 2,939 చెట్ల రకాలు, 365 పక్షుల జాతులు, 103 క్షీరదాలు, 28 రకాల సరీసృపాలున్నాయి. రాష్ట్రంలోని అటవీ విస్తీర్ణం 26,969.48 లక్షల చ.కి.మీ.గా విస్తరించి ఉంది. మొత్తం అటవీ విస్తీర్ణంలో మూడో వంతు జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోఉండగా, నాలుగు జిల్లాల్లో అంటే ఈ రెండు జిల్లాలతో సహా నాగర్‌కర్నూల్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో కలిపి 50 శాతం అటవీ ప్రాంతముంది. మొత్తం కలిపి రాష్ట్రంలోని అటవీప్రాంతమున్న 24 శాతం అటవీ శాఖ నిర్వహణ పరిధిలో ఉన్నా దాదాపు 15 శాతంలో మాత్రమే గణనీయమైన పచ్చదనం, అడవులున్నాయి. 2020-21 సంవత్సరానికి సంబంధించి హరితహారంలో 68 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. 1994 నుంచే అటవీ శాఖ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ల సాంకేతికను వినియోగిస్తోంది. రిమోట్ సెన్సింట్ శాటిలైట్ ఇమేజరీ సాంకేతికను ఉపయోగించి అటవీ ప్రాంతాలను పర్యవేక్షిస్తోంది. ఎకో టూరిజంలో భాగంగా బొగతా, కుంతాల, పొథెరా, మల్లెల తీర్థం జలపాతాలు, అనంతగిరి హిల్స్, మంజీరా వన్యప్రాణి అభయారణ్యం, లక్నవరం చెరువు, మల్లారం ఫారెస్ట్, పాకాల చెరువు, టైగర్‌ఫారెస్ట్‌లను అభివృద్ధి చేస్తోంది.

## 1.6 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆహార పంటలు ఆశించిన మేర ఉత్పత్తి అవుతున్నాయి. 2018-19 ఖరీఫ్, రబీ సీజన్లలో 1.6 కోట్ల టన్నుల ఆహార పంటల ఉత్పత్తి వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ఆర్థిక సర్వే-2020 నివేదిక వెల్లడించింది. ఇక 2019-20 రెండో ముందస్తు అంచనాలతో అమాంతం పెరిగింది. ఇందులో ఒక వరినే 98.74 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. దీనిప్రకారం 2018 ఖరీఫ్, రబీ సీజన్లలో వరి 66.69 లక్షల టన్నుల్లో ఉత్పత్తి వచ్చింది. అలాగే మొక్కజొన్న 20.83 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చింది. రాష్ట్రంలో ఆహారేతర పంటల సాగు పెరిగింది. 2016-17కు వచ్చే సరికి 33.6 శాతం ఉండగా 2017-18లో 38.7 శాతానికి పెరిగింది. 2018-19లో 38.8 శాతానికి చేరింది. ఇక పంట రుణాలు 2016-17 సంవత్సరంలో రూ. 26,282 కోట్లు ఇచ్చారు. 2018-19లో రూ.31,410 కోట్లు పంపిణీ చేశారు. 2018-19లో రూ.42,494 కోట్లకు రూ.33,751 కోట్లు బ్యాంకులు ఇచ్చాయి.



**2020 సామాజిక ఆర్థిక సర్వే**

- 2018-19 ఖరీఫ్, రబీ సీజన్‌లో వచ్చిన దిగుబడులు
- 6.6 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్యం

### 6.6 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్యం..

తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి 2019-20 ఫిబ్రవరి వరకు 6.6 లక్షల ఎకరాల్లో సూక్ష్మసేద్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోంది. ఈ ఆరేళ్ల కాలంలో 2.48 లక్షల మంది రైతులు డ్రిప్ సౌకర్యం పొందినట్లు ఈ నివేదిక పేర్కొంది. డ్రిప్ ద్వారా నీటితో పాటు అనేక విషయాల్లో రైతులకు ఆదాయం మిగిలిందని, నాబ్కాన్స్ సర్వే కూడా వెల్లడించింది. సూక్ష్మసేద్యం అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం నాబార్డు నుంచి రుణం తీసుకుంది. ఉద్యాన శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఇచ్చారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 4.65 లక్షల ఎకరాల్లో డ్రిప్ ఇవ్వగా, 1.89 లక్షల ఎకరాల్లో స్ప్రింక్లర్లు ఇచ్చారు. 2016-17, 2017-18 సంవత్సరాల్లో ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఈ 2 సంవత్సరాల్లో వరుసగా 55,121, 83,458 మంది రైతులకు సూక్ష్మసేద్యం అందింది. ఇక 2018-19లో 37,596 మంది రైతులకు, 2019-20లో ఇప్పటివరకు 1,745 మంది రైతులకు డ్రిప్ అందింది. ఇలా రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 56 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇందులో 2.48 లక్షల మందికి మాత్రమే సూక్ష్మసేద్యం అందింది. మరింత మంది రైతులకు లబ్ధి చేకూర్చేందుకు దీంతో ఈసారి బడ్జెట్ అంచనాల్లో రూ.600 కోట్లు ప్రతిపాదించింది.

**డ్రిప్,స్ప్రింకర్లు (ఎకరాల్లో)**

| సంవత్సరం | రైతులు | డ్రిప్ | స్ప్రింక్లర్ | మొత్తం |
|---|---|---|---|---|
| 2014-15 | 31,277 | 46,353 | 30,130 | 74,483 |
| 2015-16 | 39,545 | 77,979 | 21,665 | 99,643 |
| 2016-17 | 55,121 | 1,32,121 | 22,835 | 1,54,956 |
| 2017-18 | 83,458 | 1,39,289 | 84,276 | 2,23,565 |
| 2018-19 | 37,596 | 70,233 | 30,530 | 1,00,763 |
| 2019-20 | 1,745 | 3,920 | 913 | 4,833 |
| మొత్తం | 2,48,742 | 4,69,894 | 1,90,349 | 6,60,243 |



బడ్జెట్ పత్రాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

## లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి 51.77 టీఎంసీల ఎత్తిపోత

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న లక్ష్మీ (మేడిగడ్డ) పంప్‌హౌస్ నుంచి మార్చి 4వ తేదీ నాటికి మొత్తంగా 51.77 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసినట్లు సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడైంది. అలాగే ఎగువన ఉన్న సరస్వతి (అన్నారం) పంప్‌హౌస్ ద్వారా 46.53 టీఎంసీలు, దాని పైన ఉన్న పార్వతి (సుందిళ్ల) ద్వారా 44.06 టీఎంసీల నీటిని ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసినట్లు సర్వే తెలిపింది. ఇక ఎల్లంపల్లి నుంచి నంది పంప్‌హౌస్ ద్వారా 59.94 టీఎంసీలు, గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 57.64 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు వెల్లడించింది. ఇక మిషన్ కాకతీయ ద్వారా ఇప్పటి వరకు నాలుగు విడతలుగా 27,584 చెరువుల పునరుద్ధరణను రూ.8,735.32 కోట్లతో చేపట్టినట్లు సర్వే వెల్లడించింది. ఇందులో ఇప్పటివరకు 21,601 చెరువుల పనులు పూర్తయ్యాయని, దీనికి రూ.4,352 కోట్లు ఖర్చు చేశారని పేర్కొంది. ఈ చెరువుల పునరుద్ధరణ ద్వారా 8.94 టీఎంసీల నీటి నిల్వలు పెరిగాయని వెల్లడైంది. మరో 5,983 చెరువుల పనులు పూర్తి చేయాల్సి ఉందని తెలిపింది.

## టీఎస్ ఐపాస్ ద్వారా 13.08 లక్షల మందికి ఉపాధి



తెలంగాణ పారిశ్రామిక విధానం ‘టీఎస్ఐపాస్’ద్వారా గతేడాది డిసెంబర్ 31 నాటికి రాష్ట్రంలో 6,23,071 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. రూ.1,84,655 కోట్ల పెట్టుబడితో 11,857 కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయి. ఇందులో 9,020 పరిశ్రమల్లో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభమైంది. టీఎస్ఐపాస్ కింద రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమల పురోగతి

**జాతీయ స్థాయితో పోల్చితే తెలంగాణలో ఆరోగ్య పరిస్థితులు**

| | రాష్ట్రం | జాతీయ |
|---|---|---|
| మాతా మరణాల రేటు (ఎంఎంఆర్) | 76 | 122 |
| శిశు మరణాల రేటు (ఐఎంఆర్) | 29 | 33 |
| 5 ఏళ్ల లోపు మరణాల రేటు | 32 | 37 |
| నవజాత శిశు మరణాల రేటు | 20 | 23 |

**విద్యుత్ కనెక్షన్ల సంఖ్య**

| కేటగిరీ | విద్యుత్ కనెక్షన్ల సంఖ్య |
|---|---|
| గృహ | 1,11,10,556 |
| గృహేతర | 13,88,409 |
| పరిశ్రమలు | 98,146 |
| కుటీర పరిశ్రమలు | 18,103 |
| వ్యవసాయం | 24,15,838 |
| వీధి దీపాలు | 1,53,995 |
| సాధారణ అవసరాలు | 55,932 |
| తాత్కాలిక | 3,786 |
| హెచ్‌టీ మొత్తం | 12,947 |

epaper.sakshi.com

సాక్షి
# ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 9-3-2020






# అలెక్సా వెరీ ఇంటెలిజెంట్

## పైకి ఒక్కరే. లోపల అరుగురు!

**అలెక్సా! ఎవరావిడ?!**
**వర్చువల్ అసిస్టెంట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ.**
**ఒక్క ముక్క తెలుగు లేదు.**
**అలెక్సాకు ఇంగ్లిష్, హిందీతో పాటు మొత్తం ఎనిమిది భాషలు వచ్చు. తెలుగు రాదు. 'రాదు' అంటే.. అలెక్సా మనిషా, రావడానికి?! మనిషి లాంటి మనిషి. త్వరలో తెలుగులో కూడా అర్థంచేసుకోబోతున్న మనిషి! మర మనిషి అనుకోండి. కానీ మనిషిలా ఉండదు. మరలా ఉంటుంది.**

**సిలెండర్ ఆకారంలో ఉండే స్పీకర్... అలెక్సా బాహ్యరూపం. అలెక్సా అంతః స్వరూపానికి మాత్రం ఆరు రూపాలు ఉన్నాయి. అన్నీ స్త్రీ రూపాలు. వాటిలో ఐదు జ్ఞానేంద్రియాలు. (ఇందు, టీనా, దీపిక, స్నేహాల్, ప్రాచి) ఆరో రూపం.. స్మృతేంద్రియం (రమ్య).**
**వీళ్లు నడిపిస్తుంటారు అలెక్సాను.**

అలెక్సా ఎకో స్పీకర్‌ను తెచ్చుకుని, పవర్ సప్లయ్ ఇచ్చి, అమెజాన్ అలెక్సా యాప్‌ని మన స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని, ఇన్‌స్ట్రక్షన్స్‌ని ఫాలో అయితే చాలు.. అలెక్సా మన ఆదేశాలను ఫాలో అయిపోతుంది. మనకేం కావాలంటే అది చేసి పెడుతుంది. 'అలెక్సా.. ఆ లైట్ ఆపేయ్'. ఆపేస్తుంది. 'అలెక్సా.. నిద్ర రావడం లేదు. నిద్రొచ్చే పాటలు వినిపించు'. వినిపిస్తుంది. 'అలెక్సా నా జర్నీకి టికెట్స్ బుక్ చెయ్'. చేస్తుంది. 'అలెక్సా ఆన్‌లైన్‌లో ఫలానా ఫలానవి షాపింగ్ చెయ్యి'. చేసి పెడుతుంది. ఒక్కమాటలో.. 'తెలివైన సహాయకురాలు' అనుకోండి. తెలుగులో అలెక్సాకు సరిగ్గా సరిపోయే మాట కూడా ఇదే! అలెక్సాకు అంత తెలివి, అంత చురుకుదనం, అంత నైపుణ్యం ఈ ఆరుగురు అమ్మాయిల వల్లే వచ్చింది. వీళ్ల గురించి.. క్లుప్తంగా.. సంక్షిప్తంగా.

### అలెక్సా ఆలోచన



**ఇందు ప్రసాద్** అలెక్సా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్. 2017లో అలెక్సాలో చేరారు. చిన్న వయసులోనే జర్నలిజంలోకి వచ్చి.. దాదాపు ఇరవై ఏళ్లపాటు స్టార్, జీ వంటి బ్రాండెడ్ టీవీ చానల్స్‌లో పని చేశారు. అలెక్సా ఏవైతే పనులు చేయగలుతోందో అవన్నీ కూడా ఇందు టీమ్ చేయిస్తున్నవే. అలెక్సా తీర్చే సందేహాలు, అలెక్సా ఇచ్చే సలహాలు, అలెక్సా చూపే పరిష్కారాలు, కొన్నిసార్లు అలెక్సా చూపించే ప్రేమ.. అన్నీ కూడా ఇందూ టీమ్‌వే.

### అలెక్సా స్పందన



**దీపికా బాలకృష్ణన్** 'అలెక్సా ఎక్స్‌పీరియన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్' విభాగంలో సీనియర్ మేనేజర్. అలెక్సాను ఉపయోగించే కస్టమర్లకు మంచి అనుభవాలను ఇవ్వడం, తరచు అలెక్సాన వినియోగించేలా చేయడం ఆమె డ్యూటీ. కస్టమర్‌ల అవసరాలకు అలెక్సా ఎలా స్పందిస్తున్నదీ దీపిక బృందం నిశితంగా పర్యవేక్షిస్తూ అలెక్సాను నియంత్రిస్తుంటుంది. అలెక్సాతో కస్టమర్‌ల అనుభూతిని అడిగి తెలుసుకుంటూ ఉంటుంది. అలెక్సాలో చేరక ముందు అమెజాన్ ప్రైమ్ ఇండియా మార్కెటింగ్‌లో ఉద్యోగి. అతి కష్టమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తుండే వారితో కలిసి పని చేస్తుండడం వల్ల నేర్చుకోడానికి ఎంతో ఉంటుందని దీపిక అంటారు.

### అలెక్సా స్వరగమన



**టీనా సదానా** అలెక్సా స్వరసేవల బృంద నాయిక. ఆరంభం నుంచీ అలెక్సాలో ఉన్నారు. కొనుగోళ్లు, అమ్మకాల విభాగాన్ని చూస్తారు. "ఇదొక అంతులేని మహా సాగరం. ఇందులో ఈత కొట్టడం బాగుంటుంది. వినియోగదారులు, ఉత్పత్తిదారుల మధ్య అనుసంధానం అటుంచి, వాళ్లమ మధ్య అలెక్సా సంభాషణ ఆసక్తిగా ఉపయుక్తంగా ఉంటుంది" అంటారామె. ఎలక్ట్రానిక్స్, టెలికాంలలో ఇంజనీరింగ్ చేశారు టీనా. అలెక్సాకు ముందు ఎయిర్‌టెల్‌లో ఉన్నారు.

### అలెక్సా అవగాహన



**స్నేహల్ మేప్రమ్** యు.ఎస్.లో అలెక్సా ఆరంభం అవడానికి ఏడాది ముందే అలెక్సాలో చేరారు. అంతకుముందు మైక్రోసాఫ్ట్ ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్)లో స్పీచ్ అనలిస్ట్‌గా, స్కైప్‌లో ప్రోగ్రామ్ మేనేజర్‌గా చేశారు. అలెక్సాలో ప్రస్తుతం నేచురల్ లాంగ్వేజ్ అండర్‌స్టాండింగ్ (ఎన్.ఎల్.యు.) టీమ్‌లో పని చేస్తున్నారు. ఇండియన్ ఇంగ్లిష్‌లో, హిందీలో కస్టమర్‌లను అర్థం చేసుకోడానికి అలెక్సాకు స్నేహల్ టీమ్ ఎప్పటికప్పుడు అవగాహన శక్తిని నింపుతుంటుంది. అలెక్సాకు హిందీని అలవాటు చేయడం స్నేహల్‌కు పెద్ద ఛాలెంజింగ్ జాబ్ అయింది.

### అలెక్సా చేతన



**రమ్యా పూసర్ల** తెలుగమ్మాయి. విశాఖ దగ్గర చిన్న పట్టణం. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో చదివారు. చదువు పూర్తవగానే నేరుగా అమెజాన్‌లో చేరారు. కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేట్. సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా చేశారు. అలెక్సాకు శిక్షణ ఇచ్చారు! ఏదైనా ఉద్యోగానికి వెళ్లినప్పుడు అనుభవం ఉందా అని అడుగుతారు కదా.. అలా అలెక్సాకు రమ్య 'ఎక్స్‌పీరియెన్స్' శిక్షణ ఇచ్చారు. పెద్ద పనే. ఇప్పుడు కూడా ఆమె, ఆమె టీమ్ చేస్తున్నది అదే. కస్టమర్ తీరుకు అనుగుణంగా అలెక్సా ప్రతి స్పందనల్ని వృద్ధి చెయ్యడం

### అలెక్సా మన్నన



**ప్రాచీ ముఖియా** అలెక్సా స్కిల్స్‌కి, అలెక్సా వాయిస్ సర్వీసులకు మార్కెటింగ్ చేస్తుంటారు. ఆమె పని ప్రధానంగా ఇండియన్ డెవలపర్‌లు, ఇండియన్ బ్రాండ్లు, ఇండియన్ ఏజెన్సీలతో ఉంటుంది. అన్ని పర్యావరణ వ్యవస్థలకు అనుగుణంగా వాయిస్-టెక్‌ని అభివృద్ధి చేస్తుంటుంది ప్రాచీ టీమ్. కస్టమర్‌లకు అలెక్సాకు మధ్య దృఢమైన స్వరబంధాన్ని ఏర్పరచడం కూడా ఆమె పనే.

షి ఇన్‌స్పైర్స్ అజ్

# ప్రధానికే 'నో'

**పి**డుగనుకోవాలి ఈ పిల్లను. లేదా పసితనం అనుకోవాలి. ప్రధాని అంతటివారే తనను గుర్తిస్తే.. మీ గుర్తింపేమీ నాకు అవసరం లేదని 'నో' కొట్టేసింది! మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన సోషల్ మీడియా అకౌంట్లన్నీ మహిళలకే అంకితం చేసి, 'షి ఇన్‌స్పైర్స్ అజ్' (ఆమె మన స్ఫూర్తి ప్రదాత) అనే మహిళా చైతన్య ఉద్యమాన్ని ప్రారంభించిన సంగతి మీరు వినే ఉంటారు. ఆ తర్వాత ప్రభుత్వం ఒక పని చేసింది. లిసిప్రియ అనే 8 ఏళ్ల మణిపురి ఉద్యమ కార్యకర్తను ఉదాహరణగా చూపిస్తూ.. ఈ చిన్నారిని చూస్తే మీకు ఇన్‌స్పిరేషన్ కలగట్లేదా... ఎంత చేస్తోందో చూడండి.. పర్యావరణం కోసం!' అని అభినందించింది. అయితే మోదీ ప్రభుత్వం ఇచ్చిన ఆ ప్రత్యేకతను లిసి అంగీకరించలేదు. 'మీరు నా మాటను వినకపోయేటట్లయితే దయచేసి మీ 'షి ఇన్‌స్పైర్స్ అజ్' ఉద్యమానికి నన్ను జత చేయకండి' అని ట్వీట్ ఇచ్చింది లిసిప్రియా. ఈమధ్య ఎవరో తనని ఇండియన్ గ్రెటా థన్‌బర్గ్ (ఆమె స్వీడన్ యాక్టివిస్టు) అన్నందుకు కూడా లిసి ఇంతెత్తున ఎగిరింది. 'నేను నేనే' అని కూడా అంది. సో.. పసితనం కాదు. పిడుగే తను.



చిరునవ్వులు చిందిస్తున్న లిసిప్రియా

గుర్తుకొస్తున్నాయి

# జోలపాడిన ఉయ్యాల

'ఇక ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు'.. అనే మాట వింటుంటాం.. ఎవరైనా కెరీర్‌లో ఎలా పైపైకి ఎదిగారో తెలుసుకుంటున్నప్పుడు. నేహ మాత్రం ఇప్పటికీ వెనక్కి తిరిగి చూసుకుంటూనే ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పెట్టిన లేటెస్ట్ ఫొటో చూడండి. ఫొటో కాదు. ఫొటోలు. ఒకటి.. ఇప్పుడు వాళ్లు రిషికేష్‌లో ఉంటున్న బంగళా. ఇంకొకటి.. అదే రిషికేష్‌లో ఒకప్పుడు వాళ్లు ఉన్న చిన్న గది. బంగళా గురించి తెలుసుకోవలసిందేమీ లేదు. ఆ చిన్న గదిలోనే జీవిత పాఠాలు ఉన్నాయి. నేహ చిన్నప్పుడు.. ఆ ఒక్క గదే వాళ్ల ఇల్లు, కిచెన్ కూడా. గదిలో ఒక పక్కన టేబుల్ అమర్చి దాన్నే వంటగదిగా చేసి కుటుంబానికి కొన్నేళ్ల పాటు వండిపెట్టారు నేహ అమ్మగారు. అద్దె ఇల్లది. ఇప్పటికీ అలాగే ఉంది. అక్కడి వెళ్లి ఆ గది గడప బయట నిల్చుని ఫొటో తీయించుకున్నారు నేహ. అదే డ్రెస్‌తో బంగళా ముందు నిలబడి ఫొటో తీయించుకున్నారు. రెండిటినీ పోస్ట్ చేశారు. నేహ ఇప్పుడు పెద్ద సింగర్, ఇండియన్ ఐడల్ జడ్జి. ''అక్కడికి వెళ్లగానే ఎమోషనల్ అయిపోతాను'' అంటున్నారు నేహ. బహుశా ఆ గదే ఆమెకు ఏడంతస్థుల భవనంలా అనిపిస్తూ ఉండొచ్చు. తనకు జోల పాడిన ఉయ్యాలలా కూడా.



నేహ కక్కర్



నేహ కక్కర్ : లేమిలో... కలిమిలో!

బ్యూటిప్స్

- గులాబీరేకులను ముద్దగా చేసి, దానికి పాలమీగడ కలిపి మెత్తగా, గుజ్జులా తయారైన ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. ఆరిన తర్వాత శనగపిండితో సున్నితంగా రుద్దుకుని ముఖం కడుక్కోవాలి. అప్పుడప్పుడు ఇలా చేస్తుంటే ముఖం మీద ముడతలు పోయి చర్మం నునుపుగా, కోమలంగా తయారవుతుంది.
- గుప్పెడు వేపాకులు ఎండబెట్టి పొడి చేసుకోవాలి. అందులో చిటికెడు పసుపు, తగినన్ని రోజ్‌వాటర్ కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. దానిని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. అప్పుడప్పుడు ఇలా చేస్తుంటే ముఖచర్మం అందంగా, ఆరోగ్యంగా తయారవుతుంది.

కొండా కోన

# ఆదివాసీ అక్షరం



**పద్దం అనసూయ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పూసుగూడెం గ్రామస్థులకు స్కూల్లో టీచర్‌గానే తెలుసు. మరికొంత మందికి... ఆమె ఆదివాసీ జీవితాలను కళ్లకు కడుతూ కథలు రాసే రచయితగా కూడా తెలుసు. తెలుగులో తొలి ఆదివాసీ రచయిత్రి అనసూయ. గిరిజన సంస్కృతి మైదాన జన సంస్కృతిలో కలగలిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఆదివాసీ జీవితంలోని పలుకుబడులను తన అక్షరాల్లో భద్రపరుస్తున్నారు అనసూయ. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆమెను కలిసింది.**



తోటి ఆదివాసీలతో పద్దం అనసూయ

**అ**నసూయ... పుట్టింది ములకల పల్లి మండలంలోని చుప్పన పల్లి గ్రామంలో. గిరిజన గూడేల్లో పిల్లలకు ఆకాశంలో చుక్కలైనా అందుతాయేమో కానీ అక్షరాలు అందేవి కావు. అనసూయదీ అదే పరిస్థితి. అమ్మానాన్న వ్యవసాయం చేసేవాళ్లు. పిల్లల చేత అక్షరాలు దిద్దించాలంటే పది కిలోమీటర్ల దూరాన ఉన్న పాల్వంచకు పంపించాలి. దారి, డొంక లేని దారుల్లో అంతటి సాహసం చేయలేకపోయారు. అయితే అమ్మమ్మ దూరదృష్టి తన జీవితాన్ని మలుపు తిప్పిందని చెప్పింది అనసూయ. ''మామయ్యను, పిన్నిని చదివించడానికి అమ్మమ్మ ఏడాదికి ఒక బస్తా జొన్నలిచ్చి ట్యూషన్ మాస్టార్ని పెట్టింది. ఆ మాస్టారి దగ్గర మమ్మల్ని కూడా కూర్చోబెట్టేది. మా అన్నయ్యలిద్దరికీ చదువు మీద ఆసక్తి కలగలేదు. నేను, తమ్ముడు మాత్రం చదువుకున్నాం.

**ఇంటర్‌తో ఉద్యోగం**

ఇంటర్‌లో ఉండగానే నాకు ఐటీడీఏలో ఉద్యోగం వచ్చింది. పెళ్లి తర్వాత బిఏ, బీఈడీ, ఎంఏ చేశాను. నా భర్త విద్యాసాగర్ కేటీపీఎస్ ఉద్యోగి. ఆయన మైదానం వ్యక్తి. ఆయన 'ముంపు' పేరుతో పోలవరం వ్యతిరేక దీర్ఘకవిత రాశారు. ఆ కవితను నాకిచ్చి ''ఇది మీ వాళ్ల కోసమే. మీ భాషలోకి అనువదించు. వాళ్లను చైతన్యపరచడానికి పని కొస్తుంది'' అన్నారు. దానిదేముంది, రెండు భాషలూ నాకు తెలిసినవే కదా, ఇట్టే అనువదించవచ్చు.. అనుకున్నాను. కానీ మా భాషలో పదాలు అంతరించిపోవడానికి దగ్గరగా ఉన్నాయనేది అనువాదం మొదలు పెట్టిన తర్వాతే తెలిసింది.

**అక్షరాల్లో బతికుంది**

రోజులు గడిచేకొద్దీ మా భాష ఉనికి ప్రశ్నార్థకం అవుతోంది. అందుకే మా సంస్కృతి సంప్రదాయాలను కథలుగా రాస్తున్నాను. మొదట 'కాకమ్మ' పేరుతో మా అమ్మమ్మ కథనే రాశాను. మా భాషలో అమ్మమ్మని కాకమ్మ అంటారు. కోయభాషలో కవితలు, అనువాద కథలు రాశాను. డోలీ కళాకారులు చెప్పే 'సమ్మక్క- సారలమ్మ' కథలను తెలుగులో రాశాను. 'చప్పుడు' పేరుతో కోయ కథల సంకలనం తెచ్చాను.

మైదానం అంటే కొత్తరంగుల ప్రపంచం. సులభంగా ఆకర్షితమవుతారు మా వాళ్లు. మా ఆడవాళ్ల నాలుకల మీద నాట్యమాడుతున్న పాటలు కూడా మైదానవాసుల పదాలను కలుపుకుంటున్నాయి. అందుకే పెద్ద వయసు ఆడవాళ్ల దగ్గర కూర్చుని మా పాటలను పాడించి రికార్డు చేస్తున్నాను. అభివృద్ధి కోసం చదువుకోవాలి. అలాగని మన మూలాలను తుంచేసుకోకూడదు. 'మన మూలాల మీద వేళ్లానుకుని అల్లుకున్న మన జీవితాలను మైదానం మెరుపులతో కాంతిమంతం చేసుకోవాలి. అంతే తప్ప మనం మనంగా ఉండకుండా మరొకరిలా మారిపోకూడదు' అని చెబుతుంటాను'' అన్నారు పద్దం అనసూయ.

– వాకా మంజులారెడ్డి

**పిల్లమడి.. సింగిరిబిల్లి**

**సం**స్కృతం వల్ల తెలుగు భాషకు అందం వచ్చింది. మా కోయ భాషకు ప్రకృతి అందం తెచ్చింది. మా పదాలన్నీ ప్రకృతి నుంచే పుట్టాయి. గర్భసంచిని మా భాషలో ఏమంటారో తెలియక ఎంతోమందిని అడిగాను. ఆఖరుకి మా తాతను అడిగితే... ఆడపిల్లవు తెలుసుకోకపోతే ఎలా అని 'పిల్లమడి' అని చెప్పాడు. ఆ పదం నారుమడి నుంచి వచ్చిందట. మడికట్టి నారు పోస్తే అది నారుమడి. అండం కడుపులో తనకు తాను ఏర్పరుచుకునేది పిల్లమడి. పదం ఉద్భవించిన తీరు ఎంత అందంగా ఉందో కదా. అలాగే మైదానం వాళ్లు ఊసరవెల్లిని రంగులు మార్చే ప్రాణిగా చూస్తారు. కానీ మేము మాత్రం ఊసరవెల్లిని ప్రకృతిలోని రంగులను నింపుకునే అందమైన బొమ్మగా చూస్తాం. సింగిరిబిల్లి అంటాం. అంటే సింగారించుకున్న బుజ్జి పాపాయి అని అర్థం.

– పద్దం అనసూయ

మెట్రో రైల్

# పింక్ స్టేషన్‌లు

**ని**న్నటి నుంచి నోయిడా మెట్రో రైల్ కార్పోరేషన్.. ఆక్వా లైన్‌లో ఉన్న (ఇందులోకి నోయిడా, గ్రేటర్ నోయిడా వస్తాయి) మొత్తం 21 స్టేషన్‌లలో శానిటరీ ప్యాడ్స్‌ని ఉచితంగా అందుబాటులో ఉంచడం ప్రారంభించింది. అంతేకాదు, ఈ స్టేషన్‌లలో రెండింటిని 'పింక్ స్టేషన్స్'గా మార్చారు. పింక్ స్టేషన్‌లలో తల్లి బిడ్డకు పాలివ్వడానికి, డయపర్స్ మార్చడానికి ప్రత్యేకమైన గదులు, వసతులు ఉంటాయి. అక్కడ మహిళా సిబ్బంది మాత్రమే ఉంటారు. నోయిడా లోని 'సెక్టార్ 29', గ్రేటర్ నోయిడాలోని 'పరీ చౌక్' స్టేషన్‌లకు ఈ పింక్ స్టేషన్ హోదాను ఇచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా మెట్రో రైల్ కార్పోరేషన్ మహిళా ప్రయాణికుల కోసం మెరుగుపరిచిన సదుపాయాలివి.



నోయిడా పింక్ స్టేషన్‌లో మహిళల వసతి గదులు

ఎడబాటు

# విడిపోము మనము

**అ**ద్దానికి ఇవతల ఉన్నది భర్త. అవతల ఉన్నది భార్య. భర్త ఇట్నుంచి ల్యాండ్‌లైన్‌లో మాట్లాడుతుంటే, భార్య అట్నుంచి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆయనకు 89 ఏళ్లు. ఆమెకూ ఇంచుమించు అంత వయసే కదా ఉంటుంది. ఈ వయసులో ఏమిటీ కష్టం ఈ దంపతులకు! మీకు అర్థమయ్యే ఉంటుంది.. కరోనా వైరస్ వారిని వేరు చేసింది. భర్త జీన్ క్యాంప్‌బెల్‌ను యు.ఎస్. ప్రభుత్వం కిర్క్‌లాండ్‌లోని 'లైఫ్ కేర్ సెంటర్' కట్టడిలో ఉంచినప్పట్నుంచీ ఆయన భార్య విలవిల్లాడి పోతున్నారు. కరోనా సోకిన భర్తను తాకుతూ మాట్లాడ్డానికి ఆమెకేం భయం లేదు. ప్రభుత్వమే ఆమెను అనుమతించడం లేదు. ఒకర్నొకరు చూసుకోగలుగుతున్నారు, మాట్లాడుకోగలుగుతున్నారు. అదే మహద్భాగ్యం అన్నట్లు ఆ దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాయి ఈ జంట హృదయాలు.



జీన్ క్యాంప్‌బెల్‌తో బయటి నుంచే మాట్లాడుతున్న భార్య

epaper.sakshi.com

# గ్రీన్ సిగ్నల్


● నాని

'మెంటల్ మదిలో, బ్రోచేవారెవరురా' సినిమాలతో తన ప్రత్యేకతను చాటుకున్నారు దర్శకుడు వివేక్ ఆత్రేయ. ఇప్పుడు నానీతో ఓ సినిమా చేయడానికి సిద్ధమయ్యారని సమాచారం. ఈ మధ్యనే వివేక్ వినిపించిన కథకి నాని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. ప్రస్తుతం 'వి' చిత్రాన్ని పూర్తి చేసి, 'టక్ జగదీష్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు నాని. ఆ తర్వాత 'శ్యామ్ సింగరాయ్' అనే సినిమా చేయనున్నారు. ఈ సినిమాలు పూర్తయ్యాక వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో చేసే సినిమాను ప్రారంభిస్తారని సమాచారం. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లే అవకాశముంది.

# ఉగాదికి కొత్తగా...!


● చిరంజీవి

కొత్త తెలుగు సంవత్సర ప్రారంభోత్సవం రోజున చిరంజీవి సరికొత్త అవతారంలో ప్రేక్షకులకు కనువిందు చేయబోతున్నారట. కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా 'ఆచార్య' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో త్రిష కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి నిర్మాతలు. పోలవరం పరిసర ప్రాంతాల్లో ఈ సినిమాకు సంబంధించిన పోరాట సన్నివేశాలను ఇటీవల తెరకెక్కించారని సమాచారం. అలాగే ఈ సినిమాలో చిరంజీవి లుక్ ఇదేనంటూ ఓ ఫొటో కూడా వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ఉగాది సందర్భంగా అధికారికంగా విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట చిత్రబృందం. అందుకు తగ్గ సన్నాహాలు జరుగుతున్నాయట. ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'ఆచార్య' చిత్రాన్ని ఈ ఏడాదిలోనే విడుదల చేయాలనుకుంటున్నారు.

# ఏయ్ పిల్లా...


● నాగచైతన్య, సాయి పల్లవి

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ స్టోరీ'. నారాయణ్ దాస్, పి. రామ్మోహన్ నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాలోని 'ఏయ్ పిల్లా..' అనే పాట టీజర్‌ను విడుదల చేశారు. దానికి మంచి స్పందన లభించింది. తాజాగా 'ఏయ్ పిల్లా..' పూర్తి పాటను, లిరికల్ వీడియోను ఈ నెల 11న విడుదల చేయబోతున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ సినిమాను వేసవిలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రంతో పవన్ సీహెచ్ సంగీత దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు.

# సుదీప్‌కు జోడీ


● శ్రద్ధా శ్రీనాథ్

సౌత్‌లో జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు హీరోయిన్ శ్రద్ధాశ్రీనాథ్. తాజాగా కన్నడలో మరో సినిమాకు సై అన్నారీ బ్యూటీ. సుదీప్ హీరోగా 'రంగితరంగ' ఫేమ్ అనూప్ భండారి దర్శకత్వంలో 'ఫాంటమ్' అనే చిత్రం తెరకెక్కనుంది. ఇందులో శ్రద్ధాను కథానాయికగా తీసుకున్నారని శాండల్‌వుడ్ టాక్. యాక్టింగ్‌కు మంచి స్కోప్ ఉన్న పాత్ర కావడంతో శ్రద్ధా కూడా సై అన్నారట. కన్నడ 'యు టర్న్'తో నటిగా మంచి ఫేమ్ సంపాదించుకున్న శ్రద్ధా శ్రీనాథ్ తెలుగులో నాని 'జెర్సీ' చిత్రంతో పాపులర్ అయిన సంగతి తెలిసిందే.

# బై బై ముంబై


● విజయ్ దేవరకొండ, పూరి జగన్నాథ్, చార్మీ

గత నలభై రోజులుగా ముంబై వీధుల్లో విహరిస్తున్నారు విజయ్ దేవరకొండ.. రేసింగ్ చేస్తున్నారు.. ఫైటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతానికి ఓ చిన్న బ్రేక్ ఇచ్చారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఫైటర్' (వర్కింగ్ టైటిల్). బాక్సింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కుతోంది. చార్మీ, పూరి, కరణ్ జోహార్, అపూర్వ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అనన్యా పాండే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్యాన్ ఇండియా చిత్రంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. 40 రోజుల ముంబై షెడ్యూల్‌ను మొన్న పూర్తి చేశారు. చిన్న బ్రేక్ తర్వాత కొత్త షెడ్యూల్‌ను ప్రారంభిస్తారు. ఈ సినిమాలో విజయ్ లుక్ చాలా కొత్తగా ఉంటుందని టాక్.

# 14 ఏళ్లకి సీక్వెల్


● ధనుష్

తమిళంలో హీరో ధనుష్ – దర్శకుడు సెల్వరాఘవన్‌లది బ్లాక్‌బస్టర్ కాంబినేషన్. 'తుళ్లువదో ఇళమై, కాదల్ కొండేన్, పుదు పేట్టై. మయక్కం ఎన్నా' వంటి సినిమాలు వీళ్ల కాంబినేషన్‌లో వచ్చాయి. తాజాగా ఐదోసారి ఓ సినిమా కోసం కలిశారు ఈ అన్నదమ్ములు. 2006లో వచ్చిన గ్యాంగ్‌స్టర్ చిత్రం 'పుదు పేట్టై'. తమిళ గ్యాంగ్‌స్టర్ సినిమాల్లో 'పుదు పేట్టై' ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. 14 ఏళ్ల తర్వాత ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కిస్తున్నట్టు ప్రకటించారు సెల్వరాఘవన్. ఈ ఏడాది ద్వితీయార్థంలో సెట్స్ మీదకు వెళ్లనుందని సమాచారం.

# అది జరగదనే నమ్ముతున్నాను


● శైలేష్ కొలను

''పుస్తకం, సినిమా, వెబ్‌సిరీస్... ఇలా ఏదైనా సరే మంచి కథలను ప్రేక్షకులకు చెప్పాలనుకుంటాను. మా నాన్నగారికి తెలియకుండానే సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు చేశాను. నేను 'హిట్' సినిమా తీశాక నాన్నగారు షాక్ అయ్యారు'' అని శైలేష్ కొలను అన్నారు. విశ్వక్ సేన్, రుహానీ శర్మ జంటగా తెరకెక్కిన చిత్రం 'హిట్'. 'ది ఫస్ట్ కేస్' అన్నది ఉపశీర్షిక. హీరో నాని సమర్పణలో ప్రశాంతి నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. శైలేష్ కొలను మాట్లాడుతూ – ''నానీగారికి పెద్ద అభిమానిని. ఆయనకి చెప్పిన కథల్లో 'హిట్'కి నిర్మాతగా ఓకే అన్నారు. 'హిట్'కి వచ్చే ఏడాది సీక్వెల్ కూడా ఉంటుంది. ఇండస్ట్రీలో డైరెక్టర్‌గా సెకండ్ మూవీ సిండ్రోమ్ (డైరెక్టర్‌గా తొలి విజయం సాధించి, రెండో సినిమా ఫ్లాప్ కావడం) సమస్య గురించి విన్నాను. నా విషయంలో అది జరగదనే నమ్మకం ఉంది. ఆ భయం నా బాధ్యతను పెంచుతుందనుకుంటున్నాను. నా పారితోషికాన్ని కూడా పెంచాలనుకుంటున్నాను'' అన్నారు.

# నిర్మాత వెంకట్రాజు ఇకలేరు


● సి. వెంకట్రాజు

'గూండారాజ్యం, టూటౌన్ రౌడీ, పవిత్రబంధం, పెళ్లి చేసుకుందాం, చక్రం'.. వంటి చిత్రాలను నిర్మించిన నిర్మాత చమర్తి వెంకట్రాజు (సి.వెంకట్రాజు) ఇక లేరు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. చిత్తూరు జిల్లా సిద్దిరాజు కండ్రిగ గ్రామంలో 1948 మే 25న చమర్తి నారపరాజు, వెంకటమ్మ దంపతులకు జన్మించారాయన. సిద్దిరాజు కండ్రిగ గ్రామానికే చెందిన గుంటుమడుగు శివరాజుతో(జి.శివరాజు) కలిసి శ్రీ విజయలక్ష్మి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ పతాకాన్ని స్థాపించారు వెంకట్రాజు. తొలిచిత్రంగా కృష్ణ హీరోగా 'గూండారాజ్యం'(1989) నిర్మించారు. ఆ తర్వాత 'టూటౌన్ రౌడీ, నియంత, అహంకారి, ఆదర్శం, ఆరంభం' వంటి సినిమాలు నిర్మించారు. ఆ తర్వాత గీత చిత్ర ఇంటర్నేషనల్ అనే పతాకాన్ని స్థాపించిన వీరిద్దరూ 'లేడీ బాస్, పవిత్రబంధం, పెళ్లి చేసుకుందాం, శ్రీమతి వెళ్లొస్తా, ఘర్షణ, చక్రం' వంటి పలు విజయవంతమైన సినిమాలు తీశారు. 'పవిత్రబంధం' సినిమాకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ చిత్రంగా బంగారు నందిని బహూకరించింది. సి.వెంకట్రాజు మృతికి పలువురు సినీ ప్రముఖులతో పాటు 'తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్' సంతాపం తెలిపింది. కాగా ఆయన అంత్యక్రియలు చెన్నైలో ఈరోజు జరగనున్నాయి.

# నాది నీరులాంటి స్వభావం


● రష్మికా మందన్నా

టాలీవుడ్‌లో అగ్రహీరోల సరసన వరుస అవకాశాలు కొట్టేస్తూ టాప్ హీరోయిన్ జాబితాలో ప్రేక్షకుల చేత పేరు రాయించుకున్నారు రష్మికా మందన్నా. నటిగా మంచి స్థాయికి చేరుకున్నారు. భవిష్యత్‌లో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు? అన్న ప్రశ్నకు రష్మిక బదులిస్తూ....''నేను ఎప్పటికప్పుడు కొత్త పాత్రలు చేయడానికే ఇష్టపడతాను. ప్రయోగాత్మక పాత్రలు చేస్తే నటిగా కొత్త మెళకువలు నేర్చుకోవచ్చు. ఇంకా కెరీర్ స్టార్టింగ్‌లోనే ఉన్నాను కాబట్టి ఏవైనా తప్పులు జరిగితే సరిదిద్దుకునే అవకాశం కూడా ఉంటుంది. నా నుంచి దర్శకులు మంచి నటను రాబట్టుకోవాలని కోరుకుంటాను. అందుకే స్క్రిప్ట్‌లోని నా పాత్రకు సంబంధించి ఎంత పనిభారం ఉన్నా సంతోషంగా స్వీకరిస్తాను. నిజానికి నాది నీరులాంటి స్వభావం. నీరు ఏ పాత్రలో ఉంటే ఆ పాత్ర స్వరూపంలో కనిపిస్తుంది. నేను కూడా అలానే ఉంటాను. ఓ ఇరవై ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే నటిగా నేను గర్వపడాలి. అలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నాను'' అన్నారు. అల్లుఅర్జున్, కార్తీ, ధృవసర్జా హీరోలుగా నటిస్తున్న చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తూ ఈ ఏడాది కూడా రష్మికా ఫుల్‌బిజీగా ఉన్నారు.

# నా ముక్కు బాలేదన్నారు


● జాక్వెలిన్ ఫెర్నాండెజ్

ఇండస్ట్రీలో హీరోయిన్‌గా రాణించాలంటే నటనతో పాటు ముక్కు ముఖం కూడా బావుండాలంటారు. కానీ బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ముక్కు విషయంలో కొన్ని విమర్శలు ఎదుర్కొన్నారు. కెరీర్ ప్రారంభంలో 'నీ ముక్కు బాలేదు' అని కొందరు ముక్కుసూటిగా చెప్పేవాళ్లట. 2009లో వచ్చిన 'అలాదిన్' సినిమా ద్వారా బాలీవుడ్‌కి పరిచయమయ్యారు శ్రీలంక మూలాలున్న జాక్వెలిన్ ఫెర్నాండజ్. నటిగా బాలీవుడ్‌లో పదేళ్లు పూర్తి చేసుకున్నారు. కెరీర్ తొలి రోజుల్లో ఎదుర్కొన్న ఇబ్బందులను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ''నటిగా బాలీవుడ్‌లో నా లక్ టెస్ట్ చేసుకోవాలనుకున్నాను. దాని కోసం శ్రీలంక నుంచి ముంబైకి షిఫ్ట్ అయ్యాను. ఇండస్ట్రీలో నాకు తెలిసినవాళ్లు ఎవ్వరూ లేరు. ఓ గుర్తింపు సంపాదించుకోవాలనే తపనతో ఒంటరి ప్రయాణం మొదలుపెట్టాను. హీరోయిన్‌గా ప్రయత్నాల్లో ఉన్నప్పుడు చాలా మంది నా పేరు మార్చుకోమని సలహా ఇచ్చేవాళ్లు. ఫెర్నాండజ్ ఏంటి? ముస్కాన్ అని పెట్టుకో బావుంటుంది అని ఒకరు, నీ ముక్కు బాలేదు, ముక్కు సర్జరీ చేయించుకో అని మరొకరు, ఇలా ఉండొద్దు.. అలా ఉండొద్దు అని కొందరు.. ఇలా రకరకాలుగా చాలా చెప్పేవారు. కానీ నేను మాత్రం నాలానే ఉండాలని నిశ్చయించుకున్నాను.. ఉన్నాను. ఈ పదేళ్ల ప్రయాణం నటిగా చాలా సంతృప్తినిచ్చింది. ఆ సలహాలు గుర్తు చేసుకున్నప్పుడల్లా నవ్వొస్తుంది'' అని ఫ్లాష్‌బ్యాక్‌ను గుర్తుచేసుకున్నారు. అన్నట్లు.. 'సాహో'లో ప్రభాస్‌తో కలిసి 'బాడ్ బ్యాయ్..' అనే పాటకు జాక్వెలిన్ స్టెప్పులేసిన విషయం గుర్తుండే ఉంటుంది.

# ఏ భాషలో అయినా చేస్తా


● నిత్యా శెట్టి

''నేను తెలుగమ్మాయినే. హైదరాబాద్‌లో చదువు పూర్తి చేశా. సినిమాల పట్ల ఆసక్తితో బాల నటిగా చేశా. 'అంజి , దేవుళ్ళు' సినిమాల తర్వాత రామానాయుడు గారి 'హరివిల్లు' సినిమా చేశా. ఆ తర్వాత హీరోయిన్‌గా కొన్ని చిత్రాల్లో నటించా'' అని నిత్యాశెట్టి అన్నారు. విశ్వంత్, సంజయ్ రావు, నిత్యాశెట్టి ముఖ్య పాత్రల్లో చెందు ముద్దు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ పిట్ట కథ'. వి.ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. నిత్యాశెట్టి మాట్లాడుతూ– ''ఓ పిట్టకథ'కి ప్రేక్షకుల స్పందన చూస్తుంటే సంతోషంగా ఉంది. వెంకటలక్ష్మి పాత్రకి మంచి గుర్తింపు వచ్చింది. స్నేహితులు, కుటుంబ సభ్యులు 'ఓ పిట్టకథ' బాగుందని చెప్తుంటే చాలా సంతోషంగా ఉంది. మంచి పాత్రలు ఏ భాషలో వచ్చినా చేయడానికి సిద్ధం. ప్రస్తుతం తమిళ్‌లో ఒక సినిమా చేస్తున్నాను. తెలుగులో కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి'' అన్నారు.

# పండక్కి సిద్ధం


● అమృత, ప్రదీప్

యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా పరిచయమవుతోన్న చిత్రం '30 రోజుల్లో ప్రేమించటం ఎలా'. అమృతా అయ్యర్ కథానాయికగా నటించారు. 'ఆర్య 2', '1.. నేనొక్కడినే' చిత్రాలకు సుకుమార్ దగ్గర పనిచేసిన మున్నా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కన్నడ చిత్రసీమలో విజయవంతమైన చిత్రాల నిర్మాతగా పేరుపొందిన ఎస్వీ బాబు నిర్మించిన ఈ సినిమాని ఉగాదికి ఈ నెల 25న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ఔట్‌పుట్ నచ్చడంతో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి జీఏ2, యూవీ క్రియేషన్స్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం. ''రొమాంటిక్ కామెడీగా రూపొందిన చిత్రమిది. ఇందులోని 'నీలి నీలి ఆకాశం..', 'ఇదేరా స్నేహం..' పాటలు సంగీత ప్రియుల ఆదరణను అమితంగా పొందాయి. మహేశ్ బాబు విడుదల చేసిన 'నీలి నీలి ఆకాశం..' పాట సెన్సేషనల్ హిట్టయి, ఇప్పటికే 60 మిలియన్ వ్యూస్ సాధించింది. తాజాగా విడుదల చేసిన 'మీకో దండం..' పాట 24 గంటల్లో 3 మిలియన్‌కి పైగా వ్యూస్ సాధించింది'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. శివన్నారాయణ, హేమ, పోసాని కృష్ణమురళి, 'శుభలేఖ' సుధాకర్, వైవా హర్ష, 'హైపర్' ఆది తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: దాశరథి శివేంద్ర.

# కష్టాలు దాటుకుంటూ వచ్చాం


● కార్తీక్, సయ్యద్

కార్తీక్ ఆనంద్, సయ్యద్ సోహైల్ రియాన్, డింపుల్ హయతి, షాలిని ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'యురేక'. ప్రశాంత్ నిర్మించిన ఈ సినిమాకు లలిత కుమారి సహ–నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''చిన్న సినిమాలవారు కష్టాలు పడుతున్నారు. కొత్తగా ఇండస్ట్రీకి వచ్చేవారు సినిమాల నిర్మాణం, విడుదల వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలి'' అన్నారు. ''ఓ కాలేజ్ ఫెస్ట్ నేపథ్యంలో సాగే మర్డర్ మిస్టరీ ఈ చిత్రం. ఈ సినిమాను డైరెక్ట్ చేస్తూ, ఓ లీడ్ రోల్ చేస్తానని కథ చెప్పినప్పుడు ఎక్కువమంది ఒప్పుకోలేదు. కానీ నిర్మాత ప్రశాంత్ నన్ను నమ్మి అవకాశం ఇచ్చారు''అన్నారు కార్తీక్ ఆనంద్. ''భవిష్యత్‌లో కార్తీక్ మంచి స్థాయిలోకి వెళతాడు'' అన్నారు సయ్యద్. ''యువత తలచుకుంటే ఏమైనా సాధించగలరు అన్నదే మా సినిమా'' అన్నారు ప్రశాంత్. ''కొత్తవారు తీసిన సినిమా అని కాకుండా తప్పక చూడండి'' అన్నారు లలితకుమారి. నటుడు ఆర్కే, సంగీత దర్శకుడు నరేష్, ఎడిటర్ అనిల్ పాల్గొన్నారు.

# ఒక రోజులో జరిగే కథ


● రవివర్మ, భవిక

భవికా దేశాయ్ ప్రధాన పాత్రలో 'వెన్నెల' కిశోర్, రవివర్మ, విజయసాయి, తాగుబోతు రమేష్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '302'. 'ది ట్రూ స్టోరీ ఆఫ్ రియల్ ఫేక్' అన్నది ఉపశీర్షిక. కార్తికేయ మిరియాల దర్శకత్వంలో డ్రీమ్ ట్రీ మీడియా పతాకంపై అవినాష్ సుందరపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలకానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నటుడు సునీల్ ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''302' ట్రైలర్ బావుంది.. సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''నట్టీస్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ద్వారా మా చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అన్నారు అవినాష్ సుందరపల్లి. కార్తికేయ మిరియాల మాట్లాడుతూ–''క్రైమ్, సస్పెన్స్, కామెడీతో పాటు హారర్ అంశాలతో ఆసక్తికరంగా, ఉత్కంఠ భరితంగా ఈ చిత్రాన్ని మలిచాం. ఒక రోజులో జరిగే కథ ఇది. ఒక అమ్మాయి ప్రేమ విషయంలో తల్లిదండ్రులతో గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వచ్చేస్తుంది. ఆ అమ్మాయి చుట్టూ తిరిగే కథ ఎలాంటి మలుపులు తిరిగిందన్నది తెరపై చూడాల్సిందే'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కళ్యాణ్ సమీ, రామరాజు, సంగీతం: రఘురాం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కుమార్ రాజా, సహనిర్మాత: టి..వైకుంఠరావు.

# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

సోమవారం 9-3-2020

# సాయుధ దళాల్లో.. స్త్రీ శక్తి!

**త్రివిధ దళాలు.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్.. వీటిలో కెరీర్ అంటే.. పురుషులకే అనే అభిప్రాయం! మహిళలు రాణించలేరనే అపోహ! మూడు విభాగాల్లో.. ఎందులో చూసినా.. పురుషులకే పెద్దపీట అనే అభిప్రాయం! కానీ.. ఇటీవల కాలంలో పరిస్థితి మారుతోంది. త్రివిధ దళాల్లో మహిళలకు ప్రాధాన్యం లభిస్తోంది. తాజాగా సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ.. త్రివిధ దళాల్లో చేరిన మహిళలకు పర్మనెంట్ కమిషన్ అవకాశం కల్పించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో మహిళలకు అందుబాటులో ఉన్న కెరీర్ అవకాశాలు.. అవసరమైన అర్హతలు.. ఎంపిక విధానాల గురించి తెలుసుకుందాం..**



- ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో మహిళలకు మెరుగైన అవకాశాలు
- నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్న త్రివిధ దళాలు
- సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు అవకాశం

త్రివిధ దళాలు..నిత్యం సరిహద్దుల్లో పహారా.. దేశ రక్షణలో భాగంగా అనుక్షణం అప్రమత్తతో, డేగ కళ్లతో శత్రువులపై నిఘా.. నిద్రాహారాలు మాని.. ప్రాణాలకు తెగించి.. ఉగ్రవాదులను మట్టుబెట్టడం..! ఇలా ఎంతో కఠినమైన విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అందుకే.. సాయుధ దళాల్లో పురుషులు మాత్రమే రాణించగలరనే అభిప్రాయం ఎన్నో ఏళ్లుగా స్థిరపడిపోయింది. ఆడపిల్లలను ఇంతటి కఠినమైన కెరీర్ వైపు పంపడం ఎందుకు? అనే విముఖత తల్లిదండ్రుల్లో సైతం కనిపిస్తుంటుంది. కాని ఇటీవల కాలంలో పరిస్థితి మారుతోంది. త్రివిధ దళాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతోంది. నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యం లభిస్తోంది. తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి సైతం మారుతోంది.

### షార్ట్ సర్వీస్ కమిషన్ నుంచి పర్మనెంట్ కమిషన్ వరకు

వాస్తవానికి త్రివిధ దళాల్లో మహిళలకు అవకాశం కల్పించడం అనేది 1992లోనే ప్రారంభమైంది. ఎంపికైన మహిళలను షార్ట్ సర్వీస్ కమిషన్ (అంటే.. కొద్దికాలం పాటు పనిచేసిన తర్వాత ఉద్యోగ విరమణ చేసే విధంగా)లో నియమించేవారు. 1992లో ప్రారంభమైన ఉమెన్ షార్ట్ సర్వీస్ కమిషన్ తొలుత అయిదేళ్లకే ఉండేది. తర్వాత మరో అయిదేళ్లు పొడిగించుకునే వీలు కల్పించారు. 2006లో గరిష్టంగా 14ఏళ్లపాటు త్రివిధ దళాల్లో మహిళలు పనిచేసేలా షార్ట్ సర్వీస్ కమిషన్ నిబంధనలు మార్చారు.

ఆ తర్వాత 2008లో జడ్జ్ అడ్వొకేట్ జనరల్(జేఏజీ), ఆర్మీ ఎడ్యుకేషన్ కార్ప్స్ విభాగాల్లో పర్మనెంట్ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా సుప్రీంకోర్టు.. మహిళలకు త్రివిధ దళాల్లోని అన్ని విభాగాల్లో పర్మనెంట్ కమిషన్‌కు అవకాశం కల్పించాలని తీర్పు ఇచ్చింది. దీంతో సాయుధ దళాల్లో మహిళలు దీర్ఘ కాలం పని చేసే అవకాశం అందుబాటులోకి వచ్చింది.

## ఆర్మీలో మహిళా ఆఫీసర్

త్రివిధ దళాలు అనగానే ఆర్మీనే మనకు స్ఫురిస్తుంది. ఆర్మీలో మహిళలకు డిగ్రీ, పీజీ అర్హతతో పలు కెరీర్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

### యూపీఎస్సీ- సీడీఎస్ఈ ద్వారా

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) జాతీయ స్థాయిలో నిర్వహించే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)లో ప్రతిభ ఆధారంగా ఆర్మీలో ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీలో.. ఎస్ఎస్‌సీడబ్ల్యులో(నాన్–టెక్నికల్) ప్రవేశం పొందొచ్చు. ఏటా రెండుసార్లు నిర్వహించే ఈ పరీక్షకు అర్హత ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. నోటిఫికేషన్‌లో పేర్కొన్న కటాఫ్ తేదీ నాటికి 19ఏళ్ల నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి తర్వాత దశలో ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగం ఖరారు చేస్తారు.

### ఆర్మీ.. నేరుగా

యూపీఎస్సీ నిర్వహించే సీడీఎస్ఈ పరీక్షతోనే కాకుండా.. ఆర్మీ విభాగం నేరుగా కూడా మహిళల కోసం నియామక ప్రక్రియ నిర్వహిస్తోంది. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్, జడ్జ్ అడ్వొకేట్ జనరల్ అనే రెండు విభాగాల్లో.. షార్ట్ సర్వీస్ కమిషన్ పద్ధతిలో నియామకాలు చేపడుతోంది.

### ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ ఫర్ ఉమెన్

డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్‌లో మూడేళ్ల అనుభవం ఉండాలి. అలాగే ఎన్‌సీసీ–సీ సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో బి గ్రేడ్‌తో ఉత్తీర్ణత పొందాలి. ఏటా రెండుసార్లు నోటిఫికేషన్ వెలువడుతుంది. ఇందులో ఎంపికైన వారికి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అందులోనూ విజయం సాధిస్తే ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ (ఓటీఏ)–చెన్నైలో 49 వారాల పాటు శిక్షణనిచ్చి ఆర్మీలో ఉద్యోగం ఇస్తారు.

### ఎస్ఎస్‌సీ డబ్ల్యు(జేఏజీ)

ఆర్మీలో నాన్–టెక్నికల్ విభాగంలో కీలకమైనదిగా ఎస్ఎస్‌సీడబ్ల్యు(జేఏజీ)ని పేర్కొనొచ్చు. కారణం.. ఇది ఆర్మీలో అంతర్గతంగా ఉండే న్యాయ విభాగానికి సంబంధించిన సర్వీస్. అందుకే దీన్ని జడ్జ్ అడ్వొకేట్ జనరల్‌గా పిలుస్తారు. ఏటా రెండుసార్లు(జూలై/ఆగస్ట్; జనవరి/ఫిబ్రవరి) నోటిఫికేషన్ వెలువడుతుంది. **అర్హత:** 55 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతోపాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో నమోదుకు అర్హత పొంది ఉండాలి. **వయో పరిమితి:** 21ఏళ్ల నుంచి 27ఏళ్లు.

### గ్రాడ్యుయేట్ టెక్నికల్ ఎంట్రీస్- ఎస్ఎస్‌సీ (టెక్నికల్) ఉమెన్

ఆర్మీలోని టెక్నికల్ విభాగంలో సైతం మహిళలకు అవకాశం కల్పించే విధానం.. షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్నికల్) ఉమెన్ ఎంట్రీ స్కీమ్. ఈ స్కీమ్ ద్వారా ఏటా రెండుసార్లు 20 మంది చొప్పున మొత్తం 40 మంది మహిళలను టెక్నికల్ విభాగాలకు ఎంపిక చేస్తారు. ఇందుకోసం ఏటా జూన్/జూలై; డిసెంబర్/జనవరి నెలల్లో నోటిఫికేషన్ విడుదలవుతుంది. **అర్హత:** సంబంధిత బ్రాంచ్‌లో బీటెక్. **వయో పరిమితి:** 20ఏళ్ల నుంచి 27 ఏళ్లు.

### అందరికీ ఓటీఏ-చెన్నైలో శిక్షణ

ఆర్మీలో ఈ విభాగాల్లో ఎంపికైన మహిళా అభ్యర్థులకు చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీలో 49 వారాల పాటు శిక్షణనిస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి కమిషన్డ్ ర్యాంకుతో ఆఫీసర్ హోదాలో విధులు కేటాయిస్తారు. డైరెక్ట్ ఎంట్రీ స్కీమ్ విధానాల్లో ఫిజికల్ టెస్ట్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు ఉంటాయి.

### మిలటరీ నర్సింగ్ సర్వీస్

ఆర్మీలో మహిళా అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో మార్గం.. మిలటరీ నర్సింగ్ సర్వీస్. బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల నియామకం ఖరారు చేస్తారు.

✦ **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

### త్రివిధ దళాల్లో మహిళలు... ముఖ్యాంశాలు

- ✦ 1992లో మొట్టమొదటిసారిగా మహిళా ఉద్యోగుల నియామకం.
- ✦ ప్రారంభంలో అయిదేళ్ల కాలానికే షార్ట్ సర్వీస్ కమిషన్
- ✦ 2006లో గరిష్ఠంగా 14 ఏళ్లపాటు పనిచేసేలా నిబంధనలు.
- ✦ 2008లో జడ్జ్ అడ్వొకేట్ జనరల్(జేఏజీ), ఆర్మీ ఎడ్యుకేషన్ కార్ప్స్ విభాగాల్లో పర్మనెంట్ కమిషన్.
- ✦ తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం–అన్ని విభాగాలకు పర్మనెంట్ కమిషన్ లభించే వీలు.
- ✦ 2015 నుంచి ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఫైటర్ పైలట్స్‌గానూ అవకాశం.
- ✦ తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా భావనా కాంత్.
- ✦ ఆర్మీలో ఇప్పటి వరకూ 1300 మంది మహిళలకు ఆఫీసర్ హోదా
- ✦ నేవీలో 600 వరకు మహిళా ఆఫీసర్లు
- ✦ ఎయిర్‌ఫోర్స్‌లో 1700 వరకు మహిళా ఆఫీసర్లు
- ✦ మొత్తం ఆఫీసర్స్‌లో పది శాతం మంది మహిళా ఆఫీసర్లు

## ఎయిర్‌ఫోర్స్‌లో పైలెట్‌గా

గగనతల గస్తీ విభాగంగా పేరొందిన ఎయిర్‌ఫోర్స్‌లోనూ ఇప్పుడు మహిళలకు అనేక అవకాశాలు ఉన్నాయి. ఎయిర్‌ఫోర్స్‌లో ఖాళీల భర్తీకి ఏఎఫ్‌క్యాట్(ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్)ను నిర్వహిస్తారు. దీనిద్వారా ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్), గ్రౌండ్ డ్యూటీ(నాన్–టెక్నికల్) విభాగాల్లో ఖాళీలు భర్తీ చేస్తారు. ఎయిర్ ఫోర్స్‌లో మహిళలకు అందుబాటులో ఉన్న మరిన్ని అవకాశాలు..

### ఫ్లయింగ్ బ్రాంచ్

షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో మహిళలకు అవకాశం లభిస్తోంది. రాత పరీక్ష, తదుపరి దశలో ఇంటర్వ్యూలో విజయం సాధిస్తే పైలెట్‌గా ఎంపిక చేస్తారు. ఇటీవల కాలంలో ఫైటర్ ఫ్లైయిట్స్ నడిపే అవకాశం సైతం మహిళలకు లభిస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణనిస్తారు. **అర్హత:**డిగ్రీలో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. దీంతోపాటు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి. **వయో పరిమితి:** 20 నుంచి 24 ఏళ్లు.

### గ్రౌండ్ డ్యూటీ-టెక్నికల్

ఈ విధానంలో మహిళా అభ్యర్థులను షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపిక చేస్తారు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఏరోనాటికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో మహిళలకు అవకాశం కల్పిస్తారు. **అర్హత:** బీటెక్/బీఈలో సంబంధిత బ్రాంచ్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. దీంతోపాటు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్‌తో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. **వయో పరిమితి:** 20ఏళ్ల నుంచి 26 ఏళ్లు.

### గ్రౌండ్ డ్యూటీ(నాన్-టెక్నికల్)

ఈ విధానంలో అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్, లాజిస్టిక్స్ విభాగాల్లో మహిళలను ఎంపిక చేస్తారు. **అర్హత:** 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. అకౌంట్స్ విభాగానికి మాత్రం బీకాం ఉత్తీర్ణులు మాత్రమే అర్హులు. **వయో పరిమితి:** 20 ఏళ్ల నుంచి 26 ఏళ్లు.

### ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లయింగ్ బ్రాంచ్)

వైమానిక దళంలో ఫ్లయింగ్ విభాగంలో మహిళలు కొలువులు అందుకునేందుకు మార్గం.. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ(ఫ్లయింగ్). ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ సీనియర్ డివిజన్‌లో 'సి' సర్టిఫికెట్ ఉండి.. డిగ్రీలో 60శాతం మార్కులతోపాటు ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్‌లో 60శాతం మార్కులు సాధించాలి. వయో పరిమితి: 20 ఏళ్ల నుంచి 24 ఏళ్లు.

✦ వీటితోపాటు గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో.. మెటీరియాలజీ; ఎడ్యుకేషన్ విభాగాల్లోనూ మహిళలకు షార్ట్ సర్వీస్ కమిషన్ హోదాలో అవకాశాలు లభిస్తాయి.

### గెజిటెడ్ ర్యాంకు

ఎయిర్‌ఫోర్స్‌లో ఏఎఫ్‌క్యాట్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు గ్రూప్–ఎ గెజిటెడ్ హోదాతో కొలువు లభిస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో షార్ట్ సర్వీస్ కమిషన్‌తో కెరీర్ ప్రారంభించిన వారికి సదరు వ్యవధి పూర్తి చేశాక.. పర్మనెంట్ కమిషన్‌కు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. ఏఎఫ్‌క్యాట్ ద్వారా ఆయా పోస్టులను భర్తీ చేసే క్రమంలో రెండంచెల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. తొలుత 300 మార్కులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు దేశ వ్యాప్తంగా ఉన్న మూడు(డెహ్రాడూన్, వారణాసి, గాంధీనగర్) ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్స్‌లో తదుపరి దశలో ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ప్రక్రియ జరుగుతుంది. ఫ్లయింగ్ బ్రాంచ్ విజేతలకు మలి దశలో కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) టెస్టు నిర్వహిస్తారు. వీటిలోనూ విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా.. మెడికల్ టెస్టు ఉంటుంది. ఆ తర్వాత రాత పరీక్ష, మెడికల్ టెస్టుల్లో మార్కుల ఆధారంగా తుది జాబితా రూపొందించి కొలువులు ఖరారు చేస్తారు. గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ బ్రాంచ్ అభ్యర్థులకు ఏఎఫ్‌క్యాట్‌తోపాటు మలి దశలో ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ కూడా ఉంటుంది.

✦ **వెబ్‌సైట్:** https:afcat.cdac.in

## నావికా దళంలో.. నారీ భేరీ

ప్రస్తుతం మహిళలకు భారత నావికా దళం(ఇండియన్ నేవీ) పలు అవకాశాలు కల్పిస్తోంది. ఏటీసీ, అబ్జర్వర్, లా, లాజిస్టిక్స్, ఎడ్యుకేషన్, నేవల్ ఆర్కిటెక్చర్, పైలెట్(మారిటైమ్ రికన్నైసెన్స్ స్ట్రీమ్), నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ విభాగాల్లో మహిళలకు షార్ట్ సర్వీస్ కమిషన్ ర్యాంకుతో ఉద్యోగాలు లభిస్తున్నాయి.



### విభాగాలు.. అర్హతలు

- ✦ ఏటీసీ(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్)–బీఈ/బీటెక్ ఉత్తీర్ణత; **వయో పరిమితి:** 19½ నుంచి 25 ఏళ్లు.
- ✦ అబ్జర్వర్– బీఈ/బీటెక్ ఉత్తీర్ణత; **వయో పరిమితి:** 19 నుంచి 24 ఏళ్లు.
- ✦ **లా:** ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతోపాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో పేరు నమోదుకు అర్హత. **వయో పరిమితి:** 22 నుంచి 27 ఏళ్లు.
- ✦ **లాజిస్టిక్స్:** బీఈ/బీటెక్ ఉత్తీర్ణత లేదా ప్రథమ శ్రేణిలో ఎంబీఏ ఉత్తీర్ణత లేదా బీఎస్సీ/బీకాం/బీఎస్సీ(ఐటీ)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతతోపాటు ఫైనాన్స్/ లాజిస్టిక్స్/సప్లయి చైన్ మేనేజ్‌మెంట్ /మెటీరియల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఏదో ఒక కోర్సులో ప్రథమ శ్రేణిలో పీజీ డిప్లొమా ఉత్తీర్ణత. లేదా ఎంసీఏ/ఎమ్మెస్సీ(ఐటీ) ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత. **వయో పరిమితి:** 19½ నుంచి 25 ఏళ్లు
- ✦ **ఎడ్యుకేషన్:** సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత. అదే విధంగా బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో అదే సబ్జెక్ట్ గ్రూప్‌తో ఉత్తీర్ణత. అదే విధంగా మెకానికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లేదా సీఎస్ఐటీ బ్రాంచ్‌తో ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ✦ **నేవల్ ఆర్కిటెక్చర్:** మెకానికల్/సివిల్/ఏరోనాటికల్/మెటలర్జీ/నేవల్ ఆర్కిటెక్చర్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌లో 60 శాతం మార్కులతో బీటెక్ ఉత్తీర్ణత. **వయో పరిమితి:** 19 1/2 నుంచి 25 ఏళ్లు.
- ✦ **పైలెట్(మారిటైమ్ రికన్నైసెన్స్ స్ట్రీమ్):** బీఈ/బీటెక్ ఉత్తీర్ణత; **వయో పరిమితి:** 19 నుంచి 24 ఏళ్లు.
- ✦ **నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్(ఎన్ఏఐ):** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ప్రొడక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఐటీ, కెమికల్, మెటలర్జీ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ తదితర బ్రాంచ్‌లతో బీఈ లేదా బీటెక్ ఉత్తీర్ణత.
- ✦ **పైలెట్ జనరల్:** బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. అదే విధంగా ఇంటర్మీడియెట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండాలి.
  **వయో పరిమితి:** 19 నుంచి 24 ఏళ్లు(కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉంటే 19 నుంచి 25 ఏళ్లు)

### ఐఎన్ఈటీ ద్వారా ఎంపిక

నేవీలో బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా ఎంపిక చేసే ఈ కొలువుల భర్తీకి ఇండియన్ నేవీ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. 100 మార్కులకు జరిగే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు తర్వాత దశలో ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే తొలుత షార్ట్ సర్వీస్ కమిషన్ పద్ధతిలో కొలువు ఖాయం అవుతుంది. ఆ తర్వాత ఇండియన్ నేవల్ అకాడమీలో శిక్షణనిస్తారు. తర్వాత విధులు కేటాయిస్తారు.

✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:**
https://www.joinindiannavy.gov.in/en/page/women-in-the-navy.html

---

## కెరీర్ కౌన్సెలింగ్

» నేను 2013లో ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తిచేశాను. కెమిస్ట్రీ విభాగంలో నాకు ఎలాంటి అవకాశాలు లభిస్తాయో చెప్పండి? –ఆర్ సుదర్శన్

✦ కెమిస్ట్రీ విద్యార్థులకు ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా కెమికల్ లేబొరేటరీస్, క్లినికల్ లేబొరేటరీస్, హెల్త్‌కేర్ ఇండస్ట్రీ, ఫార్మా ఇండస్ట్రీ, ఫోరెన్సిక్ ల్యాబ్స్, ఫెర్టిలైజర్ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో కెమిస్ట్, ఫార్మా అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, క్లినికల్ రీసెర్చ్ స్పెషలిస్ట్, రేడియాలజిస్ట్, ఫార్మాస్యుటికల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. వీరికి నెలకు రూ.25 వేల వరకు వేతనం లభిస్తుంది. పీజీ ఉత్తీర్ణతతో ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో సేంద్రీయ వ్యవసాయ ఎరువుల కంపెనీలు, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలు, ప్యాకేజ్డ్ ఫుడ్ సంస్థల్లో అవకాశాలు లభిస్తాయి. అదే విధంగా రీసెర్చ్ ల్యాబ్స్‌లోనూ కెరీర్ సొంతం చేసుకోవచ్చు. మీ విషయంలో కోర్సు ఉత్తీర్ణత తర్వాత బాగా గ్యాప్ వచ్చినందున.. ముందుగా ఈ విభాగంలో తాజా పరిణామాలపై దృష్టిసారించండి.

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

# ఏపీ ఐసెట్-2020




» ఎంబీఏ/ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు
» ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు
» దరఖాస్తులకు చివరి తేది: 02.04.2020

**ఏపీఐసెట్(ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)-2020 నోటిఫికేషన్ విడుదలైంది. ఏపీ ఉన్నత విద్యా మండలి తరపున తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. 2020-21 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని కాలేజీల్లో ఎంబీఏ/ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు ఏపీ ఐసెట్ చక్కటి అవకాశం. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా లేటరల్ ఎంట్రీ విధానంలో ఎంసీఏ రెండో ఏడాదిలో చేరే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో.. ఏపీ ఐసెట్ 2020కు అర్హతలు, దరఖాస్తు, పరీక్ష విధానం గురించి తెలుసుకుందాం..**

### అర్హతలు

ఐసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులు. చివరి సంవత్సరం చదువుతున్న వారు, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంబీఏలో ప్రవేశానికి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సరిపోతుంది. కాని ఎంసీఏ కోసం ఇంటర్ లేదా డిగ్రీ స్థాయిలో మ్యాథమెటిక్స్ చదివి ఉండాలి. లేటర్ ఎంట్రీ విధానంలో.. ఎంసీఏ రెండో ఏడాదిలో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు బీసీఏ లేదా ఐటీ/సీఎస్‌లో డిగ్రీతో పాటు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్ చదవడం తప్పనిసరి. కనీసం 50 శాతం మార్కులు రావాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు వచ్చి ఉండాలి.

### పరీక్ష విధానం

మల్టిపుల్ చాయిస్ విధానంలో 200 ప్రశ్నలు–200 మార్కులకు ఐసెట్ జరుగుతుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు. అంటే.. ఒక్కో ప్రశ్నకు నిమిషం కంటే తక్కువ సమయంలో సమాధానం గుర్తించాలి. సిలబస్‌లో మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ ఏ అనలిటికల్ ఎబిలిటీ 75 ప్రశ్నలు–75 మార్కులు; సెక్షన్ బీ మ్యాథమెటికల్ ఎబిలిటీ 75 ప్రశ్నలు–75 మార్కులు; సెక్షన్ సీ కమ్యూనికేషన్ ఎబిలిటీ 50 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

### సిలబస్.. ప్రిపరేషన్

#### అనలిటికల్ ఎబిలిటీ 75 ప్రశ్నలు

» ఈ విభాగంలో డేటా సఫిషియన్సీ నుంచి 20 ప్రశ్నలు, ప్రాబ్లమ్ సాల్వింగ్‌పై 55 ప్రశ్నలు అడుగుతారు. సీటింగ్ అమరిక, సీక్వెన్స్ అండ్ సిరీస్, వెన్ డయాగ్రమ్, బార్‌గ్రాఫ్, పైచార్టులు, డేటా అనాలసిస్ వంటి అంశాలు ఉంటాయి. డేటా సఫిషియన్సీలో.. ప్రాబ్లమ్ సాల్వింగ్, సీక్వెన్స్ అండ్ సిరీస్, నంబర్ అండ్ ఆల్ఫాబెట్, వరుసలో నంబర్ మిస్సింగ్, డేటా అనాలసిస్‌పై ప్రశ్నలు ఎదురవుతాయి. అలాగే టేబుల్స్ అండ్ గ్రాఫ్స్‌లో.. బార్ డయాగ్రామ్స్, పైచార్ట్, వెన్ డయాగ్రమ్, పాసేజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్‌పై ప్రశ్నలు వస్తాయి. డేట్, టైమ్, అరేంజ్‌మెంట్ విభాగంలో.. కేలండర్స్, క్లాక్(సమయం), రక్త సంబంధాలు, వాహనం రాక-పోక, సీటింగ్ అమరిక, చిహ్నాలు వివరణ(సింబల్స్ ఇంటర్‌ప్రిటేషన్) అంశాలు వస్తాయి. ఈ విభాగంలో ప్రశ్నలు అభ్యర్థి తార్కిక, విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని అంచనా వేసేలా ఉంటాయి.

#### మ్యాథమెటికల్ ఎబిలిటీ(75 ప్రశ్నలు)

» ఇందులో మూడు విభాగాలు ఉంటాయి. అవి అర్థమెటికల్ ఎబిలిటీ, ఆల్జీబ్రా, జామెట్రికల్ ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు అడుగుతారు.

» అర్థమెటికల్ ఎబిలిటీలో.. లాస్ ఆఫ్ ఇండిసిస్, ఐసీఎం, జీసీడీ, ప్రాఫిట్ అండ్ లాస్, ప్రాంతం–వాల్యూమ్, రేషియో అండ్ ప్రపోర్షన్, రేషనల్ నంబర్స్, పార్టనర్‌షిప్, మెన్సురేషన్, ఆర్డరింగ్, పైప్స్ అండ్ సిస్టెర్న్స్, మాడ్యులర్ ఆర్థమెటిక్, సంఖ్యల విభజన, పర్సంటేజ్, దూరం–పని అంశాలపై ప్రశ్నలు వస్తాయి.

» ఆల్జీబ్రా, జామెట్రికల్ ఎబిలిటీ నుంచి స్టేట్‌మెంట్స్, ట్రూత్ టేబుల్స్, వివిధ రూపాల్లో రేఖా సమీకరణం, పురోగమనాలు, త్రికోణమితి, బహుపద, ద్విపద సిద్ధాంతం, మాత్రికల పరిమితి, జ్యామితిపై ప్రశ్నలు అడుగుతారు.

» స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి ఫ్రీక్వెన్సీ డిస్ట్రిబ్యూషన్, మీన్, మీడియన్, మోడ్, స్టాండర్డ్ డీవియేషన్, సహసంబంధం(కోరిలేషన్), ప్రాబబిలిటీ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

#### కమ్యూనికేషన్ ఎబిలిటీ (50 ప్రశ్నలు)

» ఈ విభాగంలో ఫంక్షనల్ గ్రామర్, వొకాబ్యులరీ, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ, రీడింగ్ కాంప్రెహెన్షన్ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. కాబట్టి అభ్యర్థులు ఇంగ్లిష్ రీడింగ్ స్కిల్స్‌తోపాటు గ్రామర్, వొకాబ్యులరీపైనా పట్టు పెంచుకోవాలి. ముఖ్యంగా రోజువారీ కమ్యూనికేషన్‌లో ఉపయోగించే పదజాలం గుర్తించాలి. సమాచార మార్పిడిలో, వ్యాపార పరంగా వినియోగించే పదాలు, గ్రామర్‌ను అర్థం చేసుకోవాలి. ప్యాసేజ్‌ను వేగంగా చదివి అర్థం చేసుకోగలిగే నైపుణ్యం పెంచుకోవాలి. ఇందులో ప్రధానంగా పదజాలం, వ్యాపారం, కంప్యూటర్ పరిభాష, ఫంక్షనల్ వ్యాకరణం, రీడింగ్ కాంప్రహెన్షన్ అంశాలు చదవాల్సి ఉంటుంది.

### ప్రణాళికాబద్ధ ప్రిపరేషన్

పరీక్షకు సమయం చాలా తక్కువ ఉన్నందున అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి. మైనస్ మార్కులు లేకున్నా.. ప్రతి మార్కు ర్యాంకును నిర్ణయిస్తుందన్న సంగతి మరిచిపోరాదు. ముందుగా గత ప్రశ్న పత్రాలను పరిశీలించి ప్రశ్నల స్థాయిని అంచనా వేసుకోవాలి. అందుకుతగ్గ ప్రిపరేషన్ కొనసాగించాలి. మాక్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలి. వాస్తవంగా డిగ్రీ పరీక్షల్లో విద్యార్థులు సమయపాలనను పెద్దగా పట్టించుకోరు. కానీ పోటీపరీక్షల్లో మాత్రం టైమ్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకం. సిలబస్‌పై అవగాహన పెంచుకొని ప్రణాళికతో చదివితే కోరుకున్న కళాశాలలో సీటు లభిస్తుంది.

### ముఖ్య సమాచారం

- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరి తేదీ:** 2 ఏప్రిల్ 2020
- » రూ.2,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 12 వరకూ; రూ.5,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 20 వరకూ; రూ.10,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 25 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **పరీక్ష నిర్వహణ:** ఏప్రిల్ 27 (ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు)
- » వివరాలకు **https://sche.ap.gov.in/icet**

### టీఎస్ ఐసెట్ 2020

తెలంగాణ రాష్ట్రంలో 2020–21 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ/ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఐసెట్(తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) 2020కు నోటిఫికేషన్ విడుదలైంది.తెలంగాణ ఉన్నత విద్యా మండలి తరపున వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించనుంది.

- » **ప్రవేశ పరీక్ష పేరు:** తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఐసెట్)–2020
- » **ప్రవేశం కల్పించే కోర్సులు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్(ఎంసీఏ).
- » **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
- » **పరీక్ష తేదీలు:** మే 20, 21 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో ఐసెట్ 2020 పరీక్ష జరుగుతుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; ఇతరులకు రూ.450.
- » **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** 09.03.2020
- » **దరఖాస్తులకు చివరి తేదీ:** 30.04.2020
- » **వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

epaper.sakshi.com

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
9-3-2020



“ లీగ్ దశలో మేం అద్భుతంగా ఆడాం. ఫైనల్ మ్యాచ్‌లో క్యాచ్‌లు వదిలేయడం దురదృష్టకరం. రాబోయే రోజుల్లో మా ఫీల్డింగ్‌పై మరింత దృష్టి పెట్టాల్సి ఉంది. ఆటలో గెలుపోటములు సహజమే. గత టి20 ప్రపంచకప్‌లో సెమీస్ వరకు వస్తే, ఈసారి ఫైనల్ చేరాం. అంటే సరైన దిశలోనే ఉన్నామని అర్థం. అయితే కీలక మ్యాచ్‌లలో ఎలా ఆడాలో నేర్చుకోవాలి. అగ్రశ్రేణి బ్యాటర్ల క్యాచ్‌లు వదిలేసి కోలుకునే అవకాశమిచ్చాం. ఆ తర్వాత మేం కోలుకోలేకపోయాం. అయితే ఓటమికి షఫాలీని తప్పు పట్టలేం. ఇది ఎవరికైనా జరగవచ్చు. 16 ఏళ్ల ఆ అమ్మాయి చాలా అద్భుతంగా ఆడింది. ఇది ఆమెకు తొలి ప్రపంచకప్. ఆ వయసులో ఒత్తిడిని తట్టుకొని సానుకూలంగా ఆడటం అంత సులువు కాదు. దీనికంటే 2017 ప్రపంచ కప్ వన్డే ఫైనల్ ఓటమే ఎక్కువగా బాధిస్తుంది. నాడు దగ్గరగా వచ్చి కేవలం 9 పరుగులతోనే ఓడాం. భవిష్యత్తులో మా ప్రదర్శనను మెరుగుపర్చుకొని టైటిల్ గెలవగలం.

–హర్మన్‌ప్రీత్, భారత కెప్టెన్

*మరో ప్రపంచ కప్ ఫైనల్... మళ్లీ అదే ఓటమి వ్యథ...* విశ్వ వేదికపై భారత మహిళల క్రికెట్ జట్టు వేదన పునరావృతమైంది. గత వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో చివరి వరకు పోరాడి పరాజయం వైపు ఉండిపోయిన మన బృందం ఈసారి టి20 వరల్డ్ కప్ ఫైనల్లో కూడా ఓటమి పక్షానే నిలవాల్సి వచ్చింది. రికార్డు సంఖ్యలో మైదానంలో 86,174 మంది ప్రేక్షకులు, అటు ప్రత్యర్థిగా ఆతిథ్య జట్టు, భారీ లక్ష్యం... అన్నీ కలగలిసి తీవ్ర ఒత్తిడిలో హర్మన్ బృందం కుప్పకూలింది. కనీస పోటీ కూడా ఇవ్వలేక చేతులెత్తేసిన తీరు అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

*లీగ్ దశలో భారత్ చేతిలో ఓడినా...* అసలు పోరులో ఆస్ట్రేలియా జూలు విదిల్చింది. లోపాలు సరిదిద్దుకొని సరైన వ్యూహంతో బరిలోకి దిగి భారత్‌ను దెబ్బ కొట్టింది. సొంత గడ్డపై తిరుగులేని ప్రదర్శనతో ఐదోసారి పొట్టి ప్రపంచ కప్‌ను తమ ఖాతాలో వేసుకుంది. ఓపెనర్లు హీలీ, మూనీ ఇచ్చిన ఆరంభం భారీ స్కోరుకు బాటలు వేయగా, బౌలింగ్‌లో మెగాన్ షూట్, జొనాసెన్ చెలరేగి ప్రత్యర్థి ఆటకట్టించారు. టోర్నీలో ప్రయాణం తడబడుతూనే సాగినా ... చివరకు తమ స్థాయిని ప్రదర్శించి ఆసీస్ ఐదోసారి జగజ్జేతగా నిలిచింది.

**5** ఆస్ట్రేలియాకు ఇది 5వ ప్రపంచకప్ టైటిల్. 7 సార్లు టోర్నీ జరిగితే ఇంగ్లండ్, వెస్టిండీస్ ఒక్కోసారి నెగ్గాయి.

**30** అలీసా హీలీ అర్ధ సెంచరీకి తీసుకున్న బంతులు. ఏ ఐసీసీ టోర్నీ ఫైనల్లోనైనా (పురుషులతో సహా) ఇదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ.

**184** ఫైనల్లో ఆసీస్ స్కోరు. ఏ టి20 ప్రపంచకప్‌లోనైనా (పురుషులతో సహా) ఇదే అత్యధిక స్కోరు.

**85** భారత్‌కు ఇది రెండో (85 పరుగులు) అతి పెద్ద పరాజయం. గతంలో దక్షిణాఫ్రికా చేతిలో 105 పరుగులతో ఓడింది.

**52** శిఖా పాండే ఇచ్చిన పరుగులు. ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఒక బౌలర్ ఇచ్చిన అత్యధిక పరుగులు ఇవే.




# మన వనిత... పరాజిత




### టి20 మహిళల ప్రపంచ కప్ ఫైనల్లో భారత్ ఓటమి

- ఐదోసారి విశ్వ విజేతగా ఆస్ట్రేలియా
- తుది పోరులో 85 పరుగులతో ఘన విజయం
- ఆసీస్‌ను గెలిపించిన హీలీ, మూనీ, షూట్
- హర్మన్ బృందం సమష్టి వైఫల్యం

**మెల్‌బోర్న్:** భారత మహిళల క్రికెట్ జట్టు ప్రపంచ విజేతగా నిలవాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే! టి20 వరల్డ్ కప్‌లో తొలిసారి ఫైనల్ చేరి అరుదుగా లభించిన అవకాశాన్ని అందుకోవడంలో విఫలమైన మన జట్టు మళ్లీ రన్నరప్‌గానే ముగించింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో ఆదివారం జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా 85 పరుగుల భారీ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అలీసా హీలీ (39 బంతుల్లో 75; 7 ఫోర్లు, 5 సిక్సర్లు)... ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ బెత్ మూనీ (54 బంతుల్లో 78 నాటౌట్; 10 ఫోర్లు) తొలి వికెట్‌కు 70 బంతుల్లోనే 115 పరుగులు జోడించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. భారత్ 19.1 ఓవర్లలో 99 పరుగులకే ఆలౌటైంది. దీప్తి శర్మ (35 బంతుల్లో 33; 2 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. షూట్ (4/18), జొనాసెన్ (3/20) భారత ఇన్నింగ్స్ పతనాన్ని శాసించారు.

**హీలీ విధ్వంసం...**

స్పిన్ బలాన్ని నమ్ముకున్న భారత్... దీప్తి శర్మతో తొలి ఓవర్ వేయించింది. అయితే మొదటి బంతిని ముందుకు దూసుకొచ్చి ఆడి బౌండరీగా మలచిన హీలీ తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. అదే ఓవర్లో మరో రెండు ఫోర్లు కొట్టిన హీలీ... శిఖా వేసిన తర్వాతి ఓవర్లో మరో రెండు ఫోర్లు కొట్టింది. పవర్‌ప్లే తర్వాత కూడా హీలీ దూకుడు తగ్గలేదు. రాజేశ్వరి వేసిన ఓవర్లో ఆమె వరుసగా రెండు సిక్సర్లు కొట్టింది. ఇందులో మొదటిది ఏకంగా 83 మీటర్ల దూరంలో పడింది! అనంతరం 30 బంతుల్లోనే ఆమె అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత శిఖా వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్లో హీలీ పండగ చేసుకుంది. వరుసగా మూడు బంతుల్లో ఆమె 6, 6, 6 బాదింది. ఈ ఓవర్లో మొత్తం 23 పరుగులు వచ్చాయి. తొలి వికెట్ భాగస్వామ్యం సెంచరీ దాటిన తర్వాత ఎట్టకేలకు రాధ యాదవ్ బౌలింగ్‌లో మరో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో హీలీ అవుట్ కావడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. హీలీకి జతగా మరోవైపు మూనీ చక్కటి బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చింది. ఆమె 41 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. వీరిద్దరి తర్వాత వచ్చిన ఇతర బ్యాటర్‌లను నిలువరించడంలో భారత్ సఫలమైంది. ఫలితంగా చేతిలో 9 వికెట్లు ఉన్నా... చివరి 5 ఓవర్లలో ఆసీస్ 42 పరుగులే చేయగలిగింది.

**దీప్తి మినహా...**

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో షూట్ వేసిన మొదటి ఓవర్లో షఫాలీ 4 ఫోర్లతో 16 పరుగులు రాబట్టింది. కానీ ఈసారి షూట్ వంతు! తొలి ఓవర్ మూడో బంతికే హీలీ అద్భుత క్యాచ్‌కు షఫాలీ (2) వెనుదిరిగింది. జొనాసెన్ వేసిన రెండో ఓవర్లో మెడకు బంతి తగలడంతో తానియా (2) రిటైర్డ్‌హర్ట్‌గా నిష్క్రమించగా, జెమీమా (0) పేలవ షాట్‌తో వెనుదిరిగింది. ఆ తర్వాత మాలినెక్స్ కూడా తన మొదటి ఓవర్లోనే స్మృతి (11) పని పట్టింది. జొనాసెన్ తర్వాతి ఓవర్లో డీప్‌లో క్యాచ్ ఇచ్చి కెప్టెన్ హర్మన్ కౌర్ (4) అవుట్ కావడంతో భారత్ గెలుపు ఆశలు సన్నగిల్లాయి. వేద (24 బంతుల్లో 19; 1 ఫోర్), తానియా స్థానంలో కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన రిచా ఘోష్ (18; 2 ఫోర్లు)తో కలిసి దీప్తి కొద్దిసేపు పోరాడే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.

**86, 174**

ఎంసీజీలో ఫైనల్ మ్యాచ్‌కు హాజరైన ప్రేక్షకుల సంఖ్య. ఒక మహిళల క్రికెట్ మ్యాచ్‌కు ఎక్కడైనా హాజరైన అత్యధిక ప్రేక్షకుల సంఖ్య ఇది కాగా... ఆస్ట్రేలియా గడ్డపై ఏ క్రీడాంశంలోనైనా మహిళల మ్యాచ్‌కు హాజరైన అత్యధిక ప్రేక్షకుల సంఖ్య కూడా ఇదే.

**ఆ రెండు క్యాచ్‌లు...**

ఆసీస్‌లాంటి జట్టుకు ‘లైఫ్’ ఇస్తే ఎలా ఉంటుందో ఫైనల్ మ్యాచ్ మళ్లీ చూపించింది. రెండుసార్లు తమకు వచ్చిన అవకాశాలను భారత్ జారవిడుచుకొని మూల్యం చెల్లించింది. తొలి ఓవర్ ఐదో బంతికి హీలీ వ్యక్తిగత స్కోరు 9 వద్ద ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను కవర్స్‌లో షఫాలీ వర్మ వదిలేయగా... రాజేశ్వరి తన మొదటి ఓవర్లోనే మూనీ తన వ్యక్తిగత స్కోరు 8 వద్ద ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను నేలపాలు చేసింది. వీరిద్దరే ఆ తర్వాత చెలరేగి భారత్ కథ ముగించారు.

## స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** అలీసా హీలీ (సి) వేద (బి) రాధ 75; బెత్ మూనీ (నాటౌట్) 78; మెగ్ లానింగ్ (సి) శిఖా పాండే (బి) దీప్తి శర్మ 16; గార్డ్‌నర్ (స్టంప్డ్) తానియా (బి) దీప్తి శర్మ 2; హేన్స్ (బి) పూనమ్ 4; క్యారీ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 184.**
**వికెట్ల పతనం:** 1–115; 2–154; 3–156; 4–176.
**బౌలింగ్:** దీప్తి శర్మ 4–0–38–2; శిఖా పాండే 4–0–52–0; రాజేశ్వరి 4–0–29–0; పూనమ్ యాదవ్ 4–0–30–1; రాధ యాదవ్ 4–0–34–1.
**భారత్ ఇన్నింగ్స్:** షఫాలీ వర్మ (సి) అలీసా హీలీ (బి) షూట్ 2; స్మృతి మంధాన (సి) క్యారీ (బి) మాలినెక్స్ 11; తానియా (రిటైర్డ్‌హర్ట్) 2; జెమీమా రోడ్రిగ్స్ (సి) క్యారీ (బి) జొనాసెన్ 0; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) గార్డ్‌నర్ (బి) జొనాసెన్ 4; దీప్తి శర్మ (సి) మూనీ (బి) క్యారీ 33; వేద కృష్ణమూర్తి (సి) జొనాసెన్ (బి) కిమిన్స్ 19; రిచా ఘోష్ (సి) క్యారీ (బి) షూట్ 18; శిఖా పాండే (సి) మూనీ (బి) షూట్ 2; రాధ (సి) మూనీ (బి) జొనాసెన్ 1; పూనమ్ (సి) గార్డ్‌నర్ (బి) షూట్ 1; రాజేశ్వరి (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (19.1 ఓవర్లలో ఆలౌట్) 99.**
**వికెట్ల పతనం:** 1–2; 1–5 (రిటైర్డ్‌హర్ట్), 2–8; 3–18; 4–30; 5–58; 6–88; 7–92; 8–96; 9–97; 10–99.
**బౌలింగ్:** మెగాన్ షూట్ 3.1–0–18–4; జొనాసెన్ 4–0–20–3; మాలినెక్స్ 4–0–21–1; కిమిన్స్ 4–0–17–1; క్యారీ 4–0–23–1.

## హార్దిక్, ధావన్, భువనేశ్వర్ పునరాగమనం







- దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన
- కేదార్ జాదవ్‌పై వేటు

**అహ్మదాబాద్:** గాయాల నుంచి కోలుకున్న భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా... ఓపెనర్ శిఖర్ ధావన్... పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌లు జాతీయ జట్టులో మళ్లీ స్థానం దక్కించుకున్నారు. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల బృందాన్ని కొత్త చీఫ్ సెలెక్టర్ సునీల్ జోషి ఆదివారం ప్రకటించారు. పిక్క గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో వైస్ కెప్టెన్ రోహిత్ శర్మను ఈ సిరీస్ కోసం ఎంపిక చేయలేదు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో విఫలమైన మయాంక్ అగర్వాల్ స్థానంలో శిఖర్ ధావన్... శార్దుల్ ఠాకూర్ స్థానంలో భువనేశ్వర్... ఆల్‌రౌండర్ శివమ్ దూబే స్థానంలో హార్దిక్ పాండ్యా రాగా... ఆల్‌రౌండర్ కేదార్ జాదవ్‌పై వేటు పడింది. ఇటీవల కాలంలో 35 ఏళ్ల కేదార్ అంతగా ఆకట్టుకోకపోవడంతో మూల్యం చెల్లించుకున్నాడు. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేలు వరుసగా ఈనెల 12న (ధర్మశాల), 15న (లక్నో లో), 18న (కోల్‌కతాలో) జరగనున్నాయి.

**భారత వన్డే జట్టు:** విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, పృథ్వీ షా, లోకేశ్ రాహుల్, శుబ్‌మన్ గిల్, మనీశ్ పాండే, శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్, జస్‌ప్రీత్ బుమ్రా, నవదీప్ సైనీ, కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చహల్.




సౌరాష్ట్ర కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్

బెంగాల్ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్

## సౌరాష్ట్ర X బెంగాల్

**నేటి నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్**

ఉదయం గం. 9.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం

## భారత్ ‘పంచ్’ పవర్

**టోక్యో ఒలింపిక్స్‌కు ఐదుగురు భారత బాక్సర్లు వికాస్, ఆశిష్, సతీశ్, పూజ, లవ్లీనా అర్హత**

**అమ్మాన్ (జోర్డాన్):** క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమిస్తూ భారత బాక్సర్లు వికాస్ కృషన్ (69 కేజీలు), ఆశిష్ కుమార్ (75 కేజీలు), సతీశ్ కుమార్ యాదవ్ (ప్లస్ 91 కేజీలు), పూజా రాణి (75 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (69 కేజీలు) టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఇక్కడ జరుగుతున్న ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో పురుషుల విభాగంలో వికాస్, ఆశిష్, సతీశ్... మహిళల విభాగంలో పూజా రాణి, లవ్లీనా సెమీఫైనల్ చేరుకొని ‘టోక్యో’ బెర్త్‌లను ఖాయం చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో వికాస్ 3–2తో సెవోన్‌రెట్స్ ఒకజవా (జపాన్)ను ఓడించగా... ఆశిష్ 5–0తో మస్కితా (ఇండోనేసియా)పై... సతీశ్ 5–0తో దైవీ ఒట్కోన్‌బాయెర్ (మంగోలియా)పై గెలిచారు. పూజా రాణి 5–0తో పోర్నిపా చుటీ (థాయ్‌లాండ్)పై, లవ్లీనా 5–0తో మెలియెవా (ఉజ్బెకిస్తాన్)పై నెగ్గారు. పురుషుల 81 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో సచిన్ కుమార్ చైనా బాక్సర్ డాక్సియాంగ్ చెన్ చేతిలో ఓడిపోయాడు. విజేందర్ తర్వాత భారత్ తరఫున మూడోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన రెండో బాక్సర్‌గా వికాస్ కృషన్ గుర్తింపు పొందగా... ఆశిష్, సతీశ్, పూజా రాణి, లవ్లీనా తొలిసారి ఒలింపిక్స్ బరిలో నిలువనున్నారు.



వికాస్

## కన్నీళ్లు కనిపించనీయవద్దు!

*సాక్షి క్రీడా విభాగం*

మీకు తెలిసిన 16 ఏళ్ల వయసు ఉన్న అమ్మాయి ఏం చేస్తూ ఉంటుంది? శ్రద్ధగా చదువుకుంటూనో లేక సరదాగా ఆటపాటల్లోనో, ఇంకా చెప్పాలంటే ఏ టిక్‌టాక్‌లోనో బిజీగా ఉంటుంది. కానీ షఫాలీ వర్మ దేశం మొత్తం ఆశలను మోస్తూ 86 వేలకు పైగా జనం మధ్యలో మైదానంలోకి దిగి ‘గార్డ్’ తీసుకుంది. గత మ్యాచ్‌ల తరహాలో ఈసారి ఆమె సఫలం కాలేదు. అంతకుముందు సునాయాస క్యాచ్‌ను వదిలేసి ప్రత్యర్థికి అవకాశం ఇచ్చిన అపరాధ భావం కూడా వెంటాడి ఉంటుంది. అందుకే ఆట ముగిశాక ఆ టీనేజర్ ఓటమి బాధను తట్టుకోలేకపోయింది. కన్నీళ్లపర్యంతమైన షఫాలీని ఓదార్చడం సహచరుల వల్ల కాలేదు. అయితే ఈ పరాజయం ఆమె ఒక్కదానిది కాదు. అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఈ ఆరు నెలల్లో షఫాలీ ఆశించినదానికంటే అసాధారణ ప్రదర్శన కనబర్చింది. అసలు షఫాలీ ఆట లేకుండా మన టీమ్ తుది పోరు వరకు చేరేదా అనేది కూడా సందేహమే! ఎందుకంటే 5 ఇన్నింగ్స్‌లలో కలిపి షఫాలీ 163 పరుగులు చేస్తే... జట్టులో టాప్–3 బ్యాటర్లు అనదగ్గ స్మృతి, హర్మన్, జెమీమా కలిసి 14 ఇన్నింగ్స్‌లలో చేసిన పరుగులు 164 మాత్రమే.





- ముఖ్యంగా గత కొంత కాలంగా హర్మన్, స్మృతి ఈ ఫార్మాట్‌లో అన్నీ తామే అయి జట్టును నడిపిస్తూ వచ్చారు. మిథాలీ రాజ్‌ను అసాధారణ పరిస్థితుల్లో పక్కకు నెట్టేసిన తర్వాత వీరిద్దరే కీలకంగా మారారు. పైగా బిగ్‌బాష్ లీగ్, కియా సూపర్ లీగ్‌లలో ఆడిన అనుభవంతో వరల్డ్‌కప్‌లో వీరిపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఐదు ఇన్నింగ్స్‌లలో నాలుగు సార్లు ‘సింగిల్ డిజిట్’కే పరిమితమైన హర్మన్‌కు పుట్టిన రోజు చేదు అనుభవాన్ని మిగిల్చింది. స్మృతి ఒక్క మ్యాచ్‌లోనూ 20 దాటలేకపోయింది.
- షఫాలీకి ముందు సంచలన టీనేజర్‌గా వెలుగులోకి వచ్చిన జెమీమాకు ఆటపై శ్రద్ధ తగ్గినట్లుంది! బంగ్లాదేశ్‌పై మాత్రమే ఫర్వాలేదనిపించిన ఆమె ఫైనల్లో ఆడిన నిర్లక్ష్యపు షాట్ చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ ముగ్గురూ విఫలమైన చోట విశ్వ విజేతగా నిలవాలనుకోవడం అత్యాశే అవుతుందేమో.
- బౌలింగ్‌లో భారత్ పూర్తిగా స్పిన్ బలగాన్నే నమ్ముకుంది. ప్లాన్ ‘బి’ లేకుండా మెగా టోర్నీలో ఒకే తరహా వ్యూహానికి కట్టుబడటం ఫైనల్లో నష్టం కలిగించింది. ఎంసీజీలాంటి ఫ్లాట్‌పిచ్‌పై అది పని చేయలేదు. మన పేస్ మరీ బలహీనంగా ఉండటం కూడా సమస్యగా మారింది.
- మ్యాచ్ ఫీజుల పెంపు, కాంట్రాక్ట్‌లు, అలవెన్స్‌లు, ఇతర సౌకర్యాలు అత్యుత్తమ ప్రదర్శనకు హామీ ఇవ్వలేవు. ఇకపై సీరియస్‌గా మహిళల జట్టు ఆటను కూడా సమీక్షించాల్సిన అవసరం ఉంది. మహిళల క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లాలంటే ఫైనల్లో తప్పనిసరి గెలవాలని ఏమీ లేదు. ఇప్పుడు ఉన్న జోష్‌ను, జోరును కొనసాగించేందుకు బీసీసీఐకి ఇదే సరైన సమయం. ఎన్నో కష్టాలు దాటి ఇక్కడి వరకు వచ్చాననే కథలకు ఇక గుడ్‌బై చెప్పాలి. ఎందుకంటే ఇప్పుడు మహిళల క్రికెట్‌కు కూడా ప్రపంచ స్థాయి అత్యుత్తమ సౌకర్యాలు ఉన్నాయి. ఆసీస్ విజయానికి కారణంగా చెబుతున్న బిగ్‌బాష్ లీగ్ తరహాలో ఐపీఎల్‌ను నిర్వహించడం అంత సులువు కాదు. సీనియర్ స్థాయిలో కనీసం 40 మంది అగ్రశ్రేణి ప్లేయర్లు కూడా మనకు అందుబాటులో లేరు. అయితే ఇకపై ఎక్కువ విరామం లేకుండా దేశవాళీలో కూడా వీలైనన్ని ఎక్కువ టోర్నీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. షఫాలీ, రిచా ఘోష్ లాంటి ప్లేయర్లు చాలెంజర్ ట్రోఫీ నుంచే వెలుగులోకి వచ్చారు.
- **చివరగా... తాజా పరాజయం బాధించవచ్చు. కానీ భవిష్యత్తులో మరింత ఎదిగేందుకు ఈ టోర్నీ ప్రదర్శన స్ఫూర్తిగా నిలవాలి తప్ప నిరాశగా మారిపోకూడదు. ఫైనల్ తర్వాత దిగ్గజ క్రికెటర్ బిషన్ సింగ్ బేడి చెప్పినట్లు...**

*‘కన్నీళ్లను ఎక్కడా బయటపడనీయవద్దు. ఓడినప్పుడైతే అసలే వద్దు’!*

epaper.sakshi.com

సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం
9-3-2020


**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 894 ▼ | 280 ▼ |
| 37,577 | 10,989 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,576 | ▼ 163 |
| డోజోన్స్ | 25,865 | ▼ 257 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 6,463 | ▼ 243 |
| డాక్స్ | 11,542 | ▼ 403 |
| షాంఘై | 3,035 | ▼ 37 |
| నికాయ్ | 20,750 | ▼ 579 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ధామసకుక | 71.70 | 75.49 |
| బ్రిటన్ పౌండ్ | ధామసకుక | 92.64 | 97.32 |
| యూరో | ధామసకుక | 79.96 | 84.26 |
| జపాన్ ఎన్ (100) | ధామసకుక | 65.00 | 72.00 |
| ఆస్ట్రేలియా డాలర్ | ధామసకుక | 47.37 | 49.72 |
| సింగపూర్ డాలర్ | ధామసకుక | 51.29 | 54.59 |
| సౌదీ రియాల్ | ధామసకుక | 18.64 | 20.16 |
| యూఏఈ దిర్హామ్ | ధామసకుక | 19.36 | 20.78 |
| చైనా యువాన్ | ధామసకుక | 9.42 | 11.06 |

# పెద్దలకు పరిపూర్ణ రక్షణ

- హెల్త్ ఇన్సూరెన్స్ తప్పకుండా తీసుకోవాలి
- తగినంత కవరేజీ అవసరం
- కంపెనీ ఇన్సూరెన్స్ ఉన్నా విడిగా పాలసీ తీసుకోవాలి
- వృద్ధాప్యంలో ప్రత్యేకంగా వైద్య అత్యవసర నిధి
- పాలసీలో చెల్లించని ఖర్చుల కోసం ఇది అవసరం
- 50 ఏళ్లు వచ్చే సరికి బీమా ఉండేలా చూసుకోవాలి

**మన దేశ జనాభాలో వృద్ధులు (సీనియర్ సిటిజన్లు) 2015 నాటికి 8 శాతానికి చేరారు. 2050 నాటికి 19 శాతం వృద్ధులే ఉంటారని అంచనా. ప్రతీ ఇంటిలోనూ 60 ఏళ్లు నిండిన వయసు వారు ఆ కుటుంబానికి ఓ పెద్ద ఆస్తి వంటివారే. కుటుంబం కోసం అప్పటి వరకు వారు ఎంతో పాటు పడి, ఎంతో శ్రమకోర్చి ఉంటారు. కానీ, వృద్ధాప్యంలో వారిని చుట్టుముట్టే ఆరోగ్య, జీవనశైలి సమస్యలెన్నో. వీటి కోసం చేయాల్సిన ఖర్చు కొన్ని సందర్భాల్లో భారీగానూ ఉంటుంది. వయసుతోపాటు పెరిగే ఆరోగ్య సంరక్షణ వ్యయాలకు ప్రతీ కుటుంబం తగినంత సన్నద్ధతతో ఉండాలి. అయితే, సీనియర్ సిటిజన్లు, వారి పిల్లలు హెల్త్ కవరేజీ విషయంలో తగినంత రక్షణతో లేనట్టు ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ ఇటీవల నిర్వహించిన సర్వే ద్వారా తెలిసింది. "ఉమ్మడి కుటుంబాలు కాస్తా ఏక కుటుంబంగా మారుతున్న రోజుల్లో.. పిల్లలు పెద్ద పట్టణాలకు, విదేశాలకు జీవనోపాధి కోసం తరలిపోతుండడంతో పెద్దల జీవనం, వారి సంరక్షణ సవాలుగా మారుతున్నాయి" అని ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ సీఈవో మయాంక్ భత్వాల్ పేర్కొన్నారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో సంక్షేమం, ఆరోగ్యం కోసం అవసరమైన చర్యలను ముందు నుంచే తీసుకోవడం శ్రేయస్కరం. ఇందుకు వైద్య బీమాతో పాటు ఇతరత్రా తీసుకోతగిన చర్యలు సూచించే కథనమే ఇది.**

50 ఏళ్లకు వచ్చిన వారికి పదవీ విరమణ తీసుకునేందుకు మరో 10 ఏళ్ల వరకు సమయం మిగిలి ఉంటుంది. ఈ కాలాన్ని వైద్య అత్యవసర నిధి సమకూర్చుకునేందుకు వినియోగించుకోవాలి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో సిప్ రూపంలో పదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయడం ద్వారా అవసరమైనంత నిధిని సమకూర్చుకోవచ్చని సెబీ రిజిస్టర్డ్ పెట్టుబడి సలహాదారులు రేణు మహేశ్వరి సూచించారు. హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ తన వంతుగా రోగి చెల్లించాల్సి వస్తే అందుకోసం వైద్య అత్యవసర నిధి అక్కరకు వస్తుంది. అవుట్ పేషెంట్‌గా తీసుకునే చికిత్సలకు అన్ని పాలసీల్లోనూ కవరేజీ ఉండక పోవచ్చు. కనుక అవుట్ పేషెంట్ వైద్య సేవలకు చేసే చెల్లింపులు, ఆస్పత్రికి రాను, పోను చార్జీలు ఇవన్నీ రోగి తన పాకెట్ నుంచే పెట్టుకోవాల్సి రావచ్చు. ఇంటి నుంచే నర్సింగ్, చికిత్సల సేవలను పొందాల్సి వస్తే అయ్యే వ్యయాలు ఎక్కువగానే ఉంటాయి. అత్యవసర నిధి ఉంటే దాన్నుంచి వీటికి చెల్లింపులు చేసుకోవచ్చు. ఒక్కసారి అత్యవసర నిధి సిద్ధం చేసుకున్న తర్వాత.. మొత్తాన్ని ఒకే చోట కాకుండా.. సేవింగ్స్ డిపాజిట్, లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్స్ రూపంలో ఉంచుకోవాలి.

### గ్రూపు హెల్త్ ఇన్సూరెన్స్‌లో పెద్దలకు చోటు

ఉద్యోగం చేసే చోట గ్రూపు హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీని సంస్థ ఆఫర్ చేస్తుంటుంది. ఇందులో తమ తల్లిదండ్రుల పేర్లను కూడా యాడ్ చేసుకోవడం మంచిది. ఎందుకంటే సాధారణంగా గ్రూప్ హెల్త్ కవరేజీలో ప్రీమియం కొంచెం తక్కువగా ఉంటుంది. ముందు నుంచే తల్లిదండ్రులను యాడ్ చేస్తే ప్రీమియం భారం తగ్గించుకోవచ్చు. దీనికి తోడు తల్లిదండ్రులకు విడిగా హెల్త్ కవరేజీ కూడా తీసుకోవాలి. ''చాలా సంస్థలు తల్లిదండ్రులకు దీర్ఘకాలం కవరేజీని ఆఫర్ చేయడం లేదు. అందుకే ముందు తల్లిదండ్రులను గ్రూపు హెల్త్ ఇన్సూరెన్స్‌లో చేర్చుకున్నా కానీ, కొన్ని సంవత్సరాల తర్వాత ఖర్చులను తగ్గించుకునేందుకు తొలగించాల్సి రావచ్చు. పైగా ఈ పాలసీల్లో పెద్దలకు కవరేజీ తక్కువగా రూ.2–3 లక్షల వరకే ఉంటుంది. ఉద్యోగం మానేసినా, లేక సంస్థ మారినా ఈ కవరేజీని కోల్పోవాల్సి వస్తుంది'' అని పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ విభాగం హెడ్ అమిత్ ఛబ్రా పేర్కొన్నారు.

### అవసరమైనంత కవరేజీ

తగినంత హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ తీసుకోవడం ఎంతో అవసరం. ''మీరు నివసించే ప్రాంతం, జీవన శైలి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు.. ఆధారంగా ఎంత మేర సమ్ ఇన్సూర్డ్ (బీమా మొత్తం) తీసుకోవాలన్నది ఉంటుంది'' అని మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ ప్రసూన్ సిక్దర్ తెలిపారు. మెట్రోలో ఉంటున్న వారు, ఆస్పత్రిలో సింగిల్ రూమ్ కోరుకునే వారు అధిక కవరేజీ తీసుకోవడం అవసరం. వృద్ధ దంపతులకు రూ.10–20 లక్షల కవరేజీ, ఆ వయసులో విడిగా ఒకరికి అయితే రూ.7–10 లక్షల వరకైనా బీమా తీసుకోవాలి.

### ఆలస్యం చేయవద్దు

50 ఏళ్లకి వచ్చే సరికి దంపతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య బీమా కవరేజీ ఉండేలా చూసుకోవాలి. వైద్య బీమా అన్నది తగినంత లేకపోతే సూపర్ టాపప్ ద్వారా దాన్ని పెంచుకోవాలి. అదే 60 ఏళ్లు నిండిన తర్వాత కొత్తగా హెల్త్ పాలసీ తీసుకోవాలన్నా, సమ్ ఇన్సూర్డ్ మొత్తాన్ని పెంచుకోవాలన్నా లేక సూపర్ టాపప్ తీసుకోవాలన్నా అది కష్టంగా మారుతుంది. ''ఒక వ్యక్తి 60 ఏళ్ల వయసులోకి ప్రవేశించారంటే వారికి కఠిన అండర్‌రైటింగ్ నిబంధనలు అమలవుతాయి. ఉదాహరణకు పాలసీ తీసుకునే ముందు వైద్య పరీక్షలు తప్పనిసరి'' అని సిక్దర్ తెలిపారు. ముందస్తు వ్యాధులున్న వారికి బీమా కంపెనీలు బీమాకు నిరాకరిస్తున్నాయి కూడా. సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన పాలసీలు నేడు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ముందస్తు వ్యాధులకు ఇవి కవరేజీని ఆఫర్ చేస్తున్నప్పటికీ.. ఎన్నో పరిమితులను విధిస్తున్నాయి. కనుక వీటిని దృష్టిలో ఉంచుకోవాలి.



### కోపేమెంట్ ఎంత..?

సీనియర్ సిటిజన్ పాలసీల్లో ఎక్కువ వాటిల్లో కోపేమెంట్ ఆప్షన్ ఉంటోంది. కోపేమెంట్ అంటే వైద్య చికిత్సా వ్యయాల్లో రోగి తన వంతుగా చెల్లించాల్సిన వాటా. ఇది పాలసీలను బట్టి 10–30 శాతం మధ్య ఉండొచ్చు. క్లెయిమ్ మొత్తంలో ఈ మేరకు పాలసీదారులు భరించగా, మిగిలినది బీమా కంపెనీలు చెల్లిస్తాయి. కనుక కోపేమెంట్ క్లాజ్ లేని పాలసీ తీసుకోవాలి. లేదంటే పాలసీదారుని వాటా తక్కువగా ఉండేదానిని ఎంచుకోవడం మంచిది.

### ఉప పరిమితులు

బీమా సంస్థలు చెల్లింపుల్లో ఉప పరిమితులను కూడా విధిస్తుంటాయి. అంటే, ఫలానా వ్యాధికి గరిష్టంగా ఇంత మొత్తమని లేదా సమ్ ఇన్సూర్డ్‌లో నిర్ణీత శాతాన్ని చెల్లిస్తామన్న నిబంధనలు ఉంటాయి. ఉదాహరణకు గుండె సంబంధిత సమస్యలకు గరిష్టంగా రూ.3 లక్షలే చెల్లిస్తామనే పరిమితి ఉండొచ్చు. అదే కేటరాక్ట్ సర్జరీ అయితే గరిష్ట చెల్లింపులను రూ.25,000కు పరిమితం కావొచ్చు. ఒకవేళ ఇంతకు మించి వ్యయం అయితే దాన్ని పాలసీదారులే భరించాల్సి ఉంటుంది. అలాగే అన్ని పాలసీల్లో కాకపోయినా కొన్నింటిలో రూమ్ రెంట్, ఐసీయూ రెంట్ పరంగా ఉప పరిమితులు కూడా ఉంటుంటాయి. వీటితో మొత్తం పాలసీ చెల్లింపులు కూడా మారిపోతాయి. అందుకే పాలసీ తీసుకునే ముందుగానే వీటన్నింటినీ తెలుసుకోవాలి.

### వేచి ఉండే కాలం

సీనియర్ సిటిజన్ పాలసీల్లో రెండు రకాల వేచి ఉండే కాలావధి (వెయిటింగ్ పీరియడ్) ఆప్షన్లు ఉంటుంటాయి. ముందు నుంచీ ఉన్న వ్యాధులకు వర్తించేది ఒకటి. పాలసీ తీసుకున్నాకా రెండు నుంచి నాలుగేళ్ల గడిచాకే వీటికి కవరేజీనిస్తాయి. కేటరాక్ట్, మోకీలు మార్పిడి తదితర (కొంత కాలానికి వ్యాప్తి చెందేవి) చికిత్సలకు కవరేజీ కోసం పాలసీ తీసుకున్నాక రెండేళ్ల పాటు ఆగాల్సి రావడం మరొకటి. అంటే ఈ కాలంలో చికిత్సలు చేయించుకోవాల్సి వస్తే అందుకు అయ్యే వ్యయాలను పాలసీదారులే పెట్టుకోవాల్సి వస్తుంది. దాదాపు అన్ని పాలసీల్లోనూ ఈ నిబంధనలు ఉంటున్నాయి.

| బీమా కంపెనీ | ప్లాన్ పేరు | వార్షిక ప్రీమియం |
|---|---|---|
| రెలిగేర్ హెల్త్ | కేర్ సీనియర్ | రూ.39,374 |
| స్టార్ హెల్త్ | సీనియర్ సిటిజన్ రెడ్‌కార్పెట్ | రూ.43,135 |
| ఆదిత్యబిర్లా హెల్త్ | యాక్టివ్‌కేర్ స్టాండర్డ్ | రూ.55,598 |
| అపోలో మ్యునిక్‌హెల్త్ | ఆప్టిమారీస్టోర్ | రూ.61,312 |
| హెడీఎఫ్‌సీ ఎర్గో | హెల్త్‌సురక్షా గోల్డ్‌స్మార్ట్ | రూ.65,785 |

★ మెట్రోలో నివసించే 63 ఏళ్ల వృద్ధుడు, 61 ఏళ్ల ఆయన జీవిత భాగస్వామికి రూ.10 లక్షల కవరేజీ కోసం చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు ఇవి..

### ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ సర్వే అంశాలు

- 18% తల్లిదండ్రులకే హెల్త్ కవరేజీ ఉంది. అంటే మెజారిటీకి కవరేజీ లేదు.
- 26 శాతం తల్లిదండ్రులు వైద్య పరంగా అత్యవసర పరిస్థితుల్లో చెల్లింపులకు పిల్లల పైనే ఆధారపడుతున్నారు. అంటే నాలుగింట మూడొంతుల మందికి తగినంత పెట్టుబడులు, పొదుపు నిధుల్లేవు.
- 29 శాతం మంది తమ తల్లిదండ్రులను కంపెనీ లేదా ప్రభుత్వ వైద్య బీమా కవరేజీలో భాగం చేసినట్టు చెప్పారు. వీరికి ప్రత్యేకంగా కవరేజీ అవసరం కూడా ఉంది.

# కోవిడ్ పరిణామాలే నడిపిస్తాయ్..



- కరోనా వైరస్ పైనే మార్కెట్ దృష్టి
- కీలకంగా మారిన యస్ బ్యాంక్
- ఈ వారంలో ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం
- హోలీ సందర్భంగా మంగళవారం మార్కెట్‌కు సెలవు

**న్యూఢిల్లీ:** ప్రాణాంతకమైన కరోనా వైరస్ (కోవిడ్–19) వల్ల ప్రపంచానికి పెద్ద ప్రమాదమే పొంచి ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రభుత్వాలు ఎంత మేర విజయం సాధిస్తాయనే అంశం ఆధారంగానే మార్కెట్ కోలుకోవడమా లేదంటే.. మరింత పతనం కావడమా అనే కీలక అంశం ఆధారపడి ఉందని దలాల్ స్ట్రీట్ పండితులు విశ్లేషిస్తున్నారు. వైరస్ భయాలతో.. మార్కెట్లో చురుగ్గా పాల్గొనే ఇన్వెస్టర్లు గత కొద్ది రోజులుగా దూరంగా ఉంటున్నారని సామ్కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోడీ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాల్యూమ్స్ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రపంచ ఎకాన మీపై ఈ మహమ్మారి ప్రభావం ఎంత మేర ఉండనుందనే అంశం ఆధారంగానే ఈ వారంలో సూచీలు కోలుకుంటాయా లేదా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అన్నారు.

**యస్ బ్యాంక్ పరిణామాలు కీలకం**

గతవారంలో యస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మరింత దెబ్బతింది. కరోనా వైరస్ వ్యాప్తికి తోడు బ్యాంక్‌పై ఆంక్షలతో సెన్సెక్స్ 38,000 పాయింట్లు, నిఫ్టీ 11,000 పాయింట్ల దిగువకు పడిపోయాయి. బ్యాంక్ నిఫ్టీ ఐదు నెలల కనిష్టస్థాయికి పడిపోయింది. ఇక ఈ వారంలో కూడా యస్ బ్యాంక్ పరిణామాలు కీలకంకానున్నాయని జిమీత్ మోడీ అన్నారు. మనీ లాండరింగ్ ఆరోపణలపై బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదివారం అరెస్ట్ చేయగా.. ఈ ప్రభావం సోమవారం ట్రేడింగ్‌పై కనిపించనుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. యస్ బ్యాంక్‌లో కేవలం వాటాను మాత్రమే కొనుగోలు చేశామని, విలీనం ప్రసక్తి ఇప్పటికి లేదని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ తాజా పరిణామాలు, వైరస్ వ్యాప్తి ఆధారంగా ఈ వారం మార్కెట్ గమనం ఉంటుందని రెలిగేర్ బ్రోకింగ్ వీపీ రీసెర్చ్ అజిత్ మిశ్రా అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్ విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం క్లిష్టతరమేనని షేర్‌ఖాన్ రీసెర్చ్ హెడ్ గౌరవ్ దువా అన్నారు.

**ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులే..**

హోలీ సందర్భంగా మంగళవారం (10న) దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలు సెలవు ప్రకటించాయి. దీంతో ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది.

**ఆర్థికాంశాల ప్రభావం..**

జనవరి నెల పారిశ్రామికోత్పత్తి, ఫిబ్రవరి రిటైల్ ద్రవ్యోల్బణం డేటా గురువారం వెల్లడికానున్నాయి. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలు శుక్రవారం వెలువడనున్నాయి.

**ఈ నెల్లో రూ. 13,157 కోట్లు వెనక్కి..**

భారత క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ నెల్లో రూ. 13,157 కోట్లను ఉపసంహరించుకున్నారు. డిపాజిటరీల డేటా ప్రకారం.. మార్చి 2–6 మధ్య కాలంలో ఈక్విటీ మార్కెట్ నుంచి రూ. 8,997 కోట్లను, డెట్ మార్కెట్ నుంచి రూ. 4,160 కోట్లను వెనక్కు తీసుకున్నారు. భారత్ వంటి వర్ధమాన మార్కెట్లపై ఎఫ్‌పీఐలు ఆచితూచి వ్యవహరిస్తున్నారని గ్రోవ్ సహ వ్యవస్థాపకులు హర్ష్ జైన్ విశ్లేషించారు.

# 37,000 దిగువన మరింత పతనం

**మార్కెట్ పంచాంగం**

అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ హఠాత్తుగా అరశాతం వడ్డీ రేటును తగ్గించడంతో పాటు పలు ప్రధాన కేంద్ర బ్యాంకులు ఉద్దీపనలకు సిద్ధంగా వున్నట్లు ప్రకటించినప్పటికీ, కరోనావైరస్ పలు ప్రపంచదేశాల్లో తీవ్రంగా వ్యాప్తిచెందడంతో మార్కెట్ల పతనం కొనసాగుతూ వుంది. ఈ తరహా కేంద్ర బ్యాంకుల సాయం.. ఇన్వెస్టర్లను సమీప భవిష్యత్తులో శాంతింపచేస్తుందా అన్నది అనుమానమే. వ్యాధివ్యాప్తి తగ్గుముఖం పట్టి, ఉత్పత్తి, విక్రయాలు తిరిగి సాధారణస్థాయికి చేరుకుంటున్న సంకేతాలు కన్పిస్తేనే ఈక్విటీ మార్కెట్లు స్థిరపడగలుగుతాయన్నది అత్యధిక విశ్లేషకుల భావన. ఇక మన సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి...

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**

మార్చి6తో ముగిసినవారంలో గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన 39,090 పాయింట్ల గరిష్టస్థాయికి చేరాక బీఎస్‌ఈ సెన్సెక్స్ తీవ్ర అమ్మకాల ఒత్తిడితో 37,011 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 720 పాయింట్ల నష్టంతో 37,577 పాయింట్ల వద్ద ముగిసింది. గతవారపు పతనక్రమంలో గతేడాది అక్టోబర్9నాటి 'స్వింగ్ లో' అయిన 37,415 స్థాయిని శుక్రవారం ఇంట్రాడేలో సెన్సెక్స్ కోల్పోయినందున, కరెక్షన్ మరిన్ని రోజులు కొనసాగే అవకాశాలున్నాయి.




ఈ వారం సెన్సెక్స్ నెగిటివ్‌గా మొదలైతే 37,000 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. దీన్ని కాపాడుకోలేకపోతే వేగంగా 36,720 పాయింట్ల స్థాయికి క్షీణించవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 35,990 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు. ఈ వారం తొలి మద్దతుస్థాయిని పరిరక్షించుకోగలిగితే తొలుత 37,750 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపైన 38,385 పాయింట్ల స్థాయిని చేరవచ్చు. అటుపై క్రమేపీ 38,890 పాయింట్ల వరకూ పెరగవచ్చు.

**నిఫ్టీ 10,830 మద్దతు కోల్పోతే మరింత కరెక్షన్...**

క్రితంవారం ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ, గత కాలమ్‌లో ప్రస్తావించినట్లే 11,390 పాయింట్ల వరకూ పెరిగాక వేగంగా 10,827కు పతనమయ్యింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 213 పాయింట్ల నష్టంతో 10,989 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ గతేడాది అక్టోబర్9నాటి 'స్వింగ్ లో' అయిన 11,090 పాయింట్ల దిగువనే ముగిసినందున, రానున్న వారాల్లో 10,670 వరకూ పతనం కొనసాగే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఇక ఈ వారం 10,830 పాయింట్ల స్థాయి తొలి మద్దతు. ఇది పోతే.. వేగంగా 10,670 పాయింట్ల దాకా తగ్గొచ్చు. ఈ లోపున 10,580 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఈ వారం తొలి మద్దతుస్థాయిని పరిరక్షించుకుంటే 11,035 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపైన 11,250 పాయింట్లు, ఆ తర్వాత క్రమేపీ 11,390 వరకూ పెరగవచ్చు.




– పి. సత్యప్రసాద్

### పొదుపులో మహారాణులు

**68% సొంతంగా మనీ మేనేజ్‌మెంట్**



**న్యూఢిల్లీ:** భారతీయ మహిళలు చక్కగా పొదుపు చేయడంతోపాటు తమ పెట్టుబడులను తామే చక్కగా నిర్వహించుకుంటున్నారని ఆన్‌లైన్ ఆర్థిక సేవల సంస్థ స్క్రిప్‌బాక్స్ సర్వేలో వెల్లడైంది. ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వేలో 600 మంది పాల్గొనగా 68 శాతం మంది తమ డబ్బును తామే పెట్టుబడులు పెడుతున్నామని లేదా తమ కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో తమకు సమాన భాగస్వామ్యం ఉందని చెప్పారు. కేవలం 10 శాతం మంది ఆర్థిక నిర్ణయాలను కుటుంబంలో పురుషులకు వదిలేస్తున్నట్టు పేర్కొన్నారు. 80 శాతం మంది తాము నెలవారీ పొదుపు విషయంలో క్రమశిక్షణగా ఉంటున్నామని తెలిపారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 9-3-2020

| | |
|---|---|
| విశాఖ | 355-00 |
| చిత్తూరు | 323-00 |
| వరంగల్ | 288-00 |
| విజయవాడ | 321-00 |
| గోదావరి | 321-00 |
| 8-3-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 285-00 |

# యస్ బ్యాంక్ రాణా కపూర్ అరెస్ట్!!

- 11 దాకా ఈడీ కస్టడీ
- రంగంలోకి సీబీఐ
- మోసం, అవినీతి ఆరోపణలపై దర్యాప్తు
- డిపాజిటర్లకు మరోసారి ఆర్‌బీఐ భరోసా

**ముంబై:** సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ వ్యవహారం పలు మలుపులు తిరుగుతోంది. మనీ లాండరింగ్ ఆరోపణలపై వ్యవస్థాపకుడు రాణా కపూర్‌ను (62) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదివారం అరెస్ట్ చేసింది. మార్చి 11 దాకా ఆయన్ను ఈడీ కస్టడీకి ఇస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెడితే .. యస్ బ్యాంక్‌లో ఆర్థిక అవకతవకలు, దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్)కు రుణాలిచ్చినందుకు ప్రతిగా దాదాపు రూ. 600 కోట్ల ముడుపులు అందుకున్నారని కూడా రాణా కపూర్‌పై ఆరోపణలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఆయన్ను ఈడీ సుదీర్ఘంగా ప్రశ్నించింది. అయితే, విచారణకు ఆయన సహకరించడం లేదనే కారణంతో ఆదివారం ఉదయం సుమారు 3 గం.ల ప్రాంతంలో కపూర్‌ను అదుపులోకి తీసుకుంది. న్యాయస్థానంలో హాజరుపర్చగా ఈడీ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది. మరోవైపు, యస్ బ్యాంక్ వ్యవహారాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కూడా లాంఛనంగా దర్యాప్తు ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. స్కామ్ సంబంధ పత్రాలను అధికారులు సేకరిస్తున్నట్లు వివరించాయి. క్రిమినల్ కుట్ర, మోసం, అవినీతి కోణాల్లో దర్యాప్తుపై సీబీఐ దృష్టి పెట్టినట్లు సమాచారం. మొండి బాకీలు, కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలతో కుదేలైన యస్ బ్యాంక్ బోర్డును రద్దు చేసి ఆర్‌బీఐ తన అధీనంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అలాగే 30 రోజుల పాటు రూ. 50,000కు మించి విత్‌డ్రాయల్స్ జరపడానికి లేకుండా మారటోరియం కూడా విధించింది. దీనితో ఆ బ్యాంకు జారీ చేసిన ఫారెక్స్ కార్డులు పనిచేయక, వాటిని తీసుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణాకపూర్‌ను అరెస్టు చేసి కోర్టుకు తీసుకువెళుతున్న ఈడీ సిబ్బంది

**ఖాతాదారుల సొమ్ము భద్రం: ఆర్‌బీఐ**

తప్పుడు విశ్లేషణలు చూసి కొన్ని బ్యాంకుల్లో డిపాజిట్ల గురించి ఖాతాదారులు ఆందోళన చెందవద్దంటూ రిజర్వ్ బ్యాంక్ మరోసారి భరోసా కల్పించే ప్రయత్నం చేసింది. అన్ని బ్యాంకులను సునిశితంగా పరిశీలిస్తూనే ఉన్నామని, డిపాజిట్ల భద్రతకు ఢోకా ఉండదని మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌లో ఆర్‌బీఐ ట్వీట్ చేసింది. మార్కెట్ క్యాప్ ఆధారంగా బ్యాంకుల ఆర్థిక పరిస్థితి ఉండదని తెలిపింది. అటు కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ కూడా డిపాజిటర్లు ఆందోళన చెందవద్దని సూచించారు. బ్యాంకుల్లో సొమ్ము భద్రతను అంచనా వేసేందుకు వాటి మార్కెట్ క్యాప్ సరైన కొలమానం కాదని స్పష్టం చేశారు.

**మాకు రూ. 662 కోట్లు రావాలి: ఇండియాబుల్స్ హౌసింగ్**

యస్ బ్యాంక్ నుంచి తమకు రూ. 662 కోట్లు రావాల్సి ఉందని ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ వెల్లడించింది. బ్యాంక్ బాండ్లలో ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేశామని, టర్మ్ లోన్‌ల రూపంలో బకాయిలేమీ లేవని పేర్కొంది. బ్యాంకు విలువ 10 బిలియన్ డాలర్ల పైగా ఉన్నప్పుడు.. 2017లో అదనపు టియర్ 1 (ఏటీ–1) బాండ్లలో ఇన్వెస్ట్ చేసినట్లు తెలిపింది.

### డొల్ల కంపెనీలతో ముడుపుల మళ్లింపు...

రుణాల మంజూరుకు ప్రతిగా లభించిన ముడుపులను డజను పైగా డొల్ల కంపెనీల ద్వారా రాణా కపూర్ కుటుంబం దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ. 2,000 కోట్ల పెట్టుబడులు, అత్యంత ఖరీదైన 44 పెయింటింగ్స్.. వాటి వెనుక ఆర్థిక లావాదేవీలపై ఈడీ కూపీ లాగుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈడీ వర్గాల కథనం ప్రకారం .. డీహెచ్‌ఎఫ్‌ఎల్ డిబెంచర్లలో యస్ బ్యాంక్ రూ. 3,700 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఈ క్రమంలో కపూర్ కుటుంబానికి చెందిన డూఇట్ అర్బన్ వెంచర్స్ అనే సంస్థలోకి డీహెచ్‌ఎఫ్‌ఎల్ నుంచి దాదాపు రూ. 600 కోట్లు వచ్చాయి. డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు రుణాలిచ్చినందుకు గాను కపూర్ కుటుంబానికి ఇవి ముడుపుల రూపంలో లభించి ఉంటాయని అనుమానాలు ఉన్నాయి. వీటన్నింటినీ ధృవీకరించుకోవడానికి కపూర్ కుటుంబ సభ్యులను కూడా విచారణ చేయాల్సి ఉందంటూ న్యాయస్థానానికి ఈడీ తెలిపింది. డీహెచ్‌ఎఫ్‌ఎల్ డిఫాల్ట్ అయినప్పటికీ.. రుణాలను రాబట్టుకోవడానికి యస్ బ్యాంక్ చర్యలూ తీసుకోకపోవడం అనుమానాలకు ఊతమిస్తోందని పేర్కొంది. అయితే, తాము విచారణకు పూర్తిగా సహకరిస్తున్నామని.. కావాలనే కపూర్‌ను టార్గెట్ చేసుకున్నారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. డూఇట్ కంపెనీ తన ఇద్దరు కుమార్తెల పేరు మీద ఉందని కపూర్ తెలిపారు. డీహెచ్‌ఎఫ్‌ఎల్‌కు ట్రిపుల్ ఏ రేటింగ్ ఉన్నప్పుడు యస్ బ్యాంక్ రూ. 3,700 కోట్లు రుణమిచ్చిందని, ఆ తర్వాత దాన్నుంచి డూఇట్ కంపెనీ రూ. 600 కోట్లు రుణం రూపంలో తీసుకుందని వివరించారు. ఇప్పటికీ డూఇట్ సంస్థ రుణాలను చెల్లిస్తూనే ఉందని, డిఫాల్ట్ కాలేదని చెప్పారు.



# వారంలో మూడుగంటలే!

**ప్రతిపక్షాల ఆందోళనలతో రాజ్యసభకు తీవ్ర అంతరాయం**

**న్యూఢిల్లీ:** బడ్జెట్ మలి విడత సమావేశాలు మొదలైన మొదటి వారంలో రాజ్యసభ మూడు గంటలు మాత్రమే సవ్యంగా సాగింది. ఈశాన్య ఢిల్లీ అల్లర్లపై చర్చ జరగాలంటూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనలతోనే సమయమంతా గడిచిపోయింది. షెడ్యూల్ ప్రకారం సభ 28.30 గంటలపాటు జరగాల్సి ఉండగా 26 గంటలపాటు అంతరాయం కలిగిందని, కేవలం 2.42 గంటలపాటు మాత్రమే కార్యకలాపాలు సాగాయని రాజ్యసభ వర్గాలు తెలిపాయి. సమావేశాలు 9.50 శాతమే ఫలప్రదమయ్యాయని పేర్కొన్నాయి. దీంతోపాటు, ఫిబ్రవరి 12, మార్చి 1వ తేదీల మధ్య జరిగిన స్టాండింగ్ కమిటీల సమావేశాలకు సగం మంది ఎంపీలు మాత్రమే హాజరయ్యారని వెల్లడించాయి.



నారీశక్తి పురస్కారం అందుకున్న కేరళకు చెందిన కాత్యాయనీ అమ్మ నుంచి ఆశీర్వాదం అందుకుంటున్న ప్రధాని మోదీ

# ప్రధాని సోషల్ ఖాతాలు ఆ ఏడుగురికి

- సామాజిక మాధ్యమాల వేదికగా స్ఫూర్తిని నింపిన మహిళా శక్తి
- ఏడుగురిలో హైదరాబాద్‌కు చెందిన కల్పన కూడా...



స్నేహ మోహన్‌దాస్ | డాక్టర్ మాళవిక | ఆరిఫా జాన్ | కల్పన రమేష్ | విజయ పవార్ | కళావతి దేవి | వీణా దేవి

***మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందే చెప్పినట్టుగా ఆదివారం తన సోషల్ మీడియా ఖాతాలను ఏడుగురు మహిళలకు అప్పగించారు. "ఈ మహిళా దినోత్సవం నాడు నా సామాజిక మాధ్యమాల ఖాతాలను ఎవరి జీవితాలైతే అందరిలోనూ స్ఫూర్తిని రగిలిస్తాయో ఆ శక్తిమంతమైన ఏడుగురు మహిళలకి అప్పగిస్తున్నాను. ఇలా చేయడం వల్ల వారు చేస్తున్న సామాజిక సేవ లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తుంది. ఈ రోజంతా నేను నా అకౌంట్ల నుంచి తప్పకుంటాను. ఆ ఏడుగురు మహిళలు వారి జీవిత ప్రయాణాన్ని నా అకౌంట్ల ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తారు. మీతో చర్చలు జరుపుతారు"అని ట్వీట్ చేసిన ప్రధాని తన ఖాతాలను వారికి అప్పగించారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన కల్పన రమేష్ అనే మహిళ కూడా ఉండటం విశేషం. ఆ ఏడుగురు మహిళలెవరో వారు సమాజానికి చేస్తున్నదేంటో చూద్దాం..***

– న్యూఢిల్లీ

## స్నేహ మోహన్‌దాస్, చెన్నై

ఆమె అందరికీ అమ్మయింది. ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెడితే అమ్మనే అంటాం కదా. ఆకలి కేకలు ఎంతటి దుర్భరమైనవో గ్రహించి ఫుడ్‌బ్యాంక్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ఆకలితో ఉన్నవారి కడుపు నింపుతున్నారు. ప్రతీరోజూ ఒకరి ఆకలి తీర్చి, ఆహార వృథాను అరికట్టగలిగితే ఈ దేశంలో ఆకలికేకలు వినిపించవని స్నేహ మోహన్‌దాస్ చెబుతున్నారు. ఈ విషయంలో అందరూ చేతులు కలపాలంటూ ప్రధాని అకౌంట్ ద్వారా ఆమె పిలుపునిచ్చారు. ఈ సంస్థను స్థాపించాలని స్నేహలో స్ఫూర్తిని నింపింది ఎవరో తెలుసా? స్నేహను కన్న అమ్మే. అమ్మలకే కదా బిడ్డల ఆకలి తెలిసేది.

## డాక్టర్ మాళవిక అయ్యర్

తమిళనాడుకి చెందిన మాళవిక ఒక దివ్యాంగురాలు. 13 ఏళ్ల వయసులో రాజస్తాన్‌లో బికనీర్‌లో ఉన్నప్పుడు బాంబు పేలుళ్లలో ఆమె చేతులు కోల్పోయారు. కాళ్లు విరిగిపోయాయి. వంటినిండా ఫ్రాక్చర్లే. అయినా ఆమె ఏనాడూ ఆత్మ విశ్వాసాన్ని కోల్పోలేదు. కృత్రిమ చేతులతో అన్ని అడ్డంకుల్ని అధిగమించారు. ఆ చేతులతోనే పీహెచ్‌డీ రాశారు. డాక్టరయ్యారు. ఇప్పుడు సామాజిక కార్యకర్తగా పలువురిలో స్ఫూర్తిని నింపుతున్నారు. జీవితం మనకేమిస్తుందో మన చేతుల్లో లేదు. కానీ అది ఏమిచ్చినా దానిని అంగీకరించి ముందుకు అడుగు వెయ్యడమే మనం చెయ్యాల్సిన పని. జీవితం పట్ల మన దృక్పథాన్ని మార్చుకుంటే, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోగలం అంటూ మాళవిక తనని తాను పరిచయం చేసుకున్నారు. ఈ పురస్కారం ఆమెను కూడా వరించింది.

## ఆరిఫా జాన్, కశ్మీర్

కశ్మీర్‌లో సంప్రదాయమైన చేతివృత్తుల్ని పునరుద్ధరించి, వాటికో బ్రాండ్ కల్పించడానికి కృషి చేస్తున్నారు ఆరిఫా. శ్రీనగర్‌కు చెందిన ఈ మహిళ నంధా అని పిలిచే చేతివృత్తుల కళను పునరుద్ధరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనివల్ల స్థానికంగా ఉండే మహిళా కళాకారులకు సాధికారత వస్తుందని ఆమె అంటున్నారు. సంప్రదాయానికి ఆధునికత జోడిస్తే అద్భుతాలు సృష్టించవచ్చునని ఆరిఫా ధీమాగా చెబుతున్నారు. కశ్మీర్ చేతివృత్తులపై మహిళలకు శిక్షణనివ్వడమే కాకుండా వారి వేతనాలను రోజుకి రూ.175 నుంచి రూ. 450కి పెంచారు.

## కల్పన రమేష్, హైదరాబాద్

వృత్తిపరంగా ఆమె ఒక ఆర్కిటెక్ట్. కానీ ఆమె తన జీవితాన్ని నీటి సంరక్షణకే అంకితం చేశారు. టెడ్‌ఎక్స్ స్పీకర్... తాను డిజైన్ చేసిన నీటి సంరక్షణని ఆమె విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వచ్చే తరాలకు నీటి సమస్య రాకుండా ఉండడానికే తాను ఈ అంశంపై దృష్టి సారించినట్టు కల్పన చెప్పారు. ఒక్కోసారి చిన్ని చిన్ని పనులే అతి పెద్ద ప్రభావాన్ని చూపిస్తాయి. సహజసిద్ధంగా మనకు లభించిన అత్యంత విలువైనవి నీళ్లే. వాటిని ఇష్టారాజ్యంగా వృథా చేయకుండా బొట్టు బొట్టు ఒడిసిపట్టుకోవాలి. చెరువుల్ని కాపాడుకోవాలి. వినియోగించిన నీటిని రీ సైకిల్ చేసి మళ్లీ వాడుకోవాలన్న అవగాహన పెంచాలని ఆమె ట్వీట్ చేశారు. సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ ఎండీవర్ (సాహె) సంస్థను స్థాపించి వాననీటి సంరక్షణ కోసం కృషి చేస్తున్నారు.

## కళావతి దేవి, కాన్పూర్

మోదీ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌కి చెందిన కళావతి దేవి ప్రజల్లోకి బాగా తీసుకెళ్తున్నారు. బహిరంగ మల విసర్జనకు వ్యతిరేకంగా ఆమె విస్తృతంగా పోరాడుతున్నారు. కాన్పూర్ చుట్టుపక్కల 4 వేలకుపైగా టాయిలెట్లు నిర్మించి పరిసరాల పరిశుభ్రతపై మహిళల్లో అవగాహన పెంచుతున్నారు. ఆమెకి భర్తలేడు. తన కూతురు, వారిద్దరి పిల్లల పోషణ బాధ్యత ఆమె మీదే ఉంది. అల్లుడు కూడా మరణించడంతో కూతురి కుటుంబం బాధ్యతలు కూడా ఆమే తీసుకున్నారు. అయినా ఏనాడూ ఆమె బహిరంగ మల విసర్జనను మాన్పించాలన్న తన లక్ష్యంపై వెనకడుగు వెయ్యలేదు.

## వీణా దేవి, బిహార్

ఆమె పేరు చెబితే ఎవరని అడుగుతారేమో కానీ మష్రూమ్ మహిళ అంటే రాష్ట్రంలో ఎవరైనా ఇట్టే గుర్తు పట్టేస్తారు. బిహార్‌లో ముంగూర్ జిల్లాకు చెందిన వీణా దేవి పుట్టగొడుగుల సాగుతో పేరు ప్రఖ్యాతులు సాధించారు. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలైన బెల్హార్‌లో మహిళా రైతులకు పుట్టగొడుగుల్ని సాగు చేయడంలో మెళకువలు నేర్పించి వారి ఆర్థిక స్థితిగతుల్ని పెంచారు. ఆమె ప్రభావంతో ముంగూర్ జిల్లాలోని 105 గ్రామాల్లో ఎందరో మహిళలు పుట్టగొడుగులను సాగు చేస్తున్నారు. సేంద్రియ వ్యవసాయంపైనా రైతులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

## విజయ పవార్, మహారాష్ట్ర

మహారాష్ట్రకు చెందిన విజయ పవార్ బంజారా చేతివృత్తుల మహిళలతో కలిసి రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. మహారాష్ట్రలోని గ్రామీణ గోర్మతి కళలో నిపుణులైన మహిళల్ని ప్రోత్సహిస్తూ వారి తయారు చేసిన ఉత్పత్తుల్ని విక్రయించడానికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు. 90 స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి విజయ పవార్ ఈ కళని ప్రోత్సహిస్తున్నారు. బంజారా హ్యాండీక్రాఫ్ట్స్ అంతగా విజయవంతం కాని కళారూపంగా ఉందని, దానిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె తన ట్వీట్‌లో తెలిపారు.

# 15 మందికి నారీ శక్తి పురస్కారాలు

**ప్రదానం చేసిన రాష్ట్రపతి కోవింద్ • ఏపీకి చెందిన భూదేవికి కూడా...**



నారీశక్తి పురస్కార విజేతలతో ప్రధాని మోదీ గ్రూప్ ఫొటో

**సాక్షి, న్యూఢిల్లీ:** పోడు వ్యవసాయంలోనూ, గ్రామీణ మహిళల వికాసంలో ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పడాల భూదేవి, 93 ఏళ్ల వయసులో కెరీర్ ఆరంభించి చండీగఢ్ అద్భుతంగా పేరు సంపాదించి, ఎన్నో అవార్డులు రివార్డులు సాధించిన శతాధిక వృద్ధ అథ్లెట్, మష్రూమ్ మహిళ, జార్ఖండ్ లేడీ టార్జాన్ సహా 15 మంది 2019 సంవత్సరానికిగాను నారీ శక్తి పురస్కారాలను గెలుచుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఈ అవార్డులను వారికి ప్రదానం చేశారు. మహిళా సాధికారత, సామాజిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సమాజంలో సానుకూల మార్పుల్ని తీసుకువచ్చే మహిళలకు ఏటా మహిళా శక్తి పురస్కారాలు అందజేస్తారు. బహుమతి గ్రహీతల్లో శ్రీకాకుళంకు చెందిన పడాల భూదేవితో పాటు వీణా దేవి (40–బీహార్), అరిఫా జాన్ (33–శ్రీనగర్, జమ్మూ కశ్మీర్), చామి ముర్మూ (47–జార్ఖండ్), నిలజా వాంగ్మో (40–లేహ్), రష్మీ ఊర్ధ్వదేశ్ (60–పుణే, మహారాష్ట్ర), మాన్ కౌర్ (103–పాటియాలా, పంజాబ్), కళావతీ దేవీ (68–కాన్పూర్, ఉత్తరప్రదేశ్), తాషి, నుంగ్షీ (కవలలు) (28–డెహ్రాడూన్ – ఉత్తరాఖండ్), కౌషికి చక్రవర్తి (38–కోల్‌కతా, పశ్చిమబెంగాల్), అవని చతుర్వేది, భావనాకాంత్, మోహనాసింగ్ (వాయుసేన మొదటి మహిళా పైలెట్లు), భగీరథి అమ్మా (105)– కాత్యాయని(98) (అలప్పుజ–కేరళ)లు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

**పౌష్టికాహార లోపాల్ని నివారించండి: ప్రధాని**

నారీశక్తి అవార్డు పొందిన 15 మందిలో 14 మందితో ప్రధాని మోదీ తన నివాసంలో ముచ్చటించారు. పిల్లల్లో, మహిళల్లో ఉన్న పౌష్టికాహార లోపాల్ని నివారించడం, నీటిని బొట్టు బొట్టు సంరక్షించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ నారీ మణులు సాధించిన లక్ష్యాలు కేసు స్టడీలుగా యూనివర్సిటీలకు ఉపయోగపడతాయని కొనియాడారు. అవార్డు గ్రహీతల్లో కశ్మీర్‌కు చెందిన ఆరిఫా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంటర్నెట్‌పై నిషేధం తమ వ్యాపారాన్ని దెబ్బ తీస్తోందని ప్రధాని దృష్టికి తెచ్చారు.

## భూదేవి విజయగాథ

ముగ్గురు ఆడపిల్లల తల్లినని తాను ఏనాడూ చింతించ లేదని భర్త వదలి వేస్తే కన్న వారింటిలో ఉండి గ్రామీణ, గిరిజన మహిళల వికాసానికి నడుం కట్టానని నారీశక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి అన్నారు. ఆమె అవార్డు అందుకున్న అనంతరం ప్రధాని మోదీ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో తన అనుభవాలను వివరించారు. గిరిజనుల్లో సవర తెగకు చెందిన తనకు చిరుప్రాయంలోనే వివాహమైతే ముగ్గురూ ఆడపిల్లలనే కన్నానని మెట్టినింటి వారు బయటకు పంపేశారన్నారు. తండ్రి చాటు బిడ్డగా పొలం పనిని నేర్చుకున్నానని, తనలాంటి వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నానన్నారు. 1–70 గిరిజన చట్టంలోని హక్కులు, మహిళా హక్కులను గురించి సభల్లో తెలుసుకున్నానని ఆ చట్టం కింద మహిళలను పెద్ద సంఖ్యలో సమీకరించి కొన్ని వేల ఎకరాల పోడు భూమిని సేకరించి చిరుధాన్యాల సాగుకు పూనుకున్నామన్నారు. పంటను మార్కెట్‌కు పంపితే డబ్బులు వస్తాయి కానీ పౌష్టికాహారం అందదు, అందుకే వాల్యూ అడిషన్‌ను చేకూర్చాలని నిర్ణయించాము. కంపెనీలను ఏర్పాటు చేసి చిరుధాన్యాలను పొడిగా మార్చి మార్కెటింగ్ చేయడం, బిస్కెట్లుగా తయారు చేయడం వంటివి మొదలు పెట్టాము. ఈరోజు తాము 15,000 మంది ఐసీడీఎస్ పథకం కింద ఉన్న బాలబాలికలకు (3–4 ఏళ్లలోపు) బిస్కెట్లు సరఫరా చేసి పౌష్టికాహారం అందజేయగలుగుతున్నాము. కలెక్టర్ సహకారంతో పంటలను మార్కెటింగ్ చేసుకోగలుగుతున్నాము. రైతుల అభివృద్ధే దేశాభివృద్ధి అని ఆమె వివరిస్తుండగా ప్రధాని అభినందించారు. భూదేవి తాను ప్రసంగించేటపుడు తనకు హిందీ రాదని అయినా హిందీలోనే చెప్పడానికి ప్రయత్నిస్తాననన్నారు. ఆమె చక్కగా హిందీ , కొన్ని ఇంగ్లీషు పదాలతో కలగలిపి చేసిన ప్రసంగం ప్రధానిని హత్తుకుంది. మీరు హిందీ చాలా బాగా మాట్లాడారు. మాట్లాడలేననే చింత వద్దు అని అన్నారు.



## హైదరాబాద్ పారిశ్రామికవేత్తకు అవార్డు



**సాక్షి, న్యూఢిల్లీ:** హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త ప్రత్యూష పారెడ్డికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నీతీ ఆయోగ్ మహిళా అవార్డును ప్రదానం చేశారు. ఆదివారమిక్కడ నీతీ ఆయోగ్ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'విమెన్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా'–2019 సంవత్సరానికి గాను ఈ అవార్డులను అంద జేశారు. భారత్‌లో మార్పును తెస్తున్న మహిళలు అనే అంశం కింద 16 మందిని ఎంపిక చేశారు. 2017లో నెమో కేర్ అనే స్టార్టప్ కంపెనీని ప్రారంభించిన ప్రత్యూష పారెడ్డి శిశు మరణాలను తగ్గించడానికి విశేషంగా కృషి చేశారు. నవజాత శిశువుల ఆరోగ్యం పట్ల బాగా శ్రద్ధ తీసుకునే కార్యక్రమాలు చేపట్టారు. రక్షణ మంత్రి ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ నేత హెచ్ఆర్ భరద్వాజ్ కన్నుమూత



**న్యూఢిల్లీ:** మాజీ న్యాయ శాఖ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత హన్స్‌రాజ్ భరద్వాజ్ (83) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. కిడ్నీసంబంధిత వ్యాధితో గత బుధవారం ఢిల్లీలోని మాక్స్ ఆస్పత్రిలో చేరిన ఆయన గుండెపోటుతో మృతిచెందారని వైద్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు నిఘమ్‌బోధ్‌ఘాట్ వద్ద అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుమారుడు అరుణ్ భరద్వాజ్ చెప్పారు. భరద్వాజ్ మృతిపై ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందని చెప్పారు.కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కూడా ఆయన మృతిపై స్పందించారు. గతంలో ఆయనతో కలసి పార్లమెంటుకు హాజరైన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. భరద్వాజ్ గతంలో కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు.



# ఢిల్లీలో ఆత్మాహుతి దాడులకు కుట్ర

**ఐసిస్‌తో సంబంధం ఉన్న దంపతుల అరెస్టు**

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఆత్మాహుతి దాడులు నిర్వహించాలనుకున్న జంటను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరికి ఉగ్రసంస్థ ఐసిస్‌కు చెందిన అఫ్గానిస్తాన్‌లోని సీనియర్ నేతలతో విభాగంతో సంబంధాలు ఉన్నాయని పోలీసులు అభియోగాలు మోపారు. కశ్మీర్‌కు చెందిన జహన్‌జెబ్ సమీ అతడి భార్య హినా బషీర్ బైగ్‌లను ఆదివారం ఉదయం ఢిల్లీలో అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరిద్దరూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరపట్టికలకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసినట్లు గుర్తించామన్నారు. అంతేగాక ఢిల్లీలో పలు చోట్ల ఆత్మాహుతి దాడులకు సిద్ధమయ్యారని, ముస్లిం యువకులను ఉగ్రవాదం వైపు ఆకర్షింపజేసేలా ప్రయత్నాలు సాగిస్తున్నారని వెల్లడించారు. ఇటీవల సీఏఏ నిరసనలకు కేంద్రంగా నిలిచిన జామియా యూనివర్సిటీ దగ్గరలోనే వీరు నివాసముంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అల్లర్లలో వీరి పాత్ర కూడా ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.

# భారత్ @ 39

- కేరళలో మరో 5 కోవిడ్ కేసులు
- అమెరికా అధ్యక్షుడి భేటీకి హాజరైన వ్యక్తికి సోకిన వైరస్
- చైనాలో కోవిడ్ ఆస్పత్రి భవనం కూలి 10 మంది మృత్యువాత

**న్యూఢిల్లీ/తిరువనంతపురం/వాషింగ్టన్/బీజింగ్:** దేశంలో కోవిడ్ బాధితుల సంఖ్య అనూహ్యంగా 39కు చేరుకుంది. కేరళకు చెందిన ఓ కుటుంబం ఇటీవల ఇటలీ నుంచి వచ్చింది. వీరు ఎయిర్‌పోర్టులో అధికారులకు తప్పుడు సమాచారం అందించి, స్క్రీనింగ్ టెస్ట్‌ను తప్పించుకున్నారు. అప్పటికే వ్యాధి సోకిన వీరి ద్వారా మరో ఇద్దరికి వైరస్ వ్యాపించడంతో కేరళలో బాధితుల సంఖ్య 5 అయింది. దీంతో దేశవ్యాప్తంగా కోవిడ్ బాధితుల సంఖ్య (16 మంది ఇటాలియన్లతో కలుపుకుని) 39 అయింది. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్‌లతోపాటు, ఝుజ్జర్‌లోని నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్, పుదుచ్చేరిలోని జిప్మెర్‌లో ఐసోలేషన్ బెడ్లను ప్రభుత్వం పెంచనుంది. రక్త పరీక్షల కోసం 52 లేబొరేటరీలను ఏర్పాటు చేసినట్లు కేంద్రం తెలిపింది.

**కేరళ ప్రభుత్వం అప్రమత్తం**

తాజా పరిస్థితులపై కేరళ ఆరోగ్యమంత్రి శైలజ మీడియాతో మాట్లాడారు. పత్తనంతిట్ట జిల్లాకు చెందిన దంపతులు, తమ కుమారుడితో ఇటీవల ఇటలీ వెళ్లారు. వారు దోహా మీదుగా ఇటీవల కొచి చేరుకున్నారు. విమానాశ్రయంలో అధికారులకు తప్పుడు సమాచారమిచ్చి, స్క్రీనింగ్ పరీక్షల నుంచి తప్పించుకున్నారు. అప్పటికే వైరస్ బారిన పడిన వీరి ద్వారా కుటుంబసభ్యులిద్దరికి వ్యాధి సోకింది. సహకరించకపోవడంతో బలవంతంగానే వీరిని ఆస్పత్రులకు తరలించాం. వీరి పరిస్థితి నిలకడగా ఉంది' అని మంత్రి తెలిపారు. ఇలా ఉండగా, మస్కట్ నుంచి తమిళనాడుకు చేరుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు కోవిడ్ సోకినట్లు పరీక్షల్లో తేలింది. అమెరికా నుంచి చెన్నై వచ్చిన 15 ఏళ్ల బాలుడిలోనూ వైరస్ లక్షణాలున్నట్లు అనుమానిస్తున్నారు.

**లాటిన్ అమెరికాలో మొదటి మరణం**

ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ బాధిత 95 దేశాలకు చెందిన 3,595 మంది చనిపోగా బాధితుల సంఖ్య 105,836కు చేరుకుంది. చైనా (3,097 మరణాలు, 80,695 కేసులు) ఆ తర్వాత దక్షిణ కొరియా(48 మరణాలు, 7,134 కేసులు), ఇరాన్(194 మర ణాలు, 6,566 కేసులు), ఫ్రాన్సు (16 మృతులు, 949 కేసులు) ఉన్నాయి. అమెరికాలో కోవిడ్‌తో 17 మంది చనిపోగా 420 కేసులు బయటపడ్డాయి. అర్జెంటీనాలో మొదటి మరణం సంభవించింది. బల్గేరియా, పరాగ్వే తదితర దేశాల్లో నూ కోవిడ్ బాధితులను గుర్తించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత నెలలో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న ఓ వ్యక్తికి కోవిడ్ సోకినట్లు పరీక్షల్లో తేలింది.



**కూలిన 'కోవిడ్' భవనం**

చైనాలో కోవిడ్ అనుమానితులను ఉంచిన ఆస్పత్రి శనివారం కూలడంతో 10 మంది చనిపోయారు. ఫుజియాన్ ప్రావిన్సు క్వాంగ్‌ఝౌ నగరంలోని ఓ హోటల్‌ను ప్రభుత్వం ఆస్పత్రిగా మార్చివేసి అందులో కోవిడ్ అనుమానితులను క్వారంటైన్‌లో ఉంచారు. 80 గదులున్న ఈ భవనం శనివారం అకస్మాత్తుగా కూలిపోవడంతో 10 మంది చనిపోయారు. సహాయక సిబ్బంది 50 మందిని రక్షించారు. కొందరు శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నారు.

**ఇటలీ అష్టదిగ్బంధనం**

ఇటలీలో ఒక్కరోజే 133 మంది మరణించటంతో మృతుల సంఖ్య 366కు చేరుకుంది. అదేవిధంగా మొత్తం కేసులు 5,883 అయ్యాయి. దీంతో ఇటలీ ప్రభుత్వం తీవ్ర చర్యలు చేపట్టింది. ఉత్తర ఇటలీ ప్రాంతంలోకి ఏప్రిల్ 3వ తేదీ వరకు రాకపోకలను నిషేధించింది. దీంతో దాదాపు 1.50 కోట్ల మందిని దిగ్బంధనంలో ఉంచినట్లయింది. సినిమా హాళ్లు, థియేటర్లు, మ్యూజియంలను మూసివేసింది. పోప్ ఫ్రాన్సిస్ సెయింట్ పీటర్స్ బసిలికా చర్చి కిటికీ నుంచి చేసే ఎంజెలస్ ప్రేయర్‌ను వాటికన్ సిటీ ఆదివారం లైవ్‌లో ప్రసారం చేసింది.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, (R&B) డివిజన్ : జోగులాంబ గద్వాల్
ఇ–ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
NIT No. DB/HD/JGDL/2019-20 తేది: 06.03.2020
పనుల సంఖ్య (2). పనుల పేరు: గద్వాల సెక్షన్ ప్యాకేజ్ – I & II కు సంబంధించిన (R&B) రోడ్లకు AM, (3వ పిలుపు). మొత్తం ECV: రూ. 19.66 లక్షలు. ఆన్‌లైన్ టెండర్ల స్వీకరణకు చివరి తేదీ/సమయం: 17.03.2020 మ. 3.30 గం. ఆన్‌లైన్ టెండర్లు తెరుచు తేదీ/సమయం: 18.03.2020 సా. 4.00 గం. తదుపరి వివరాలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.eprocurement.gov.in లో చూడవచ్చును. సెల్ నం. 9440718531.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, R&B డివిజన్, జోగులాంబ గద్వాల్
DIPR RO.No. 2618-DP/CL/ADVT/1/2019-20; Dt : 07.03.2020

भारतीय विज्ञान शिक्षा एवं अनुसंधान संस्थान बरहमपुर
IISER Indian Institute of Science Education and Research Berhampur
Established by the Ministry of HRD, Govt. of India
Notice for PhD Admissions
Applications are invited from highly motivated and research-oriented candidates for admission to **PhD programme** for the semester commencing from July 2020.
**Disciplines:** Biological Sciences, Chemical Sciences, Mathematical Sciences and Physical Sciences.
For details, visit: **www.iiserbpr.ac.in**
Last Date for Receipt of Application: April 30, 2020
IISERBPR/DoAA/PhD/2020/1 Dean, Academic Affairs

COIR BOARD
Ministry of MSME, Govt. of India, M.G.Road, Kochi -682 016
కాయర్ బోర్డు
(సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
తేది : 01.04.2020 నుండి ప్రారంభించబోయే కాయర్ టెక్నాలజీలో 15 నెలలు డిప్లొమా కోర్సు శిక్షణ (అంతర్గత శిక్షణ 12 నెలలు మరియు ఇంటర్న్‌షిప్ శిక్షణ 3 నెలలు) కొరకు 18–55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత కలిగిన స్త్రీ/పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. శిక్షణా కాలము నందు నెలకు రూ. 3000/–లు స్టైపండ్ ఇవ్వబడును. 20% సీట్లు ఎస్సీ / ఎస్టీలకు కేటాయించడమైనది. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ వివరములు మొదలగునవి జతపరిచిన దరఖాస్తులు 20.03.2020 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడును. దరఖాస్తులు స్వయంగా కాని లేదా పోస్ట్ ద్వారా గాని లేదా ఇ–మెయిల్ : coirboardrorjy@yahoo.co.in ద్వారా గాని దిగువ తెలిపిన కార్యాలయం నందు సమర్పించవలెను. పూర్తి వివరములు www.coirboard.gov.in నందు లభించును.
ఇట్లు : ప్రాంతీయ అధికారి, ప్రాంతీయ కార్యాలయం, కాయర్ బోర్డు, ధవళేశ్వరం రోడ్, స్వరాజయ నగర్, రాజమహేంద్రవరం – 533 101. ఫోన్ నంబరు : 91-883-2420196
davp 25131/11/0004/1920 సం/– సెక్రటరీ




రవీంద్రభారతిలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు

## అవార్డుల వేడుక

మహిళలకు ఈ సందర్భంగా అవార్డులను అందజేసి సత్కరించారు. అవార్డులను అందుకున్న మహిళలతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మహిళా సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్.

*- హైదరాబాద్*



హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు సన్మానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. *-సాక్షి, హైదరాబాద్*

## గవర్నర్ హోలీ శుభాకాంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ రంగుల పండుగ అని, ఇది మనుషుల మధ్య బంధాలు బలోపేతం చేయడంతోపాటు సమాజంలో శాంతి, సోదరభావం వెల్లివిరియడానికి దోహదపడు తుందని అన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టివేత

**శంషాబాద్:** రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని తనిఖీ చేయగా అతడు తీసుకొచ్చిన మిక్సర్ గ్రైండర్‌లో 932 గ్రాముల బంగారం బయటపడింది. సదరు ప్రయాణికుడిని హైదరాబాద్‌కు చెందిన ప్రేమ్‌చంద్ గుప్తాగా గుర్తించిన అధికారులు అతని దగ్గర నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## షహీన్‌బాగ్ మహిళలకు మద్దతుగా..

**న్యూఢిల్లీ:** గత 85 రోజులుగా షహీన్‌బాగ్‌లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరపట్టిక (ఎన్నార్సీ)లకు వ్యతిరేకంగా మహిళలు చేస్తున్న నిరసనలకు మద్దతుగా.. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు షహీన్‌బాగ్‌కు తరలివచ్చారు. లక్నో నుంచి వచ్చిన మహిళలు ధర్నాలో పాల్గొన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్, హిందుస్తాన్ జిందాబాద్ నినాదాలతో హోరెత్తించారు. ఢిల్లీ మహిళలు చేస్తున్న నిరసనలకు తాము అండగా ఉన్నామంటూ భరోసా ఇచ్చారు.

# మారుతిరావు ఆత్మహత్య

**ప్రణయ్ హత్యకేసులో ప్రధాన నిందితుడు ● విషం తాగి హైదరాబాద్‌లోని వైశ్యభవన్‌లో బలవన్మరణం**

**హైదరాబాద్:** సంచలనం సృష్టించిన మిర్యాలగూడ ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అమృత తండ్రి మారుతిరావు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. న్యాయవాదిని కలవడానికి నగరానికి వచ్చి న ఆయన ఖైరతాబాద్‌లోని వైశ్యభవన్‌లో బసచేశారు. ఆదివారం తాను ఉంటున్న గదిలో విగతజీవిగా కనిపించారు. ప్రాథమిక ఆధారాలను బట్టి ఆయన విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. మారుతిరావు బసచేసిన గదిలో సూసైడ్ నోట్ లభ్యమైంది.

**న్యాయవాదిని కలుస్తానని నగరానికి..**

మారుతిరావు న్యాయవాదిని కలిసివస్తానని కుటుంబసభ్యులకు చెప్పి శనివారం తన వాహనంలో డ్రైవర్ బెల్లంకొండ రాజేష్‌తో కలిసి నగరానికి వచ్చారు. ఖైరతాబాద్ చింతల్‌బస్తీలోని ఆర్యవైశ్య భవన్‌కు వచ్చిన ఆయన మూడో అంతస్తులోని 306 నంబర్ గదిలో బస చేశారు. న్యాయవాది వస్తారని డ్రైవర్‌తో చెప్పిన మారుతిరావు, డ్రైవర్‌ను కారులోనే ఉండమన్నారు. అనంతరం డ్రైవర్‌ను పిలిచి ఎదురుగా ఉన్న మిర్చిబండి నుంచి గారెలు, కారులో ఉన్న కాగితాలు తేవాలని చెప్పారు. అవి తీసుకున్న మారుతిరావు.. అన్నం తిని కారులోనే పడుకోవాలని డ్రైవర్‌కు చెప్పి తన గదికి వెళ్లిపోయారు. రాత్రి 9 గంటలకు గదిలో ఏసీ పని చేయట్లేదని వైశ్యభవన్ రిసెప్షన్‌కు ఫోన్ చేయడంతో సిబ్బంది మరమ్మతులు చేసి వెళ్లారు. తర్వాత ఆయన గది తలుపులు వేసుకున్నారు.

**తెల్లారేసరికి విగతజీవిగా..**

ఆదివారం ఉదయం మిర్యాలగూడ నుంచి గిరిజ తన భర్త మారుతిరావుకు ఫోన్‌చేయగా, స్పందించలేదు. దీంతో ఆమె డ్రైవర్‌కు ఫోన్‌చేసి చెప్పారు. డ్రైవర్.. మారుతిరావు గది వద్దకు చేరుకుని డోర్ కొట్టగా, తీయలేదు. అతను గిరిజకు ఫోన్‌చేసి చెప్పగా, ఆమె మరోసారి ప్రయత్నించాలని చెప్పారు. అయినా స్పందించకపోవడంతో రాజేష్ రిసెప్షన్‌లో ఉన్న వైశ్యభవన్ ఉద్యోగి మల్లికార్జున్‌కు చెప్పాడు.



మారుతిరావు మృతదేహం

ఆయన సైతం విఫలయత్నం చేసి.. విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనతో సైఫాబాద్ పోలీసులకు తెలిపారు. పోలీసులు మారుతిరావు గది డోర్‌ను గట్టిగా నెట్టడంతో లోపలి టవర్ బోల్ట్ ఊడి, తలుపు తెరుచుకుంది. గదిలో మంచంపై విగతజీవిగా పడి ఉన్న మారుతిరావును గుర్తించారు. అప్పటికే గిరిజ కొత్తపేటలో ఉండే మారుతిరావు సమీప బంధువు రఘుకు సమాచారమివ్వడంతో ఆయన అక్కడకు చేరుకున్నారు. పోలీసులు 108ను పిలిపించారు. ఆ సిబ్బంది మారుతిరావు మరణించినట్లు చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మారుతిరావు మరణాన్ని ధ్రువీకరించడంతో మార్చురీకి చేర్చారు.

**'అమృతా.. అమ్మ దగ్గరకు వెళ్లు'**

మారుతిరావు గదిలో సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో 'గిరిజా క్షమించు.. అమృతా అమ్మ దగ్గరకు రా అమ్మా' అని ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మారుతిరావు తీసుకున్న విషం తాలూకు ఆనవాళ్లు, డబ్బా, సీసా గదిలో లభించలేదు. దీంతో ఆయన మరో ప్రాంతంలో విషం తీసుకుని గదిలోకి వచ్చి ఉంటారని భావిస్తున్నారు. మారుతిరావు చనిపోయే ముందు తన రెండు చేతుల్నీ మూతి వద్దకు తీసుకువెళ్లడంతో అలానే ఉండిపోయాయి. విష ప్రభావాన్ని తట్టుకోలేక ఆయన అలా చేసి ఉంటారని, గదిలో వాంతులు సైతం చేసుకున్నారని పోలీసులు చెబుతున్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు వైశ్యభవన్‌కు వచ్చారు. పోలీసులు, క్లూస్‌టీం మారుతిరావు కారును, సెల్‌ఫోన్, బ్యాగులోని బట్టలు తదితరాలు పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు.

**మా కుటుంబానికి అన్యాయం జరిగింది..**

మారుతిరావు కొన్ని రోజులుగా ముభావంగా ఉంటున్నారని, వైశ్యభవన్‌కు వచ్చిన ప్రతిసారీ తన డ్రైవర్‌కు కూడా గది తీసుకునే వారని తెలిసింది. ఈసారి అలా చేయకపోవడంతో ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతోనే ఉన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, భర్త మృతదేహాన్ని చూసిన గిరిజ కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పటికే కూతురు దూరమైందని, ఇప్పుడు భర్త ఆత్మహత్యతో తమకుటుంబానికి అన్యాయం జరిగిందని విలపించారు. మీడియాలో విస్తృత ప్రచారం వల్లే తమకీ దుస్థితి వచ్చిందని మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోదరుడు శ్రావణ్ మీడియాతో మాట్లాడుతూ.. వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని, ఊహాకల్పనలతో రాయవద్దని కోరా రు. చివరిసారిగా మారుతిరావుతో గత మే 17న మాట్లాడానని తెలిపారు. కేసుల విషయంలో మారుతిరావుపై పోలీసులు ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఉస్మానియా మార్చురీలో మారుతిరావు మృతదేహానికి పోస్టుమార్టం పరీక్షలు నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అక్కడి నుంచి స్వస్థలం మిర్యాలగూడకు తరలించారు. మారుతిరావు శరీరం నుంచి సేకరించిన విస్రాను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నారు. ఆ నివేదికలు వస్తేనే మారుతిరావు ఏ విషం తాగారన్నది తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

**నాడేం జరిగిందంటే..**

తన కుమార్తె అమృతను ప్రేమించి, కులాంతర వివాహం చేసుకున్నాడని 2018 సెప్టెంబర్ 14వ తేదీన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్ అనే యువకుడిని మారుతిరావు కిరాయి రౌడీలతో హత్య చేయించినట్లు కేసు నమోదైంది. పోలీసులు అరెస్టు చేయడంతో మారుతీరావు 7 నెలలపాటు జైలులో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇటీవల మిర్యాలగూడలో మారుతిరావుకు చెందిన ఓ షెడ్డులో గుర్తుతెలియని మృతదేహం లభించడం కలకలం రేపింది. ఈ పరిస్థితుల్లో మారుతిరావు బలవన్మరణానికి పాల్పడటం సంచలనం రేపుతోంది. ప్రణయ్ హత్య కేసులో శిక్ష తప్పదనే ఆందోళనతోపాటు తన ఆస్తుల వ్యవహారంలో కుటుంబ సభ్యులతో గొడవల వల్ల మారుతిరావు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది.

## చనిపోయినట్లు తెలియదు



**మిర్యాలగూడటౌన్:** తన తండ్రి మారుతిరావు చనిపోయిన విషయం తెలియదని, ఆయన కుమార్తె, ప్రణయ్ భార్య అమృత మీడియాకు తెలిపింది. మారుతిరావు హైదరాబాద్‌లో మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మీడియా ప్రతినిధులు ఆదివారం ఉదయం మిర్యాలగూడలో పెరుమాళ్ల ప్రణయ్ నివాసం వద్దకు చేరుకున్నారు. దీనిపై అమృతను ప్రశ్నించగా 'పట్టణానికి చెందిన మారుతిరావు అనే వ్యక్తి చనిపోయాడని టీవీల్లో వచ్చింది. చనిపోయింది మా నాన్న మారుతిరావే అనే విషయంలో స్పష్టత లేదు. ఒకవేళ ఆయన చనిపోతే సోమవారం నేనే మీడియా ముందుకు వస్తా'అని చెప్పింది.

## రెండు కుటుంబాలు ఆగం



మారుతిరావు చనిపోయిన విషయం మాకు తెలియదు, ఒకవేళ ఆయన చనిపోతే మాత్రం రెండు కుటుంబాలు ఆగమైనట్లే. మారుతిరావు ఆత్మహత్యపై మాకెలాంటి సమాచారం లేదు. ఒకవైపు మా కుటుంబం, మరోవైపు ఆయన కుటుంబం ఆగమయ్యాయి.

**– బాలస్వామి, ప్రణయ్ తండ్రి**

# మహిళా మావోయిస్టు అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిఫిన్‌బాక్స్, వైర్లు

**ఏటూరునాగారం బస్టాండ్ వద్ద పట్టుకున్న పోలీసులు**

**ఏటూరునాగారం:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మహిళా మావోయిస్టును ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. స్థానిక సీఐ నాగబాబు దీనికి సంబంధించిన వివరాలు మీడియాకు తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఏటూరునాగారంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. బస్టాండ్ వద్ద ఒక మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా ఆమె వద్ద ఉన్న సంచిలో పేలుడు పదార్థాలు, పేలుళ్లకు వాడే టిఫిన్‌బాక్స్, వైర్లు, విప్లవ సాహిత్యం లభించిందని చెప్పారు. ఆమెను విచారించగా, తన పేరు హేమ్లు జయమతి, భర్త పేరు మడకం ఉంగ, ఛత్తీస్‌గఢ్‌లోని మురియగొండి మండలం పుల్లుం గ్రామవాసిగా తెలిపిందని సీఐ నాగబాబు వెల్లడించారు. ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ పోలీసులకు తెలపగా ఆమె నేరచరిత్రపై వివరాలు పంపించారని చెప్పారు. మావోయిస్టు పార్టీలో ఆమె 14 సంవత్సరాల నుంచి పని చేస్తోందని, 2017లో పామేడు ఏరియా కమిటీలో పనిచేసిన జయమతి పలు ఎన్‌కౌంటర్లలో పాల్గొని తప్పించుకుందని చెప్పారు. 2013 ఏప్రిల్, మే మధ్యకాలంలో చిన్నగల్లెం, బాన్సిగూడ పీఎస్ పరిధిలో పోలీసు పార్టీని చంపడానికి జరిపిన కాల్పుల్లో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. తాజాగా పామేడు కమిటీ సెక్రటరీ మనీల ఆదేశాల మేరకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఏటూరునాగారం వచ్చి గుర్తు తెలియని వ్యక్తి దగ్గర నుంచి పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యం తీసుకొని తిరిగి ఛత్తీస్‌గఢ్ వెళ్లేందుకు ఏటూరునాగారం బస్టాండ్‌కు రాగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నామని వివరించారు. జయమతిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రూ.8 లక్షల రివార్డు ప్రకటించిందని చెప్పారు.



Nalgonda, Miryalguda, Suryapet: 7303762953

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com